వారం రోజుల్లో ఎంబీబీఎస్ కౌన్సెలింగ్

వదంతులు నమ్మి ఆందోళన చెందవద్దు

వెబ్ ఆప్షన్ల నమోదుకు సిద్ధంగా ఉండండి

విద్యార్థులకు మంత్రి దామోదర సూచనలు

12

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



పోర్ట్‌బ్లెయిర్ ఇక

శ్రీ విజయపురం

అండమాన్ నికోబార్ రాజధాని పేరు మార్పు

2

శనివారం | 14-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 168 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి రా. 8.42 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ఉత్తరాషాఢ రా. 8.32 తదుపరి శ్రవణం; వర్జ్యం: తే.ఉ.6.45, రా.12.14-1.43; దుర్ముహూర్తం: ఉ.6.06-7.43; అమృతఘడియలు: మ.2.24-3.56; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.14 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కేజ్రీకి బెయిల్

సీబీఐ కేసులో మంజూరు చేసిన సుప్రీంకోర్టు



జైలు గోడలు నా మనోధైర్యాన్ని దెబ్బతీయలేవు. జైలుకు పంపాక నా మనోధైర్యం 100 రెట్లు పెరిగింది. దేశాన్ని బలహీనపరచాలని చూస్తున్న జాతి వ్యతిరేక శక్తులపై నా పోరాటం ఆగదు. నా ప్రతి రక్తపు బొట్టు దేశ సేవ కోసమే. నా జీవితంలో ఎన్నో కష్టాలు అనుభవించా. అయితే దేవుడు ఆ కష్ట సమయాల్లో నాకు మద్దతుగా ఉన్నాడు.

- అరవింద్ కేజ్రీవాల్

ఇంతకుముందే ఈడీ కేసులో విముక్తి

జైలు నుంచి విడుదలైన ఢిల్లీ సీఎం

విచారణ సందర్భంగా.. సీబీఐ తీరును తప్పుబట్టిన అత్యున్నత న్యాయస్థానం

బెయిల్ మీద విడుదలవుతుంటే అరెస్టు చేయాల్సినంత తొందరేమిటి?

పంజరంలో చిలుకలా ఉండొద్దు

నిష్పాక్షికంగా వ్యవహరించండి

దర్యాప్తు సంస్థకు ధర్మాసనం హితవు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించి సీబీఐ నమోదు చేసిన కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. నేర నిరూపణ జరగకుండానే నిందితులను సుదీర్ఘకాలంపాటు జైలులో నిర్బంధించటం వారి వ్యక్తిగత స్వేచ్ఛ హక్కును హరించటమేనని అత్యున్నత న్యాయస్థానం మరోమారు స్పష్టం చేసింది. పంజరంలో చిలుకలా కాకుండా.. స్వేచ్ఛగా తిరిగే చిలుకలా ఉండాలని సీబీఐకి హితబోధ చేసింది. ఢిల్లీ మద్యం విధానం కేసులో ఈడీ దాఖలు చేసిన అభియోగాల నుంచి కేజ్రీవాల్‌కు గతంలోనే బెయిల్ లభించిన విషయం తెలిసిందే. అయితే, అదే కేసులో సీబీఐ ఆయనను

మిగతా 2వ పేజీలో...

బీజేపీ నియంతృత్వాన్ని వీడాలి

2

సత్యం ఓడిపోదు: ఆప్.. పదేళ్లుగా దర్యాప్తు సంస్థల దుర్వినియోగం: కాంగ్రెస్

ఇది రాజ్యాంగం సాధించిన విజయం: ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్



అలంపూర్ సభలో మంత్రులు తుమ్మల, జూపల్లి

భరోసా.. ఇకపై

పంట వేసిన రైతులకే..

ఎకరానికి 2 సీజన్లకు కలిపి రూ.15 వేలు

ఈ పథకం కింద గత ప్రభుత్వం రూ.25 వేల కోట్లు వృథా చేసింది

త్వరలో మరో 3 లక్షల మందికి రుణమాఫీ

రూ.2 లక్షలకు పైగా ఉన్నవారికి కూడా..

ఇప్పటికే రూ.18 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం: మంత్రి తుమ్మల

అలంపూర్ చౌరస్తా, సెప్టెంబరు 13: ఇక నుంచి పంట వేసిన వారికే రైతుభరోసా(పంట సాయం) ఇవ్వనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఎకరాకు ఏడాదికి రెండు సీజన్లకు కలిపి రూ.15 వేలు ఇస్తామని, ఈ నగదు పంట సాగు చేసిన రైతులకే ఇవ్వాలన్నది తమ ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో శుక్రవారం నూతన మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి మరో మంత్రి జూపల్లితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. గత ప్రభుత్వం

మిగతా 12వ పేజీలో...

ఆపదలో ఉన్నాం..

ఆదుకోండి



వరద నష్టం పరిశీలన కోసం రాష్ట్రానికి వచ్చిన కేంద్ర బృందంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి, సీఎస్

కేంద్రం ఎలాంటి షరతులు లేకుండా నిధులు ఇవ్వాలి

రాష్ట్రం మునిగినా ఎన్డీఆర్ఎఫ్ నిధులు వాడుకోలేని స్థితి

ఎస్డీఆర్, ఎన్డీఆర్ఎఫ్‌కు పొంతన లేకపోవడం వల్లే..

1350 కోట్ల నిధులున్నా రూపాయి వాడుకోలేకపోతున్నాం

విపత్తు నిధులపై ఉన్న నిబంధనలను కేంద్రం సడలించాలి

మున్నేరు ముప్పు నివారణకు రిటైనింగ్ వాల్ తప్పనిసరి

నిర్మాణానికి కేంద్రం సహకరిస్తే మా వాటా నిధులిస్తాం

వైపరీత్యాలపై హెచ్చరికల కోసం ఓ వ్యవస్థ ఉండాలి: సీఎం

కేంద్ర బృందంతో భేటీ.. 10 వేల కోట్ల నష్టంపై నివేదిక

'తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవానికి' రండి

కేంద్ర మంత్రులు అమిత్ షా, గజేంద్రసింగ్, కిషన్‌రెడ్డి, సంజయ్‌లకు సీఎం రేవంత్ ఆహ్వానం

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విపత్తుల నిధుల వినియోగానికి సంబంధించి అమల్లో ఉన్న కఠిన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం సడలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్డీఆర్ఎఫ్‌లో రూ.1,350 కోట్లు అందుబాటులో ఉన్నా.. ప్రస్తుత నిబంధనల ప్రకారం రూపాయి కూడా వాడుకునే పరిస్థితి లేదని కేంద్ర బృందాలకు వివరించారు. కేంద్రం నిబంధనల ప్రకారం.. ఒక కిలోమీటరు రోడ్డు దెబ్బతింటే కేవలం రూ.లక్ష ఖర్చు చేయాలని నిర్ణయించారని, ఈ రేట్ల ప్రకారం తాత్కాలిక మరమ్మతులు కూడా చేయలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన తెలంగాణకు తక్షణమే ఆర్థికసాయం అందించాలని.. ఆపదలో ఉన్న

మిగతా 12వ పేజీలో...

ట్రాఫిక్ వలంటీర్లుగా ట్రాన్స్‌జెండర్లు!

క్లీన్ సిటీ కోసం ఇండోర్ మోడల్ అనుసరించండి

12 పనులు చేయని కాంట్రాక్టర్ల నివేదిక ఇవ్వండి

జీహెచ్ఎంసీ పనులపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

ఆగని రగడ



ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఇంటి ముట్టడికి వచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

కౌశిక్‌రెడ్డి, అరికెపూడి గాంధీ వివాదంతో ఉద్రిక్తత

గాంధీ ఇంటికి వెళ్లేందుకు బీఆర్ఎస్ నేతల యత్నం

హరీశ్, కౌశిక్, శంభీపూర్ రాజు సహా నేతల హౌస్ అరెస్టు

జిల్లాల్లోనూ పెద్దఎత్తున బీఆర్ఎస్ నేతల గృహ నిర్బంధాలు

చికిత్స కోసం పోలీసు భద్రత నడుమ ఆస్పత్రికి హరీశ్‌రావు

ప్రాంతీయ విభేదాలు సృష్టికి కౌశిక్ యత్నం: గాంధీ

ఆంధ్రా సెటిలర్లపై నాకు ఎంతో గౌరవం ఉంది

నేను చేసిన వ్యాఖ్యలు గాంధీపై వ్యక్తిగతమైనవే: కౌశిక్‌రెడ్డి

కౌశిక్‌రెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలి: దానం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మధ్య రాజుకున్న రగడ శుక్రవారం మరింత ఉద్రిక్తతకు దారితీసింది. వందలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి తాను గాంధీ ఇంటికి వెళతానని కౌశిక్‌రెడ్డి ప్రకటించడం, రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తలు తరలి రావాలని పార్టీ నాయకత్వం పిలుపునిచ్చిన నేపథ్యంలో రోజంతా ఉద్రిక్త వాతావరణం

మిగతా 13వ పేజీలో...

దాడి చేయించింది సీఎం, డీజీపీ కాదా?

ఫిర్యాదుకు వెళ్తే అరెస్టులా?

హత్యాయత్నం చేసిన వారికి బందోబస్తా?

రాష్ట్రంలో ఎమర్జెన్సీ కన్నా దారుణ పరిస్థితులు

సీఎంకు పాలన కన్నా పైసలపైనే ధ్యాస: హరీశ్‌రావు

13

అత్యాచారం చేయబోయిన డాక్టర్‌పై నర్సు సర్జికల్ స్ట్రైక్

సర్జికల్ బ్లేడుతో మర్మాంగం కోసివేత

బిహార్‌లోని గంగాపూర్‌లో ఘటన



పట్నా, సెప్టెంబరు 13: కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటన మరువక ముందే.. బిహార్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఒక నర్సుపై సామూహిక అత్యాచార యత్నం జరిగింది. ఓ వైద్యుడు తన ఇద్దరు సహచరులతో కలిసి ఈ దారుణానికి పాల్పడగా.. నర్సు వైద్యుడి మర్మాంగాన్ని సర్జికల్ బ్లేడ్‌తో కోసేసి తప్పించుకుంది. అనంతరం ఆమె పోలీసులకు సమాచారమివ్వగా.. వారు వెంటనే అక్కడికి చేరుకొని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బిహార్‌లోని సమస్తిపూర్ జిల్లా గంగాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఈ ఘటన

మిగతా 2వ పేజీలో...

హైడ్రా తీరు ఆందోళనకరం

చట్టబద్ధత లోపించినట్టుంది

జీహెచ్ఎంసీ అధికారాలు ఎలా బదలాయిస్తారు?: హైకోర్టు

వివరాలు సమర్పించాలని సర్కారుకు ఆదేశం.. జీవోపై స్టేకు నిరాకరణ

హైడ్రా భయంతో ఇక కబ్జాలుండవు

ఎవరూ ఆ ధైర్యం చేయలేరు

వైసీపీ నేత కాటసాని భార్య పిటిషన్‌పై హైకోర్టు వ్యాఖ్య

14

త్వరలో హైడ్రా వెబ్‌సైట్!

చెరువుల వివరాలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాల సమాచారం

హైడ్రాకు సర్కారు 50 కోట్లు విడుదల

అబూజ్‌మడ్‌లో ఆర్మీ యుద్ధ అభ్యాస కేంద్రం!



- ట్యాంకులు, ఫిరంగులు తదితర ఆయుధాలు, యుద్ధ వ్యూహాలపై శిక్షణ
- నక్సలిజంపై పోరులో కీలక పరిణామం
- 1,34,778 ఎకరాల సేకరణకు కేంద్రం ఓకే
- ఛత్తీస్‌గఢ్- మహారాష్ట్ర- తెలంగాణ మధ్య మావోయిస్టులకు చెక్ పెట్టడమే లక్ష్యం

భూపాలపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల ఉద్యమానికి ఆయువుపట్టుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో భారత సైన్యం పాగా వేయనుంది. ఈ ప్రాంతంలో యుద్ధ అభ్యాస కేంద్రం ఏర్పాటుకు కేంద్ర సర్కారు సన్నద్ధమవుతోంది. నారాయణపూర్ జిల్లా ఓర్చా మండలం సోన్‌పూర్ గర్పా అటవీ ప్రాంతంలో ఈ అభ్యాస కేంద్రం ఏర్పాటు కానుంది. దీంతో మావోయిస్టు ఉద్యమంపై మరింత ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. 4 వేల చ.కి.మీ. మేర విస్తరించి ఉన్న అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో ఎక్కడ ఏం ఉంటుందో ఇప్పటివరకూ ఎవరికీ తెలియదు. ఇదో మార్మిక ప్రాంతంగా

మిగతా 3వ పేజీలో...

నిమ్స్‌లో పిల్లలకు ఉచితంగా

గుండె శస్త్రచికిత్సలు

ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు యూకే వైద్య బృందం ఆధ్వర్యంలో..

14

సోమేశ్ కుమార్‌కు నోటీసులు!

జీఎస్టీ కేసులో మాజీ సీఎస్‌కు జారీ

వాణిజ్య పన్నుల అధికారులపైనా విచారణ

అసలు నిందితుల్ని గుర్తించే పనిలో సీఐడీ

వంటనూనెలు భగ్గు!

ముడి, శుద్ధి చేసిన సన్‌ఫ్లవర్, సోయాబీన్ ఆయిల్‌పై దిగుమతి సుంకం భారీగా పెంపు

నూనెల ధరలు పెరిగే అవకాశం

12

హైజాక్ అయిన విమానంలో నాన్న.. విడిపించే బృందంలో నేను..

» 1984నాటి సంఘటనను గుర్తుచేసుకున్న జైశంకర్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: వివాదాస్పదంగా మారిన నెట్‌ఫ్లిక్స్ సీరీస్ 'ఐసీ 814 కాందహార్ హైజాక్'పై విదేశాంగ మంత్రి జైశంకర్ శుక్రవారం స్పందించారు. ఆ సిరీస్‌ను తాను ఇంకా చూడనప్పటికీ దర్శకులు మాత్రం ప్రభుత్వంపై సదభిప్రాయాన్ని కలిగించలేదని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదులు 1999లో భారత విమానాన్ని కాందహార్‌కు హైజాక్ చేశారు. ఈ సీరీస్‌పై అభిప్రాయం చెబుతునే 1984లో జరిగిన మరో విమానం హైజాక్ ఉదంతాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. జెనీవాలో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. "1984లో ఓ విమానం హైజాక్ జరిగింది. అప్పుడు నేను యువ అధికారిని. ఆ విమానాన్ని విడిపించే బృందంలో పనిచేస్తున్నాను. హైజాక్ అయిన ఆ విమానంలో మా నాన్న ఉన్నారని అప్పుడే తెలిసింది! హైజాకర్ల నుంచి విమానాన్ని విడిపించే బృందంలో నేనున్నాను.. తమ వారిని రక్షించాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నవారిలో మా కుటుంబ సభ్యులు ఉన్నారు. ఇదో విచిత్ర పరిస్థితి" అని జైశంకర్ చెప్పారు. జైశంకర్ తండ్రి సుబ్రమణ్యం ఐఏఎస్ అధికారి.

జీఎస్టీని తగ్గించాలంటే.. క్షమాపణ చెప్పిస్తారా?



నిర్మలకు క్షమాపణలు చెబుతున్న శ్రీనివాసన్

చెన్నై-ఆంధ్రజ్యోతి/న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: జీఎస్టీని సరళతరం చేయాలని కోరిన అన్నపూర్ణ గ్రూప్ హోటల్స్ యజమాని శ్రీనివాసన్‌తో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల క్షమాపణలు చెప్పించుకొన్నారంటూ వైరల్ అయిన వీడియో రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. ప్రజలు తమ సమస్యలు చెప్పకూడదా అని కాంగ్రెస్ పార్టీ నిర్మలను నిలదీసింది. 'బహిరంగ వేదికలపై పదేపదే ఇలా చేయడం నిర్మలకు అలవాటుగా మారింది' అని ఖర్గే విమర్శించారు. 'ఓ చిన్న వ్యాపారి సులభతర జీఎస్టీ విధానం కావాలని అడిగితే అహంకారంతో అగౌరవపరుస్తారు. అదే కోటీశ్వరుడైన మిత్రుడు కోరితే చట్టాలను మార్చేస్తారు. జాతీయ సంపదను అతడికి కట్టబెడతారు' అని రాహుల్ ఆరోపించారు. నిర్మల ఈ నెల 11న కోయంబత్తూరులో వ్యాపారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసన్ జీఎస్టీని ప్రస్తావించారు. బన్‌పై జీఎస్టీ లేదని.. కానీ దానిపై క్రీమ్ రాస్తే 18% జీఎస్టీ వేస్తున్నారని.. దీంతో కస్టమర్లు ఈ రెంటినీ వేర్వేరుగా అడుగుతున్నారని, క్రీమ్ తామే బన్‌పై పూసుకుంటామని చెబుతున్నారని ఆయన చెప్పారు. ఉత్తరాది వారు స్వీట్లు ఎక్కువ తింటారని.. వాటిపై మంత్రి 5 శాతమే జీఎస్టీ వేశారని.. దక్షిణాదిన, తీపి, ఉప్పు, కాఫీ కలిపి తీసుకుంటారని.. దీనిపై మాత్రం 12% వేశారని జనం అనుకుంటున్నారని.. జీఎస్టీ గందరగోళంతో కంప్యూటర్ కూడా పనిచేయడం లేదని నవ్వుతూ వ్యాఖ్యానించారు. ఆయన చెప్పింది పరిశీలిస్తానని నిర్మల చెప్పారు. అయితే, ఈ వ్యవహారంపై మర్నాడు శ్రీనివాసన్.. తనకు ఏ పార్టీతోనూ సంబంధం లేదంటూ నిర్మలకు క్షమాపణ చెప్పారు.

వాళ్లు భారత్‌ను రక్తసిక్తం చేయాలనుకుంటున్నారు

» రాహుల్‌పై మళ్లీ విరుచుకుపడిన ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్

జైపూర్, సెప్టెంబరు 13: ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో చేసిన వ్యాఖ్యలపై ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ మరోసారి విమర్శలు గుప్పించారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వాళ్లు విదేశీగడ్డపై ఎలా ప్రవర్తించాలో తెలియక దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తూ దేశ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని ఆయన మండిపడ్డారు. జాతీయతా భావంతో వారు ఎందుకు రాజీపడుతున్నారో, తల్లి భారతిని రక్తసిక్తం చేయాలని ఎందుకనుకుంటున్నారో తనకు బోధపడటంలేదన్నారు. అజ్మీర్‌లోని రాజస్థాన్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ధన్‌ఖడ్ ప్రసంగించారు. రాహుల్ అమెరికా పర్యటనలో ఎన్నికల సంఘంపై విమర్శలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు.

టైట్లర్‌పై హత్యానేరం.. అభియోగాలు నమోదు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: ఇందిరా గాంధీ హత్య అనంతరం 1984లో సిక్కులకు వ్యతిరేకంగా జరిగిన అల్లర్లకు సంబంధించి కాంగ్రెస్ నేత జగదీశ్ టైట్లర్‌పై హత్యానేరం నమోదయింది. శుక్రవారం ఇక్కడి ప్రత్యేక కోర్టులో హత్యా నేరంతో పాటు, అల్లర్లను ప్రోత్సహించడం, శతృత్వాన్ని పెంచడం వంటి అభియోగాలు నమోదయ్యాయి. ఆయన విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుందని ప్రత్యేక జడ్జి రాకేశ్ సియాల్ తెలిపారు. 1984 నవంబరు ఒకటో తేదీన తెల్లని అంబాసిడర్ కారులో పుల్ బంగేష్ గురుద్వారా వద్దకు వచ్చిన టైట్లర్ ప్రజలను రెచ్చగొట్టారని, అందువల్లనే ముగ్గురు హత్యకు గురయ్యారంటూ ప్రత్యక్ష సాక్షి వాంగ్మూలం ఇచ్చారు.

కమలతో మరోసారి సంవాదం ఉండదు: ట్రంప్

వాషింగ్టన్, సెప్టెంబరు 13: అమెరికా అధ్యక్ష పదవికి డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కమలా హారి‌స్‌తో మరోసారి సంవాదం ఉండబోదని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. మంగళవారం ఆయన కమలా హారిస్‌తో జరిగిన డిబేట్‌లో పాల్గొనగా, అంతకు ముందు జూన్‌లో అధ్యక్షుడు జో బైడెన్‌తో జరిగిన డిబేట్‌లో పాల్గొన్నారు. కమలా హారిస్‌తో జరిగినదే చివరి డిబేట్ అని ప్రకటించారు. రిపబ్లికన్ పార్టీ నాయకులు మాత్రం మళ్లీ డిబేట్ ఉండాలని భావిస్తున్నారు. దీన్ని తిరస్కరించిన ట్రంప్ "ప్రైజ్ మనీ కోల్పోయినవారే రీమ్యాచ్ జరగాలని కోరుకుంటార"న్నారు.

బ్రిటిష్ దౌత్యవేత్తలపై రష్యా కొరడా..ఆరుగురిపై వేటు

మాస్కో, సెప్టెంబరు 13: బ్రిటిష్ దౌత్యవేత్తలపై రష్యా కొరడా ఝుళిపించింది. గూఢచర్యానికి పాల్పడుతున్నారనే ఆరోపణలతో రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్.. బ్రిటన్‌కు చెందిన ఆరుగురు దౌత్యవేత్తలను బహిష్కరించింది. తమ దేశం ఓడిపోవాలనే ఏకైక లక్ష్యంతో బ్రిటన్ విదేశీ కార్యాలయం దౌత్యవేత్తలను ప్రత్యేకంగా పంపిందని పేర్కొంది. ఇంటెలిజెన్స్, విధ్వంసకర కార్యకలాపాల పనుల్లో వారి దౌత్యవేత్తలను భాగస్వాములను చేసిందని ఆరోపించింది.

సజీవంగానే లాడెన్ కుమారుడు!

కాబూల్, సెప్టెంబరు 13: ఉగ్రవాద సంస్థ ఆల్‌ఖైదా వ్యవస్థాపకుడు ఒసామా బిన్ లాడెన్ కుమారుడు హమ్జా బిన్ లాడెన్ బతికే ఉన్నట్లు నిఘా వర్గాలను ఉటంకిస్తూ 'ది మిర్రర్' పత్రిక పేర్కొంది. అఫ్ఘానిస్థాన్‌లో ఉంటూ ఆల్‌ఖైదా పునరేకీకరణ ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు సోదరుడు అబ్దుల్లా బిన్ లాడెన్‌తో కలిసి పశ్చిమ దేశాలపై దాడులకు పన్నాగం పన్నుతున్నట్లు వివరించింది. 2019లో అమెరికా జరిపిన దాడుల్లో హమ్జా హతమైనట్లు ఇప్పటివరకు భావిస్తున్నారు. హమ్జా ఉత్తర అఫ్ఘాన్‌లోని పంజ్‌షిర్ పర్వత శ్రేణుల్లో తలదాచుకుంటున్నట్లు సమాచారం.

కేజ్రీకి బెయిల్

(మొదటి పేజీ తరువాయి)

అరెస్టు చేయటంతో.. జైలు నుంచి విడుదల కాలేదు. ఢిల్లీ హైకోర్టు కేజ్రీవాల్‌కు బెయిల్‌ను నిరాకరించింది. దీంతో, కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపిస్తూ.. బెయిల్ కోసం కేజ్రీవాల్ తొలుత విచారణ కోర్టుకు వెళ్లలేదని, కాబట్టి, ఆయన విజ్ఞప్తిని విచారణ కోర్టుకు బదిలీ చేయాలని పేర్కొన్నారు. బెయిల్ కోసం తొలుత ట్రయల్ కోర్టుకు వెళ్లాలన్నది వాస్తవమేనని ధర్మాసనం అంగీకరిస్తూ.. హైకోర్టు ఈ కేసుపై విచారణ జరిపినప్పుడు.. కేసును కింది కోర్టుకు బదిలీ చేసి ఉండాల్సిందని స్పష్టం చేసింది. 'ఈ దశలో ఇప్పుడు, తిరిగి ఈ కేసును విచారణ కోర్టుకు పంపించటం సరైంది కాదు. బెయిల్ వ్యక్తిగత స్వేచ్ఛతో ముడివడిన అంశం. ఇటువంటి కేసులను వాటిలో ఉన్న సానుకూలతల (మెరిట్స్) ఆధారంగా నిర్ణయించాలేగానీ.. సాంకేతిక అంశాలను చూపుతూ కోర్టుల మధ్య తిరిగేలా చేయకూడదు' అని పేర్కొంది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో దర్యాప్తు సమీప భవిష్యత్తులో పూర్తయ్యేలా లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

న్యాయమూర్తులు.. విడిగా తీర్పులు

కేజ్రీవాల్‌కు బెయిల్ ఇస్తూనే.. తీర్పును న్యాయమూర్తులిద్దరూ వేర్వేరుగా వెలువరించారు. జస్టిస్ సూర్యకాంత్ 27 పేజీల తీర్పును, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ 33 పేజీల తీర్పును ఇచ్చారు. సీబీఐ తీరును జస్టిస్ భుయాన్ ప్రశ్నించారు. ఈడీ కేసులో బెయిల్ వచ్చి జైలు నుంచి కేజ్రీవాల్ విడుదలయ్యే తరుణంలో ఆయనను సీబీఐ అరెస్టు చేయటాన్ని ప్రశ్నించారు. 'దేశంలోని ఒక ఉన్నతస్థాయి దర్యాప్తు సంస్థ సీబీఐ. ప్రజాశ్రేయస్సు దృష్ట్యా సీబీఐ నిష్పక్షపాతంగా ఉండటమే కాదు.. అలా ఉన్నట్లు కనిపించాలి. సీజర్ భార్యలాగా ఒక దర్యాప్తు సంస్థ కూడా నిష్పాక్షికంగా ఉండాలి. కొంతకాలం కిందటే ఈ కోర్టు సీబీఐని పంజరంలో చిలకతో పోల్చింది. తనపై ఉన్న ఈ ముద్రను సీబీఐ తొలగించుకోవాలి' అని జస్టిస్ భుయాన్ హితవు పలికారు. (దర్యాప్తు మొదలైన తర్వాత) 22 నెలల సుదీర్ఘ కాలవ్యవధిలో లేని తొందర.. ఈడీ బెయిల్ మంజూరు చేయగానే ఎందుకు వచ్చింది? అప్పటికప్పుడే కేజ్రీవాల్‌ను ఎందుకు అరెస్టు చేశారు? అని నిలదీశారు. ఇవే అభియోగాలకు సంబంధించి ఈడీ కేసులో బెయిల్ లభించిన వ్యక్తిని ఇంకా జైలులో నిర్బంధించటం అంటే న్యాయాన్ని నిరాకరించటమేనన్నారు.

మద్యం కేసు ఫైళ్లపైనే ఆంక్షలు: సింఘ్వీ

ఢిల్లీ మద్యం కేసుకు సంబంధించిన ఫైళ్లు తప్ప ఇతర ఏ ఫైల్ మీదైనా సీఎం కేజ్రీవాల్ సంతకం చేయవచ్చని, బెయిల్ ఆంక్షలు కేవలం మద్యం పాలసీ ఫైళ్లకు మాత్రమే పరిమితమని ఆయన తరఫున వాదించిన అభిషేక్ సింఘ్వీ తెలిపారు. కేజ్రీవాల్ విడుదలయ్యారుకానీ.. ఎటువంటి అధికారాలు ఉండవంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. కేజ్రీవాల్ అధికారాల్ని ఢిల్లీ ప్రభుత్వం లేదా రాష్ట్రపతి పాలన తప్ప మరే శక్తీ తొలగించలేదని పేర్కొన్నారు.



కేజ్రీవాల్, సిసోదియా ఆత్మీయ ఆలింగనం

సీఎం ఆఫీసుకు వెళ్లొద్దు..

సీఎం కార్యాలయానికి, ఢిల్లీ సచివాలయానికి వెళ్లొద్దని, అధికారిక ఫైళ్లపై సంతకం చేయవద్దని, ఏదైనా ఫైల్ మీద సంతకం తప్పనిసరైతే ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి తీసుకోవాలని కేజ్రీవాల్ మీద ఈడీ కేసులో బెయిల్ ఆంక్షలు ఉన్నాయి. కాగా, ప్రస్తుత సీబీఐ కేసులో కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేస్తూ.. ఈడీ కేసు బెయిల్‌లో విధించిన ఆంక్షలనే విధించటం గమనార్హం. రూ.10 లక్షల వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని, ఇదే మొత్తంతో ఇద్దరు ష్యూరిటీ ఇవ్వాలని పేర్కొంటూ బెయిల్ ఇచ్చింది. కేసుపై బహిరంగంగా ఎటువంటి వ్యాఖ్యానాలు చేయవద్దని కేజ్రీవాల్‌ను ఆదేశించింది. కేజ్రీవాల్‌ను ఈడీ మార్చి 21వ తేదీన అరెస్టు చేసింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మే 10న ఆయనకు తాత్కాలిక బెయిల్ లభించింది. జూన్ 3వ తేదీన ఆయన తిరిగి జైలుకు వెళ్లారు. జూలై 12న ఈడీ కేసులో బెయిల్ లభించింది.



కేజ్రీకి బెయిల్ రావడంతో ఆప్ కార్యకర్తల సంబరాలు

మనోధైర్యం 100 రెట్లు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: కేజ్రీవాల్ తీహార్ జైలు నుంచి శుక్రవారం విడుదలయ్యారు. అనంతరం జైలు దగ్గర తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన ఆప్ కార్యకర్తలను ఉద్దేశించి ఓ వాహనం పై నుంచి మాట్లాడుతూ... జైలు గోడలు తన మనోధైర్యాన్ని దెబ్బతీయలేవని, జైలుకు పంపాక తన మనోధైర్యం 100 రెట్లు పెరిగిందని చెప్పారు. దేశాన్ని బలహీనపరచాలని చూస్తున్న జాతి వ్యతిరేక శక్తులపై తన పోరాటం ఆగదన్నారు. ఈ సందర్భంగా ఇంక్విలాబ్ జిందాబాద్, వందే మాతరం... అని కేజ్రీవాల్ నినదించారు. తన విడుదల కోసం ప్రార్థించిన వారికి ధన్యవాదాలు చెప్పారు. వర్షంలోనూ తన కోసం వచ్చిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తన ప్రతి రక్తపు బొట్టు దేశ సేవ కోసమేనన్నారు. తన జీవితంలో ఎన్నో కష్టాలు అనుభవించానని, అయితే దేవుడు ఆ కష్ట సమయాల్లో తనకు మద్దతుగా ఉన్నాడని.. తాను నిజాయితీపరుడిని కనుక ఇప్పుడూ తన వెంటే నిలిచాడని చెప్పారు. పంజాబ్ సీఎం భగ్వంత్ మాన్, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా, వందలాది మంది ఆప్ కార్యకర్తలు కేజ్రీవాల్‌కు స్వాగతం పలికారు.



హరియాణాలో ఆప్‌నకు ఊపు!

» అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి కేజ్రీవాల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: అధినేత కేజ్రీవాల్ జైలు నుంచి విడుదల హరియాణా ఎన్నికల్లో తమ పార్టీకి మేలు చేస్తుందని ఆప్ శ్రేణులు భావిస్తున్నాయి. ఢిల్లీ పొరుగునే ఉండే ఈ రాష్ట్రంలో అక్టోబరు 5న పోలింగ్ జరగనుంది. కాంగ్రెస్‌తో పొత్తు చర్చలు కొలిక్కి రాకపోవడంతో ఆప్ ఒంటరిగా పోటీ చేస్తోంది. మరోవైపు మొత్తం 90 సీట్లకు గాను కాంగ్రెస్ 89 చోట్ల బరిలో దిగింది. ఒక స్థానాన్ని సీపీఎంకు ఇచ్చింది. వాస్తవానికి ఆనుకుని ఉండే ఢిల్లీ, పంజాబ్‌లో అధికారంలో ఉన్నప్పటికీ హరియాణాలో ఆప్ ఇంతవరకు ఒక్క సీటూ గెలవలేదు. ఈ సారి ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌తో కలిసి వెళ్లాలని తొలుత భావించినా అది కుదరలేదు. దీంతో 40 సీట్లలో అభ్యర్థులను దింపింది. కాగా, 2019 ఎన్నికల్లో 46 సీట్లలో పోటీ చేసిన ఆప్.. ఒక్క శాతం ఓట్లు కూడా సాధించలేకపోయింది. నోటా కంటే కొన్ని ఎక్కువ ఓట్లు మాత్రమే పొందింది. ఈసారి ఎన్నికలు మరింత ప్రతిష్ఠాత్మకంగా మారడం, నిన్నటివరకు కేజ్రీవాల్ జైల్లో ఉండడంతో హరియాణాలో ఆప్ ప్రచారాన్ని భుజాన మోసేదెవరనే ప్రశ్న వేధించింది. ఇప్పుడు కేజ్రీ బయటకు రావడంతో ఎన్నికల్లో పోరాటానికి శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం వచ్చింది. కేజ్రీ ప్రసంగాలు, సూటి ప్రశ్నలు ఓట్లు రాలుస్తాయని భావిస్తున్నాయి. కొందరు కార్యకర్తలైతే ఆయన ఎన్నికల ముఖచిత్రాన్ని మారుస్తారని అంటున్నారు. హరియాణా ఎన్నికల బాధ్యత మొత్తాన్ని కేజ్రీనే మోస్తారని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు. కేజ్రీ విడుదల హరియాణాలో పార్టీకి పునరుత్తేజం చేస్తుందని మరో నాయకుడు పేర్కొన్నారు. వివిధ కీలక అంశాలపై ఇప్పటివరకు పార్టీ విధానాలను స్పష్టంగా చెప్పలేకపోయామని, ఇకపై ఆ బెంగ లేదన్నారు.

సత్యం ఎప్పటికీ ఓడిపోదు..

» బీజేపీ నియంతృత్వం వీడాలి: ఆప్

» పదేళ్లుగా దర్యాప్తు సంస్థల దుర్వినియోగం: కాంగ్రెస్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: అధినేత కేజ్రీవాల్‌కు బెయిల్ లభించడంపై ఆప్ సంతోషం వ్యక్తం చేసింది. కేజ్రీలాంటి నిజాయతీపరుడిని జైల్లో పెట్టినందుకు దేశానికి క్షమాపణ చెప్పాలని బీజేపీని డిమాండ్ చేసింది. సత్యానికి సమస్యలు ఎదురవొచ్చని.. ఎప్పటికీ ఓడిపోదని పేర్కొంది. బీజేపీ అబద్ధాలు బయటపడ్డాయని.. ఇకనైనా నియంతృత్వం వీడాలని హితవు పలికింది. ఈడీ, సీబీఐలు బీజేపీ చెప్పినట్లు పలికే చిలుకలు అని అభివర్ణించింది. సత్యమేవ జయతే అంటూ ట్వీట్ చేసింది. అసత్యాలు, కుట్రలపై నిజం గెలిచిందని ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా అన్నారు. కష్ట కాలంలో తమకు అండగా నిలిచిన కార్యకర్తలకు కేజ్రీ సతీమణి సునీత ధన్యవాదాలు తెలిపారు. పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ వ్యాఖ్యానించింది. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని తక్కువ సీట్లకే పరిమితం చేశారని తెలిపింది. కేజ్రీకి బెయిల్ లభించడాన్ని రాజ్యాంగం సాధించిన విజయం అని ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ అన్నారు. రాజ్యాంగ వ్యతిరేకులైన బీజేపీకి చెంపపెట్టు అని పేర్కొన్నారు. కాగా, కేజ్రీకి వచ్చింది షరతులతో కూడిన బెయిల్ మాత్రమేనని బీజేపీ పేర్కొంది. నిన్నటివరకు ఆయన జైల్‌వాలా అని.. నేడు బెయిల్‌వాలా అయ్యారని ఎద్దేవా చేసింది. సీఎం పదవికి కేజ్రీవాల్ రాజీనామా చేయాలని.. కానీ, నైతికత ఏమాత్రం లేని ఆయన ఆ పని చేయరని వ్యాఖ్యానించింది.

ఉల్లి, బాస్మతి బియ్యం ఎగుమతులకు కనీస ధర ఎత్తివేత

» మహారాష్ట్ర, హరియాణాలో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: మహారాష్ట్ర, హరియాణాలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉల్లి, బాస్మతి బియ్యం ఎగుమతులకు సంబంధించిన కనీస ధరను శుక్రవారం ఎత్తివేసింది. విదేశాలకు వీటి ఎగుమతులకు ఊతమివ్వడానికే కాకుండా రైతుల ఆదాయం పెరగడానికి ఈ నిర్ణయం దోహదపడనుంది. పంజాబ్‌తోపాటు హరియాణా బాస్మతి బియ్యాన్ని ప్రధానంగా ఉత్పత్తి చేస్తున్నాయి. మహారాష్ట్రలో రైతులు ఎక్కువగా ఉల్లిని సాగుచేస్తుంటారు. తాజా నిర్ణయం వల్ల ఈ రైతులకు ప్రయోజనం కలుగనుంది. వాణిజ్య విభాగం సమాచారం ప్రకారం.. బాస్మతి బియ్యంపై టన్నుకు 950 డాలర్లుగా ఉన్న కనీస ఎగుమతి ధరను తొలగించారు. ఇక ఉల్లి విషయానికి వస్తే.. ఈ ఏడాది మే నెలలో ఉల్లి ఎగుమతులపై ప్రభుత్వం నిషేధాన్ని ఎత్తివేసింది. కానీ టన్ను ఉల్లి ఎగుమతులకు కనీస ఎగుమతి ధర (ఎంఈపీ)ను 550 డాలర్లుగా నిర్ణయించింది. ఈ మేరకు రైతులు ఉల్లిగడ్డలను ఈ రేటుకన్నా తక్కువకు విదేశీ మార్కెట్లకు విక్రయించడానికి వీలుండదు. తాజాగా ఉల్లిపై ఎంఈపీ తొలగించారు. ఇదిలా ఉండగా.. ధరల పెరుగుదలను నియంత్రించే చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం గోధుమ నిల్వలపై శుక్రవారం మరిన్ని చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా వ్యాపారులు, టోకు అమ్మకందారులు, బిగ్ చెయిన్ రిటైలర్లు, ప్రాసెసర్ల వద్ద ఉండాల్సిన నిల్వల పరిమితులను మరింత కుదించింది. వ్యాపారులు కేవలం 2వేల టన్నుల గోధుమలను మాత్రమే నిల్వ ఉంచుకోవడానికి అనుమతిస్తారు.


దేశం గొప్ప నాయకుడ్ని కోల్పోయింది

ఏచూరి పేదల కోసం పోరాడిన నేత.. ఆయన మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నా: చంద్రబాబు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల కోసం పోరాడిన వ్యక్తి సీతారాం ఏచూరి అని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. ఆయన చేసిన పోరాటాన్ని వాళ్లు శాశ్వతంగా గుర్తుపెట్టుకుంటారని చెప్పారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి ఏచూరితో తనకు ఆత్మీయ అనుబంధం ఉందని తెలిపారు. అందుకే ఆయన్ను కడసారి చూసి, నివాళులు అర్పించేందుకు ఢిల్లీ వచ్చినట్లు చెప్పారు. చంద్రబాబు శుక్రవారమిక్కడ సీతారాం ఏచూరి భౌతికకాయానికి నివాళులర్పించారు. ఏచూరి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏచూరి మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నానన్నారు. 40 ఏళ్లుగా ఆయన్ను దగ్గరి నుంచి చూశానని, మంచి నాయకుడని చెప్పారు. ఎన్నో పోరాటాల్లో ఆయనతో కలిసి నడిచినట్లు తెలిపారు. ఒక సాధారణ కుటుంబంలో పుట్టిన సీతారాం అసాధారణ వ్యక్తిగా ఎదిగారన్నారు. కమ్యూనిజం పట్ల ఆసక్తి పెంచుకుని, ఆ పార్టీలో చేరి అంచలంచెలుగా ఎదిగి, పార్టీకి జాతీయ ప్రధాన కార్యదర్శి అయ్యారని కొనియాడారు. అందరినీ నవ్వుతూ పలకరిస్తూ కలుపుగోలుగా ఉండేవారని గుర్తు చేసుకున్నారు. దేశం గొప్ప రాజకీయ నాయకుడిని కోల్పోయినందుకు బాధగా ఉందని చెప్పారు. అంతకుముందు ఏచూరి మృతదేహాన్ని ఎయిమ్స్ నుంచి జేఎన్‌యూకు తరలించారు. తర్వాత ఆయన స్వగృహానికి తరలించారు. మరోవైపు, కేరళ సీఎం పినరయి విజయన్, జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ నేత, కాంగ్రెస్ నేత కన్నయకుమార్ తదితరులు ఏచూరి మృతదేహానికి నివాళులు అర్పించారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఏపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, పార్టీ నేతలు జూలకంటి రంగారెడ్డి, వీరయ్య, బి.వెంకట్ తదితరులు నివాళులర్పించారు.



ఏచూరి భౌతికకాయం వద్ద ఏపీ సీఎం చంద్రబాబు నివాళి



ఏచూరి కుటుంబసభ్యులకు చంద్రబాబు పరామర్శ

నేడు ఎయిమ్స్‌కు భౌతిక కాయం

సీతారాం ఏచూరి భౌతిక కాయాన్ని నేడు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సీపీఎం ప్రధాన కార్యాలయంలో ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. అనంతరం ఏచూరి కోరిక మేరకు ఆయన మృతదేహాన్ని ఎయిమ్స్‌కు అప్పగించనున్నారు.

'లాల్ సలామ్ కామ్రేడ్'

ఏచూరికి జేఎన్‌యూ విద్యార్థుల నివాళి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: జవహలాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)కు చెందిన వందలాది మంది విద్యార్థులు, అధ్యాపకులు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి శుక్రవారం ఘన నివాళి అర్పించారు. జేఎన్‌యూఎస్‌యూ కార్యాలయంలో ఉంచిన సీతారాం ఏచూరి పార్థివ దేహాన్ని సందర్శించి లాల్ సలామ్ కామ్రేడ్ అంటూ నినదిస్తూ వీడ్కోలు పలికారు. జేఎన్‌యూ పూర్వ విద్యార్థి అయిన సీతారాం ఏచూరి.. 1977-78 మధ్య జేఎన్‌యూఎస్‌యూ(జేఎన్‌యూస్టూడెంట్స్ యూనియన్) అధ్యక్షుడిగా 3సార్లు పని చేశారు.

ఎంపాక్స్‌కు తొలి టీకా

» తయారు చేసిన బేవేరియన్ నార్డిక్ సంస్థ

» 18 ఏళ్లు నిండిన వారికి ఇచ్చేందుకు డబ్ల్యూహెచ్‌వో తాజాగా అనుమతి

జెనీవా, సెప్టెంబరు 13: ఆఫ్రికా ఖండంలో ఆందోళనకర స్థాయిలో విస్తరిస్తున్న ఎంపాక్స్ వ్యాధి నియంత్రణ కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) మొట్టమొదటిసారిగా ఓ టీకాకు అనుమతినిచ్చింది. ఎంపాక్స్‌పై పోరులో ఇది కీలక ఘట్టంగా డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ అభివర్ణించారు. ఎంపాక్స్ టీకాను డెన్మార్క్‌కు చెందిన బేవేరియన్ నార్డిక్ అనే సంస్థ తయారు చేసింది. ఇది రెండు డోసుల వ్యాక్సిన్ అయితే, దీన్ని 18ఏళ్లు నిండినవారికే వేయాలని డబ్ల్యూహెచ్‌వో సూచించింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. యునిసెఫ్‌లాంటి అంతర్జాతీయ సంస్థలు ఈ టీకాను కొని, పంపిణీ చేయవచ్చని తెలిపింది. కానీ, ప్రస్తుతం టీకాను ఒకే సంస్థ ఉత్పత్తి చేస్తున్నందున సరఫరా చాలా తక్కువగా ఉంది. మరోవైపు, ఎంపాక్స్ వ్యాధి పిల్లల్లోనే ఎక్కువగా విస్తరిస్తోంది. కాంగోలో గతవారం నమోదైన ఎంపాక్స్ కేసుల్లో 70%మంది 18ఏళ్లలోపు వారే కావడం గమనార్హం. ఇదిలా ఉండగా, ఆఫ్రికా ఖండంలో గడిచిన వారంలో 3,160 ఎంపాక్స్ కేసులు నమోదయ్యాయి. 107 మంది ఈ వైరస్ కారణంగా చనిపోయారు.

పోర్ట్‌బ్లెయిర్ ఇక శ్రీ విజయపురం

» అండమాన్ నికోబార్ రాజధాని పేరు మార్పు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: అండమాన్ నికోబార్ దీవుల రాజధాని పోర్ట్‌బ్లెయిర్ పేరు శ్రీ విజయపురంగా మారింది. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం 'ఎక్స్' ద్వారా ప్రకటించారు. దేశంలో వలస పాలన తాలూకా ఆనవాళ్లను తుడిచివేయాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పోర్ట్‌బ్లెయిర్ పేరులో బ్రిటీష్ వారసత్వం ప్రతిబింబిస్తోందని, స్వాతంత్ర్యం సిద్ధించడంలో ఈ ప్రాంతం కీలక భూమిక వహించినందున విజయానికి ప్రతీకగా 'శ్రీ విజయపురం' అనే పేరును ఖరారు చేశామని పేర్కొన్నారు. చారిత్రక ప్రాశస్తి కలిగిన ఈ ప్రాంతం... చోళుల కాలంలో నౌవికా స్థావరంగా ఉండేదని, ఇప్పటికీ దేశ వ్యూహాత్మక స్థావరంగా ఉపయోగపడుతోందన్నారు. నేతాజీ సుభాశ్ చంద్రబోస్ తొలిసారిగా మన మువ్వన్నెల పతాకాన్ని ఇక్కడే ఎగురవేశారని. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా వీర్ సావర్కర్ లాంటి ఎంతో మంది దేశభక్తులు జైలు శిక్షను అనుభవించిన సెల్యూలర్ జైలు ఇక్కడే ఉందని పేర్కొన్నారు. కాగా, అండమాన్ నికోబార్ అనేది 572 దీవుల సమూహం. వీటిలో 38 దీవుల్లో ప్రజలు నివసిస్తున్నారు. అనేక సుందర దీవులకు, బీచ్‌లకు నిలయమైన ఈ ప్రాంతం దేశ పర్యాటకంలోనే అగ్రగామిగా విలసిల్లుతోంది.

అత్యాచారం చేయబోయిన డాక్టర్‌పై నర్సు సర్జికల్ స్ట్రైక్

(మొదటి పేజీ తరువాయి)



డాక్టర్ సంజయ్‌కుమార్

చోటుచేసుకుంది. ఆ ఆస్పత్రిలో ఏడాదిగా నర్సు పని చేస్తోంది. బుధవారం రాత్రి ఆమె విధులు ముగించుకొని ఇంటికెళ్తుండగా.. ఆస్పత్రి నిర్వాహకుడైన డాక్టర్ సంజయ్ కుమార్ సంజు, తన సహచరులు సునీల్ కుమార్ గుప్తా, అవధేశ్ కుమార్‌లతో కలసి అడ్డుపడ్డాడు. అప్పటికే పూటుగా మద్యం సేవించిన వారు నర్సును వేధించసాగారు. ఈనేపథ్యంలోనే సంజయ్ ఆమెను పక్కకు లాక్కెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. దీంతో తీవ్రంగా ప్రతిఘటించిన ఆమె.. చేతికి దొరికిన సర్జికల్ బ్లేడుతో అతడి మర్మాంగంపై దాడి చేసింది. వెంటనే అక్కడి నుంచి పరిగెత్తగా.. సునీల్, అవధేశ్ ఆమెను వెంబండించారు. ఈ నేపథ్యంలోనే ఓ చోట దాక్కొని ఎమర్జెన్సీ నంబర్ 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చింది. అప్రమత్తమైన పోలీసులు అక్కడికి చేరుకొని ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. గాయపడిన వైద్యుడికి ఓ ఆస్పత్రిలో గోప్యంగా చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలంలో సర్జికల్ బ్లేడ్, రక్తంతో తడిసిన బెడ్ షీట్లతో పాటు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అత్యాచార యత్నానికి ముందే ఆస్పత్రిలోని సీసీ కెమెరాలను నిందితులు ఆఫ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

తొలి వాణిజ్య స్పేస్ వాక్

» నిర్వహించి చరిత్ర సృష్టించిన స్పేస్ ఎక్స్

» కమర్షియల్ స్పేస్‌వాక్ చేసిన తొలి వ్యక్తిగా జారెడ్ ఐజక్‌మ్యాన్ రికార్డ్



రోదసిలో జారెడ్; చిత్రంలో నీలివర్ణంలో భూమి

వాషింగ్టన్, సెప్టెంబరు 13: టెస్లా చీఫ్ ఈలన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ సంస్థ సరికొత్త చరిత్ర సృష్టించింది! ఇన్నాళ్లుగా ప్రభుత్వ నిధులతో, అనుభవజ్ఞులైన వ్యోమగాములు మాత్రమే చేసిన స్పేస్ వాక్‌ను (రోదసిలో నడక).. తన పోలారిస్ డాన్ మిషన్‌లో భాగంగా వాణిజ్యపరంగా నిర్వహించింది! వ్యోమగాములు కాని ఇద్దరు వ్యక్తులతో స్పేస్‌వాక్ చేయించింది. ఆ సంస్థ చేపట్టిన పోలారిస్ డాన్ మిషన్‌లో భాగంగా.. అమెరికాకు చెందిన అపర కుబేరుడు, పైలట్.. జారెడ్ ఐజక్‌మ్యాన్ (41) భారత కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం ఇంచుమించుగా నాలుగున్నర గంటల సమయంలో.. భూమికి 700కి.మీ. ఎత్తున క్రూడ్రాగన్ వ్యోమనౌక నుంచి బయటకు వచ్చి, స్కైవాకర్ హ్యాండ్‌రైల్ సిస్టమ్ ద్వారా తొలి కమర్షియల్ స్పేస్‌వాక్ చేసి, చరిత్రలో నిలిచారు. జారెడ్‌తోపాటు అదే వ్యోమనౌకలో వెళ్లిన మిగతా ముగ్గురిలో.. సారా గిల్లీస్ అనే మహిళ కూడా కొంతసేపు స్పేస్‌వాక్ చేసింది. ఆమె స్పేస్‌ఎక్స్ ఇంజనీర్. భవిష్యత్తులో చంద్రుడి మీదకి, కుజుడి మీదకు వెళ్లి దీర్ఘకాలంపాటు ఉండే మిషన్లను నిర్వహించే యోచనలో ఉన్న స్పేస్ ఎక్స్ సంస్థ.. వ్యోమగాముల కోసం ప్రత్యేకమైన 'ఈవీఏ' సూట్లను అభివృద్ధి చేసింది. ఈవీఏ సూట్లంటే.. ఎక్స్‌ట్రా వెహిక్యులార్ యాక్టివిటీ సూట్లు. అంటే వ్యోమగాములు వ్యోమనౌకల నుంచి బయటకు వచ్చినప్పుడు అక్కడ ఉండే పీడనాన్ని తట్టుకునేలా రూపొందించిన సూట్లు. వాటిని పరీక్షించేందుకే స్పేస్ ఎక్స్ సంస్థ ఈ మిషన్‌ను నిర్వహించింది.



జారెడ్, సారా గిల్లీస్

కుల గణనపై పాత సభ్యులతో కొత్త కమిషన్ భేటీ

- గతంలో జరిగిన కసరత్తుపై చర్చ
- ఇతర రాష్ట్రాల్లో కుల గణన జరిగిన తీరుపై ఆరా

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కుల గణన, రిజర్వేషన్ల ఖరారుపై పూర్వ బీసీ కమిషన్ చేసిన కసరత్తు వివరాలు తెలుసుకునేందుకు కొత్త కమిషన్ పాత వాళ్లతో భేటీ అయింది. ఆగస్టు 31 వరకు ఉనికిలో ఉన్న పాత కమిషన్ ఈ విషయంలో కొంత కసరత్తు చేయడంతో ఆ వివరాలు తెలుసుకునేందుకు కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్, సభ్యులు పాత కమిషన్ ఛైర్మన్లు, సభ్యులతో భేటీ అయ్యారు. వివిధ రాష్ట్రాల్లో కుల గణన జరిగిన తీరును, అక్కడ ఎదురైన ఇబ్బందులు, కోర్టు కేసుల గురించి చర్చించినట్లు తెలిసింది. కుల గణన పూర్తయి రిజర్వేషన్లు సక్రమంగా అమలు కావాలంటే ముందుగా ఆయా రాష్ట్రాల్లో జరిగిన గణన తీరుతెన్నులు, జరిగిన లోపాలు, కోర్టులు ఎందుకు అక్కడ రిజర్వేషన్ల ప్రక్రియ నిలిపి వేశాయో క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని పాత కమిషన్ సభ్యులు సూచించారు. క్వాలిఫైడ్ ఎన్యుమరేటర్లతో స్పష్టమైన పద్ధతిలో ప్రశ్నావళి రూపొందించాలన్నారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్, గణాంక విభాగం, సెస్ లాంటి సంస్థల సహకారం కోరాలన్నారు. ఈ ప్రక్రియపై సమగ్ర అధ్యయనం జరిగిన తర్వాత గణన మొదలుపెడితే చిక్కులు తలెత్తవని అభిప్రాయపడినట్లు తెలిసింది. కాగా గణన ప్రక్రియ పూర్తయ్యే వరకు పాత కమిషన్ ఛైర్మన్, సభ్యులు కొత్త కమిషన్‌కు సహకరిస్తామని, ఎప్పుడు పిలిచినా వచ్చి అంశాలను చర్చించేందుకు సిద్ధమని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి, పూర్వ ఛైర్మన్‌లు బీఎస్. రాములు, వకుళాభరణం కృష్ణమోహన్, మాజీ సభ్యులు డాక్టర్ ఆంజనేయులు గౌడ్, జూలూరి గౌరీ శంకర్, సిహెచ్ ఉపేంద్ర, శుభప్రద్ పటేల్, కె.కిషోర్ గౌడ్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

- పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయం ఎదుట మాజీ సర్పంచుల నిరసన

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు రాలేవని, తమ పదవీ కాలం పూర్తయి ఏడు నెలలైనా ప్రభుత్వ విభాగాలు పట్టించుకోవడంలేదని మాజీ సర్పంచులు ఆరోపించారు. ఈమేరకు తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, ఇతర కార్యవర్గ సభ్యులు శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. 2019-24 మధ్య ప్రభుత్వ విభాగాలు పలు సందర్భాల్లో సర్క్యులర్లు జారీ చేసి.. నిధులు విడుదల చేయకుండానే తమతో పనులు చేయించాయని.. ఆ పనుల కోసం అప్పులపాలైన తమను ఇప్పుడు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ బిల్లులను తక్షణం చెల్లించే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

మీ పాస్‌పోర్టులు సరెండర్ చేయండి

- జోగి రమేశ్, అవినాశ్‌కు సుప్రీం ఆదేశం
- ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, తలశిలకు కూడా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంపై దాడి, టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసుల్లో వైసీపీ నేతలు జోగి రమేశ్, దేవినేని అవినాశ్, ఒగ్గు గవాస్కర్, ఆ పార్టీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం తమ పాస్‌పోర్టులను 48 గంటల్లో దర్యాప్తు అధికారులకు సరెండర్ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. పోలీసుల విచారణకు సహకరించాలని స్పష్టం చేసింది. దర్యాప్తు అధికారులు ఎప్పుడు పిలిస్తే అప్పుడు వారి ముందు హాజరు కావాలని తేల్చిచెప్పింది. తదుపరి విచారణను నాలుగు వారాలపాటు వాయిదా వేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు పిటిషనర్లపై ఎలాంటి చర్యలూ వద్దని పోలీసులకు స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు జారీచేసింది. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో అవినాశ్, అప్పిరెడ్డి, తలశిల.. చంద్రబాబు ఇంటిపై కేసులో జోగి రమేశ్‌తో పాటు మరికొందరిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆ కేసుల్లో ముందస్తు బెయిల్ కోసం వారు దాఖలు చేసిన పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఆ తీర్పును ఈ నెల 9న అవినాశ్, అప్పిరెడ్డి, తలశిల, ఒగ్గు గవాస్కర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అలాగే.. తనకు న్యాయం చేయాలని ఈ నెల 10న జోగి రమేశ్ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, నీరజ్ కిషన్ కౌశల్, అల్లంకి రమేశ్.. రాష్ట్రప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ లూథ్రా హాజరయ్యారు. వైసీపీ నేతల దాడులకు సంబంధించిన సీసీ ఫుటేజీలను రోహత్గీ, లూథ్రా న్యాయస్థానానికి అందించారు. వాటిని తర్వాత పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. దేవినేని అవినాశ్ గతంలో విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నించారని రోహత్గీ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇరు పక్షాల వాదనలను విన్న ధర్మాసనం.. 48 గంటల్లో పాస్‌పోర్టులు సరెండర్ చేయాలని పిటిషనర్లను ఆదేశించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదావేసింది.

కంబోడియాలో ఉద్యోగం పేరుతో సైబర్ నేరాల ఉచ్చులోకి

ముంబైకి చెందిన మహిళా ఏజెంట్ అరెస్ట్.. ఆమె వలకు చిక్కిన ఇద్దరు హైదరాబాదీలు

- వారి ఫిర్యాదుతో కేసు నమోదు
- పోలీసుల అదుపులో ఏజెంట్

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం పేరుతో భారతీయులను కంబోడియాకు పంపించి.. అక్కడ వారితో బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తున్న ముంబై ముఠా సభ్యురాలిని హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె పేరు.. ప్రియాంక శివకుమార్ సిద్దు (30). ముంబైలోని చెంబూర్ ప్రాంతానికి చెందిన ప్రియాంక.. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పించే లైసెన్స్‌డ్ సంస్థలో తొలుత పనిచేసేది. ఆ సంస్థ మూతపడిపోవడంతో ఆమె ఎలాంటి అనుమతులూ లేకుండా అలాంటి సంస్థనే ప్రారంభించింది. విదేశాల్లో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు వల వేసి.. వారిని పర్యాటక వీసాలపై వేరే దేశాలకు పంపించేది. అక్కడికి వెళ్లాక ఆ వీసాలను ఉద్యోగ వీసాలుగా మార్చుకోవచ్చని నమ్మబలికేది. ఈ క్రమంలో ఆమెకు ముంబైలోనే ఇదే తరహా మోసాలు చేసే నారాయణ అనే వ్యక్తితో పరిచయమైంది. అతడు ఆమెను.. జితేందర్ షా అలియాస్ అమీర్‌ఖాన్ అనే వ్యక్తికి పరిచయం చేశాడు. అతడు కంబోడియాలో ఉంటూ.. చైనాకు చెందిన ఝూన్ జెయ్ అనే కంపెనీలో డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. వేరే దేశాలకు చెందిన నిరుద్యోగులను అక్కడికి రప్పించి.. వారితో సైబర్ నేరాలు చేయించే కంపెనీ అది. ఈ విషయం నారాయణ ద్వారా తెలుసుకున్న ప్రియాంక స్వయంగా కంబోడియాకు వెళ్లి పరిశీలించింది. తమ సంస్థలో పనిచేసేందుకు యువకుల్ని పంపిస్తే ఒక్కో వ్యక్తిని పంపినందుకు 500 డాలర్లు కమీషన్ ఇస్తామని అతడు ప్రియాంకకు చెప్పాడు. ఈ మేరకు డీల్ కుదుర్చుకుని ఇండియాకు తిరిగొచ్చిన ఆమె.. తొలుత తన సోదరి కుమారుడైన అక్షయ్ వైద్య, అతడి స్నేహితుడు డానిష్‌ఖాన్‌ను కంబోడియాకు పంపింది. వాళ్లు అక్కడికి వెళ్లి సైబర్ నేరాలు చేయడం మొదలుపెట్టారు. ఆ తర్వాత పేపర్లలో ప్రకటనలు, ఇతర ప్రచార మాధ్యమాల్లో కంబోడియాలో ఉద్యోగాల పేరుతో ప్రచారం చేసుకుని చాలామందిని అక్కడికి పంపింది. ఈ క్రమంలోనే.. ప్రియాంక ప్రచారాన్ని నమ్మి హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఆమెను సంప్రదించారు. ఒక్కొక్కరి నుంచి రూ.30 వేలు చొప్పున వారి వద్ద కమీషన్ తీసుకున్న ప్రియాంక.. వారిద్దరినీ కంబోడియాకు పంపింది. సైబర్ నేరాలు చేయడానికి ఆ ఇద్దరూ ఒప్పుకోకపోవడంతో.. అక్కడివారు వారిని శారీరకంగా, మానసికంగా చిత్రహింసలు పెట్టారు. ఎలాగోలా ఆ చైనా సంస్థ నుంచి తప్పించుకుని భారతదేశానికి వచ్చేసిన ఇద్దరి ఫిర్యాదు మేరకు.. సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు కేసు నమోదు చేశారు. ముంబైకి వెళ్లి ప్రియాంకను అరెస్ట్ చేశారు. విదేశీ ఉద్యోగాలనగానే ఆశపడి.. నకిలీ కన్సల్టెన్సీల మాటలు నమ్మి మోసపోవద్దని బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ ప్రజలకు సూచించారు.

శ్రీశైలం, ఆల్మట్టి ప్రాజెక్టుల గేట్లు బంద్

కృష్ణా బేసిన్‌లో ఇప్పటిదాకా 2 వేల మిలియన్ యూనిట్లు దాటిన జల విద్యుత్ ఉత్పత్తి

గద్వాల/హైదరాబాద్, సెప్టెంబరు 13 : కృష్ణా బేసిన్‌లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో శుక్రవారం శ్రీశైలం, ఆల్మట్టి జలాశయాల గేట్లను మూసేశారు. కేవలం విద్యుత్ ఉత్పత్తి ద్వారానే నీటి విడుదల జరుగుతోంది. కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టుకు 40 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 42 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నారాయణపూర్‌కు 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. రెండు గేట్ల ద్వారా 11,800 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 6 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు 62 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. నాలుగు గేట్ల ద్వారా 16,636 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 39,320 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 82 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 67 వేల క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు వదులుతున్నారు. సాగర్‌కు 68,210 క్యూసెక్కుల వరద వస్తుండటంతో రెండు గేట్లను ఎత్తి 16,180 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కుడి కాల్వ ద్వారా 10,567 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 3,667 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,151 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


నాగార్జున సాగర్ రెండు గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

జలవిద్యుత్ జోరు..

కృష్ణా బేసిన్‌లోని రిజర్వాయర్ల వద్ద జలవిద్యుత్ ఉత్పత్తి గురువారం నాటికి 2 వేల మిలియన్ యూనిట్లు దాటింది. ఇందులో అత్యధికంగా శ్రీశైలం భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 879 మిలియన్ యూనిట్లు.. సాగర్‌లో ప్రధాన కేంద్రంతో పాటు ఎడమ కాల్వపై ఉన్న కేంద్రంలో కలిపి 758.77 మిలియన్ యూనిట్ల కరెంటు ఉత్పత్తి జరిగింది. జూరాలలో 163.40 మిలియన్ యూనిట్లు, లోయర్ జూరాలలో 134.72 మిలియన్ యూనిట్లు, పులిచింతలలో 74.39 మిలియన్ యూనిట్ల కరెంటు తయారైంది. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులో 12.88 మిలియన్ యూనిట్లు, సింగూరులో 3.96 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది.

ద.మ. రైల్వేకు 5 ఇంధన పరిరక్షణ అవార్డులు

- రైల్ నిలయానికి 'ఇంధన సామర్థ్యం' అవార్డు

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ ఇంధన నిర్వహణతో దక్షిణ మధ్య రైల్వే 5 ఇంధన పరిరక్షణ అవార్డులు అందుకుంది. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నిర్వహించిన నేషనల్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ కార్యక్రమంలో అవార్డులను ఉన్నతాధికారులు అందుకున్నారు. భవనాల విభాగంలో ద.మ. రైల్వే ప్రధాన కార్యాలయమైన రైల్ నిలయానికి 'ఇంధన సామర్థ్యం' అవార్డు దక్కింది. రైల్ నిలయానికి సంబంధించి 100% ఎల్ఈడీ లైట్లు, బీఎల్‌డీసీ ఫ్యాన్లు, ఆధునిక లిఫ్టులు, స్టార్ రేటెడ్ ఏసీల ఏర్పాటు, సోలార్ వాటర్ హీటర్ల వినియోగం, విద్యుత్తు ఆదాకు టైమర్లు, ఆక్యుపెన్సీ సెన్సర్ల వాడకం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డును ప్రకటించారు. ఇటు సికింద్రాబాద్‌లోని లేఖా భవన్, హైదరాబాద్ భవన్, మౌలాలిలోని జోనల్ రైల్వే ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, లాలాగూడలోని క్యారేజ్ వర్క్‌షాప్‌నకు కూడా సీఐఐ అవార్డులు దక్కాయి. దీనిపై ద.మ. రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ.. ఇంధన పొదుపులో దక్షిణ మధ్య రైల్వే ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఐదు అవార్డులు రావడానికి కృషి చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు.

అబూజ్‌మడ్‌లో ఆర్మీ యుద్ధ అభ్యాస కేంద్రం!

(మొదటి పేజీ తరువాయి)

గుర్తింపు పొందింది. గోండుభాషలో అబూజ్ అంటే రహస్యమైన(మార్మిక) కొండలు కలిగిన ప్రాంతమని అర్థం. ఇలాంటి దట్టమైన అడవిని, కొండలను కేంద్ర స్థానంగా చేసుకొని మావోయిస్టు పార్టీ ఇక్కడ సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతోంది. ఈ ప్రాంతంలో ప్రభుత్వ అధికారుల జాడ ఉండదు. అలాంటి అబూజ్‌మడ్‌లో ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పోలీస్ స్థావరాలను ఏర్పాటు చేసి ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై పైచేయి సాధిస్తూ వస్తున్నాయి. సైనిక యుద్ధ అభ్యాసన కోసం గుర్తించిన స్థలం కూడా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర మధ్య మావోయిస్టులకు గట్టి పట్టున్న ప్రాంతానికి మధ్యలో ఉండడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం ఈ యుద్ధ అభ్యాస కేంద్రానికి అనుమతి ఇవ్వడం ద్వారా నక్సలైట్ల ఏరివేత ఆపరేషన్లలో దూకుడుగా వెళ్తున్న పోలీస్ బలగాలకు మరింత చేయూతనిచ్చినట్లు అవుతుందని భావిస్తున్నారు. సైనికులు యుద్ధ అభ్యాసం కోసం ఈ శిబిరంలో పాల్గొంటారే తప్ప నక్సలైట్ల ఏరివేతకు, దీనికి సంబంధం లేదని ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నప్పటికీ స్థావరం ఏర్పాటు వల్ల నాలుగు అంచెల రక్షణ వ్యవస్థలు అందుబాటులోకి వస్తాయని నిపుణులు చెబుతున్నారు. తద్వారా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో నక్సలైట్ల ఏరివేత మరింత సులభతరం అవుతుందని పేర్కొంటున్నారు. ఇక్కడ యుద్ధ అభ్యాస కేంద్రం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన 2017లోనే తెరపైకి వచ్చింది. అప్పట్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, గడ్చిరోలి తదితర జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి సర్వేలు కూడా జరిపారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లో ఏరియల్ సర్వేలూ చేపట్టారు. ఇటీవల కేంద్ర పర్యావరణ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలోనే భూసేకరణ ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

యుద్ధ అభ్యాస కేంద్రానికి 1.34 లక్షల ఎకరాలు..

సైనిక యుద్ధ అభ్యాస కేంద్రానికి 1,34,778 ఎకరాల స్థలాన్ని సేకరించే బాధ్యతను ఛత్తీస్‌గఢ్ సర్కారు నారాయణపూర్ కలెక్టర్‌కు అప్పగించింది. త్వరగా స్థలాన్ని సేకరించి సైన్యానికి అందజేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది. ఈ కేంద్రం వల్ల అత్యవసర పరిస్థితుల్లో సైనిక బలగాలు సిద్ధంగా ఉండేలా వివిధ ట్యాంకులు, ఫిరంగులు వంటి పలు ఆయుధాలపై శిక్షణ, యుద్ధ వ్యూహాల అమలు వంటి కీలక అంశాలపై పునశ్చరణ చేసుకునే వీలు కలుగుతుందని ఓ పోలీస్ ఉన్నతాధికారి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

లారీ టెర్రర్

- డివైడర్‌ను దాటి ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ
- అదే సమయంలో మరో లారీ మధ్య నలిగిన బస్సు
- ఇద్దరు డ్రైవర్లు సహా ఏడుగురు బలి
- చిత్తూరు జిల్లాలో ఘోరం.. సీఎం సంతాపం
- మృతులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా



బంగారుపాళ్యం, సెప్టెంబరు 13: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలోని మొగిలి ఘాట్ రోడ్డు మలుపులో శుక్రవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు వైపు నుంచి ఐరన్ లోడ్‌తో వస్తున్న లారీ అదుపు తప్పి డివైడర్‌ను దాటి.. తిరుమల నుంచి వెళ్తున్న ఆర్టీసీ బస్సును వేగంగా.. బలంగా ఢీకొంది. ఈ దెబ్బకు బస్సు వెనుదిరిగిపోయింది. బస్సు వెనుక వైపు గ్రానైట్ రాళ్ల లోడుతో వస్తున్న మరో లారీ కూడా బస్సును ఢీకొంది. దీంతో బస్సు రెండు లారీల మధ్య నుజ్జునుజ్జయింది. ఐరన్ లోడ్ లారీ క్యాబిన్ నామరూపాల్లేకుండా పూర్తిగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో బస్ డ్రైవర్, ఐరన్ లోడ్‌తో వచ్చి ఢీకొన్న లారీ డ్రైవర్‌తో పాటు బస్సులోని ఐదుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించారు. బస్సులోని 28 మందికి, రెండోసారి ఢీకొన్న లారీలోని ముగ్గురికి గాయాలయ్యాయి. రక్తమోడిన మృతదేహాలు, క్షతగాత్రులతో అక్కడి పరిస్థితి భీతావహంగా మారింది. ఇందులో తీవ్రంగా గాయపడిన 8 మందిని తొలుత పలమనేరులోని ఏరియా ఆసుపత్రికి, ఆ తర్వాత చిత్తూరులో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఎక్కువ మంది బెంగళూరుకు చెందిన వారే ఉన్నారు. బస్సు కండక్టర్ చిరంజీవి పరిస్థితి తీవ్ర విషమంగా ఉండడంతో వేలూరు సీఎంసీకి తరలించారు. 20 టైర్ల ఐరన్ లోడ్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ ఘాట్‌లో ప్రమాదకరమైన పరిస్థితులు లారీ డ్రైవర్‌కు అంచనాలేకపోవడం, అతివేగం కారణంగా చెబుతున్నారు. ఘాట్‌లో ఎడమ వైపు నుంచి దిగువకు(డౌన్) వేగంగా వస్తూ, మలుపు తిప్పలేక నేరుగా డివైడర్‌ను ఢీకొని కుడివైపునకు రావడంతో ఈ ఘోరం జరిగిందని అంటున్నారు.

మృతుల వివరాలివే..

మృతుల్లో తిరుపతి జిల్లా అలిపిరి డిపోకు చెందిన బస్ డ్రైవర్ మనోహరన్ (58), ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బల్లియా జిల్లా ఖరిద్ ఖాజీపూర్ ప్రాంతానికి చెందిన ఐరన్ లోడ్ లారీ డ్రైవర్ సోనుకుమార్ (30), మహారాష్ట్ర రాష్ట్రంలోని జశ్వంత్‌పూర్‌కు చెందిన హన్సిక(6), తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన బాలరాజు (55), తిరుపతి జిల్లా పాకాల మండలం కంబలమెట్టకు చెందిన విజయమ్మ (53), జీడీ నెల్లూరు మండలం ఎస్.ఎస్.కొండ గ్రామానికి చెందిన శంకరరెడ్డి (50) చనిపోయిన వారిలో ఉన్నారని పోలీసులు గుర్తించారు. మరో మహిళ మృతదేహాన్ని గుర్తించాల్సి ఉంది. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరి తదితరులు ఘటనా ప్రాంతానికి వెళ్లి సహాయక ఏర్పాట్లు చేపట్టారు. సీఎం చంద్రబాబు, రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఘటన వివరాలు తెలుసుకుని, మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను సీఎం చంద్రబాబు ప్రకటించినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పలమనేరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

మరో 4 రోజుల్లో ఎన్నికలు ప్రారంభం కానున్న జమ్మూకశ్మీర్‌లో ఇంకా తుపాకీ మోతలు ఆగడం లేదు. కిష్త్వార్ ప్రాంతంలో శుక్రవారం భద్రతాబలగాలకు ఉగ్రవాదులకు మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మరణించగా మరో ఇద్దరు గాయపడ్డారు. - శ్రీనగర్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కమల పైచేయి..!

అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్న డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌తో మరోమారు చర్చకు దిగేది లేదని రిపబ్లికన్‌పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ తేల్చేశారు. తామిద్దరి మధ్యా ఇటీవల జరిగిన తొలి-డిబేట్‌లో కమల ఘోరంగా ఓడిపోయినందున, ఇక మరోమారు ఆమెతో చర్చ అవసరం లేదని ట్రంప్ చెబుతున్నారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యతో ఆయన కమలను ఢీకొనేందుకు భయపడిపోతున్నారని, మొఖం చాటేస్తు-న్నారని కొత్త విమర్శలు ఆరంభమైనాయి. ఇటీవలి ఫిలడెల్ఫియా చర్చలో కమలదే పైచేయి అని అత్యధికులు భావిస్తున్నట్టు పలు సర్వేలు చెప్పిన విషయం తెలిసిందే. ఈ చర్చ ఫలితం, ప్రభావం రేపటి ఎన్నికల ఓటింగ్ మీద ప్రత్యక్షంగా ఉంటుందో లేదో తెలియదు కానీ, ప్రధానంగా తటస్థ ఓటర్లను కమల బాగా ప్రభావితం చేయగలిగారని, ట్రంప్ వీరాభిమాను-లకు వ్యతిరేకత కాస్తంత తగ్గిందని విశ్లేషణలు సాగుతున్నాయి.

అధ్యక్షబరిలో ఆమెకు ఇది తొలిచర్చ. ఇరువురూ ముఖాముఖి కలుసుకో-వడం కూడా ఇదే తొలిసారి. ట్రంప్‌కు ఇప్పటికే అనేకమందిని ఢీకొన్న గతా-నుభవం ఉన్నది. అందువల్ల, ఆయన ముందు కమల నిలువగలదా అని కొందరు అనుమానపడ్డారు. నిజానికి, ఈ చర్చ ట్రంప్– బైడెన్ మధ్య జర-గాలి. అప్పట్లో వీరిద్దరి మధ్యా జరిగిన తొలి ప్రెసిడెన్షియల్ డిబేట్‌ను బాగా ముందుకు జరిపింది కూడా, ట్రంప్ వాగ్ధాటి ముందు బైడెన్ తప్పిజారి నిలువలేకపోయినా, సరిగ్గా ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ జరిగే మరోచ-ర్చలో పైచేయి సాధించవచ్చుననే. కానీ, ఆ తొలిచర్చలోనే బైడెన్ ప్రవర్తన, తడబాటు, మతిమరుపు డెమోక్రాటిక్ పార్టీని భయపెట్టాయి. ట్రంప్ అస-త్యాలు, అర్ధసత్యాలు, వెటకారపు వ్యాఖ్యల ముందు బైడెన్ నిలవలేకపో-యారు. ట్రంప్‌ను సరిగా ఎదుర్కోలేకపోయారన్న విమర్శల నేపథ్యంలో పార్టీనుంచి ఆయనమీద ఒత్తిడిపెరిగింది. మొదట్లో కాస్తంత మొండికేసినా, ఆ తరువాత ఆయనకే అనిపించిందో, మర్యాదగా ఉండదనిపించిందో తెలి-యదు కానీ, ఎట్టకేలకు పక్కకు తప్పుకున్నారు. ఆయన నిష్క్రమణ పార్టీకి కొత్త ఉత్తేజాన్నిచ్చింది. కమలకు నిధుల వరదతోపాటు, మహామహులంతా వరుసపెట్టి మద్దతు నివ్వడం మొదలైంది. పార్టీ అభ్యర్థిత్వాన్ని స్వీకరిస్తూ ఆమె చేసిన ప్రసంగం కూడా చాలామందికి నచ్చింది. ఆ తరువాత ఆమె ప్రజాదరణకూడా హెచ్చినట్టు సర్వేలు తేల్చాయి.

పరోక్షంలో ట్రంప్‌ను విమర్శించడం వేరు, కీలకమైన అంశాలమీద నిర్ది-ష్టమైన, విలువైన, లోతైన చర్చచేస్తూ, ఆయ-నను నేరుగా ఢీకొనడం వేరు. ఎంతో అపార-మైన అనుభవమూ, దాడిసామర్థ్యం ఉన్న ట్రంప్ ఈ చర్చలో వెనక్కుపోయారని, మాట-తీరుకు తోడుగా ఆమె ముఖకవళికలు, ఆత్మ-విశ్వాసం అనేకులను ఆకట్టుకున్నాయని సర్వేలు విశ్లేషిస్తున్నాయి. అమెరికా ఏవో కష్టాలు, అరిష్టాలతో బాధపడుతున్నట్టుగా ట్రంప్ వ్యాఖ్యలన్నీ ఉన్నా-యని, ఇందుకు భిన్నంగా ఎంతో సానుకూల దృక్పథంతో కమల మాట్లాడా-రని అంటున్నారు. ఒకదశ దాటిన తరువాత ట్రంప్ ఆత్మరక్షణలో పడ్డారని, పైచేయి కోసం అసత్యాలకు తోడు అసంబద్ధమైన వ్యాఖ్యలు చేశారని, అస-హనం ప్రదర్శించారని అమెరికన్ మీడియా వ్యాఖ్యానిస్తోంది. కమల పుట్టుక, మూలాల మీద దాడిచేయడం ట్రంప్‌కు కొత్తేమీ కాదు. భారతీయ మూలా-లున్న ఆమెకు తండ్రి వైపునుంచి ఆఫ్రో అమెరికన్ల మద్దతు కూడా విశే-షంగా దక్కుతోందని, డెబ్బ[illegible]తం మంది ఓటర్లు ఆమె పక్షాన ఉన్నారని వార్తలు వస్తున్నాయి. ఈ కారణంగా ఆమె ఆఫ్రో అమెరికన్ కాదని ప్రచారం చేసేందుకు ట్రంప్ ప్రయత్నిస్తుంటారు. ఆమె తండ్రిని దృష్టిలో పెట్టుకొని కాబోలు, ఈమెను మార్క్సిస్టుగా అభివర్ణిస్తుంటారు.

తొంభైనిముషాల పాటు జరిగిన ఈ చర్చలో ఇరువురూ అబార్షన్ల నుంచి యుద్ధాలవరకూ అనేక అంశాలను ప్రస్తావించారు. ప్రధానంగా ఎదురు-దాడితప్ప ఈ చర్చలో వీరిద్దరూ అతిముఖ్యమైన అంశాలకు సైతం తమ పరిష్కారమేమిటో ప్రతిపాదించలేకపోయారన్న విమర్శ లేకపోలేదు. ముఖ్యంగా గాజా యుద్ధం ముగింపు విషయంలో నిర్దిష్టమైన హామీ ఏమీ లేదు. పైగా, ఇజ్రాయెల్ మీద కమల కక్షకట్టారనీ, ఆమె అధికారంలోకి వస్తే ఆ దేశానికి కష్టాలు తప్పవని వ్యాఖ్యానించడం ద్వారా ట్రంప్ యూదుశక్తిని తనవైపు తిప్పుకొనే ప్రయత్నం చేశారు. ఈ చర్చ తరువాత కమల రేటింగ్ మరికాస్తంత పెరిగింది. సర్వేల్లో ఆమె పట్ల కనిపిస్తున్న సానుకూలత అధ్యక్ష ఎన్నికల వరకూ నిలిచి, ఇంకాస్తంత పెరిగి, ఓటింగ్‌లో కూడా ప్రతి-ఫలిస్తుందో లేదో చూడాలి.

భారతీయ వివేకమే కోస్టారిక ఆదర్శం

సెప్టెంబర్ 15న కోస్టారిక 203వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోనున్నది. అదే రోజు భారత్–కోస్టారికల మధ్య దౌత్య సంబంధాల 54వ వార్షికోత్సవం కూడా. 1970లో ఈ రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తి స్థాయిలో ఏర్పడ్డాయి. తదాది పరస్పర ప్రయోజనాలు గల వివిధ రంగాలలో ఉభయ దేశాల మధ్య స్నేహ సహకారాలు నిత్య నూతనంగా వర్ధిల్లుతున్నాయి. భారత్, కోస్టారిక రెండూ సముద్ర తీరస్థ దేశాలు. జీవ వైవిధ్యం అపారంగా ఉన్న దేశాలు. ప్రతిభా సమన్విత మానవ వనరులు పుష్కలంగా ఉన్న దేశాలు. పెరుగుతున్న సముద్ర మట్టం, వాతావరణ మార్పు విషమ ప్రభావాలకు లోనవుతున్న దేశాలు ప్రజాస్వామ్యాన్ని పెంపొం-దించడం, మానవహక్కులను రక్షించడం, మరింత సమ్మిళిత భవిష్యత్తు నిర్మించడం మొదలైన సదాశయాలతో భారత్ , కోస్టారికల మధ్య సంబంధాలు దృఢమవుతున్నాయి.

మధ్య అమెరికాకు సింహద్వారం కోస్టారిక. లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాలతో సంబంధాలు పటిష్ఠం చేసుకునే ప్రయత్నాలలో భారత్‌కు విశ్వసనీయమైన భాగస్వామి కోస్టారిక. అరకోటికి పైగా జనాభా ఉన్న కోస్టారికలో అధికార భాష స్పానిష్ అయినప్పటికీ ఆంగ్లభాషలో సమగ్ర నైపుణ్యమున్నవారు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు 8 ఆదివాసీ తెగలు ఉన్న కోస్టారిక బహుళ జాతులు, సాంస్కృతిక వైవిధ్యానికి సహజ నెలవుగా ఉన్నది. పౌరుల సగటు జీవితకాల పరిమాణం, అత్యధికంగా (పురుషులకు 77, స్త్రీలకు 82 సంవత్సరాలు) ఉన్న దేశాలలో కోస్టారిక ఒకటి.



> కోస్టారిక ప్రజల జీవన తత్వాన్ని వ్యక్తం చేసే తాత్విక భావన 'పుర విడ'. ఈ స్పానిష్ పదానికి అర్థం 'నిర్మలమైన లేదా నిరాడంబర జీవితం'. ఒక తాత్విక భావన మాత్రమే కాదు అదొక జీవన విధానం. జీవితాన్ని పరిపూర్ణంగా జీవించడమే ఆ భావన పరమార్థం. నైసర్గిక పరిసరాల శోభను ఆస్వాదించే సౌందర్యాత్మక దృష్టిని, సామాజిక సంబంధాలను మానవీయం చేసే ఉన్ముఖతను అది కల్పిస్తుంది. ఈ ఆదర్శ తాత్వికతను పురాతన భారతీయ వివేకం 'వసుధైవ కుటుంబకం' గౌరవిస్తుంది, పరిపూరకం చేస్తుంది.

దేశాధ్యక్షుడు రోడ్రిగో చావెస్ నేతృత్వంలో కోస్టారిక ఆర్థికవ్యవస్థ 86.5 బిలియన్ డాలర్ల జీడీపీతో వర్థిల్లుతోంది. 98 శాతం అక్షరాస్యత ఉన్న ఈ దేశంలో సహజంగానే ఉన్నత విద్యకు ఎనలేని ప్రాధాన్యమిస్తుంది. విద్యా వైద్య రంగాలలో భారీ మదుపులు మానవాభివృద్ధికి ఈ మధ్య అమెరికా దేశం ఇస్తున్న ప్రాధాన్యాన్ని విశదం చేసింది. ప్రపంచ శాంతికి అంకితమైన దేశం కోస్టారిక. శాంతికి నిబద్ధతలో భాగంగా 1948 డిసెంబర్ 1న సైన్యాన్ని శాశ్వతంగా రద్దు చేసింది. ఈ అసాధారణ, అభినంద-నీయమైన చర్య తీసుకున్న ఏకైక దేశం కోస్టారిక. ప్రపంచ జీవ వైవిధ్యంలో 5 శాతం కోస్టారికలో ఉన్నది. ఏడాది పొడుగునా ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే కోస్టారిక ప్రపంచ పర్యాటకులకు గమ్యంగా ఉన్నది. మధ్య అమెరికాలో సిరిసంపదలే కాకుండా పర్యావరణ చైతన్యం అధికంగా ఉన్న దేశం కోస్టారిక అని నిస్సం-కోచంగా చెప్పవచ్చు.

దౌత్య సంబంధాలు నెలకొన్నది మొదలు భారత్, కోస్టారికల మధ్య వాణిజ్య సంబంధాలు ఇతోధికంగా పెరుగుతూ వస్తున్నాయి. వివిధ రంగాలలో పరస్పర సహకారానికి అవి అనేక అవకాశాలను కల్పిస్తున్నాయి. 2016–22 సంవత్సరాల మధ్య కోస్టారికాకు మోటార్ వెహికల్స్ కార్లు, అగ్రో కెమికల్స్, ఫార్మాస్యూటికల్స్‌ను పెద్ద ఎత్తున ఎగుమతి చేసింది. అదే కాలంలో భారత్‌కు కోస్టారిక ఎగుమతులలో దారు ఉత్పత్తులు, మెడికల్, సైంటిఫిక్ ఇన్[illegible] మెంట్స్, సర్జికల్ ప్రోడక్ట్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ మొదలైనవి ఉన్నాయి జౌళి, వ్యవసాయ ఉత్పత్తులలో ద్వై[illegible]క్షిక వాణిజ్యం పెరిగే అవకాశాలు ఇతోధికంగా ఉన్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉభయ దేశాల మధ్య 301 మిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగింది. ఇన్ఫోసిస్, విప్రో, డబ్ల్యుఎన్ఎస్, ఎల్ అండ్ టి ఇన్ఫొటెక్, సిఎస్ఎస్ కార్పొరేషన్ మొదలైన ఇండియన్ కంపెనీలు కోస్టారికలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతు-న్నాయి.

భారత్, కోస్టారికల మధ్య వాణిజ్య సంబంధాలే కాదు ఒక తాత్త్విక సంబంధం కూడా ఉన్నది. ఆ బంధం, భౌగోళిక హద్దులను అధిగమించి శాంతి సామరస్యాలు, విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తోంది. ఉభయ దేశాల సంస్కృతీ సంప్రదాయాల నుంచి జనించిన ఆ బంధం ప్రపంచ దేశాల పరస్పర సంబంధాలను ఆదర్శప్రాయంగా ప్రభావితం చేస్తోంది. కోస్టారిక ప్రజల జీవన తత్వాన్ని వ్యక్తం చేసే తాత్విక భావన 'పుర విడ'. ఈ స్పానిష్ పదానికి అర్థం 'నిర్మలమైన లేదా నిరాడంబర జీవితం'. కోస్టారికలో ఎక్కడకు వెళ్లినా ఈ పదం ప్రజల సంభాషణల్లో వినపడుతుంది. 'పుర విడ' ఒక తాత్విక భావన మాత్రమే కాదు అదొక జీవన విధానం. జీవితాన్ని పరిపూర్ణంగా జీవించడమే ఆ భావన పరమార్థం. నైసర్గిక పరిసరాల శోభను ఆస్వాదించే సౌందర్యాత్మక దృష్టిని, సామాజిక సంబంధాలను మానవీయం చేసే ఉన్ముఖతను అది కల్పిస్తుంది. ఈ ఆదర్శ తాత్వికతను పురాతన భారతీయ వివేకం 'వసుధైవ కుటుంబకం' (ప్రపంచమంతా ఒక కుటుంబం) గౌరవిస్తుంది, పరిపూరకం చేస్తుంది. ఈ రెండు తాత్విక భావనలు పరస్పర సంబంధాన్ని, కరుణను, కృతజ్ఞతను, సాంస్కృతిక ఆదాన ప్రదానాన్ని, శాంతియుత సహకారాన్ని, పర్యావరణ భద్రత పట్ల శ్రద్ధను ప్రబోధిస్తున్నాయి. భారత్, కోస్టారికల మధ్య దశాబ్దాలుగా ప్రగాఢ, వైవిధ్యపూరితమైన సాంస్కృతిక సంబంధాలు వర్ధిల్లుతున్నాయి. పరస్పర సంప్రదాయాలు, విలువలు, సాంస్కృతిక వారసత్వాన్ని ఉభయ దేశాలు సమున్నతంగా గౌరవించుకుంటున్నాయి. ఈ గౌరవపూర్వక అనుబంధం 1960ల్లో అంటే దౌత్య సంబంధాలు నెలకొనక ముందే ఆరంభమయింది. వాటికి ఆద్యుడు ప్రొఫెసర్ హిల్డా చెన్ అపుయె. యునెస్కో సహకారంతో 1960లో కోస్టారిక విశ్వవిద్యాలయంలో భారతీయ చరిత్ర, తత్వశాస్త్రం, సంస్కృత భాషా సాహిత్యాల అధ్యయనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ విద్యా సంబంధ సహకారం కోస్టారికలో భారతదేశ సమున్నత సంస్కృతీ వైభవంపై అవగాహనను పెంపొందించేందుకు విశేషంగా తోడ్పడింది.

సాంస్కృతిక ఆదానప్రదానాలు, కళాకారుల సందర్శనలు ఉభయ దేశాల మధ్య సంబంధాలను సంస్కృతీ సంబంధంగా పరిపుష్టం చేశాయి. ఫిబ్రవరి 2023లో సంస్కృత భాషా విద్వాంసుడు రోబెర్టో మోరలేస్ భారత్‌లో పర్యటించారు. ఆ సందర్భంగా ఆయన వివిధ విశ్వవిద్యాలయాలలో సంస్కృత భాషా సాహిత్యాలపై వెలువరించిన ఉపన్యాసాలపై భారతీయ విద్వజ్జుల ప్రశంసలు అందుకున్నాయి. ఈ విధంగా ఉభయ దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలు విశాలమవుతూ ఉన్నాయి.

లలిత కళలు కూడా ఈ సాంస్కృతిక సంబంధాన్ని మరింతగా సమున్నతం చేస్తున్నాయి. కోస్టారిక విఖ్యాత చిత్రకారుడు రౌడ్యిన్ అల్ఫరో తన పెయింటింగ్‌లను 'కోస్టారికన్ –సెంటెడ్ కాఫీ' పేరిట ప్రదర్శించారు. చిత్రకళాభిమానులను అవి విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారుల రాకపోకలు అధికమవుతున్నకొద్దీ ఉభయ దేశాల కళాత్మక సంప్రదాయాల సమ్మేళనం సంభవిస్తోంది. వివిధ నేపథ్యాల నుంచి వచ్చిన భారతీయ కళా విద్యార్థులు కోస్టారిక కళా సంప్రదాయాలను శ్రద్ధగా అధ్యయనం చేస్తున్నారు. ఇరు దేశాలలోను పరస్పర చిత్రకళా ప్రదర్శనలు సైతం తరచుగా జరుగుతున్నాయి.

విద్యారంగం విషయానికి వస్తే భారత ప్రభుత్వ ఉపకార వేతనాలపై కోస్టారిక విద్యార్థినీ విద్యార్థులు వివిధ భారతీయ విశ్వవిద్యాలయాలలో ఉన్నత విద్యాభ్యాసం, పరిశోధనలు చేస్తున్నారు. అలాగే కోస్టారికలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని శాంతి విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. విద్యార్థులు, కళాకారులతో ఉభయ దేశాల మధ్య సహకారం బహుముఖీనంగా వికసిస్తోంది.

కోస్టారికలో 1000 మందికి పైగా భారతీయులు నివశిస్తున్నారు. ఉభయ దేశాల మధ్య సంబంధాలను పటిష్ఠం చేయడంలో వీరు తమదైన ప్రాత నిర్వహిస్తున్నారు. 2010లో ఏర్పడిన కోస్టారిక ఇండియన్ అసోసియేషన్ భారతీయ పండుగల సందర్భంలో వివిధ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ భారతీయ సంస్కృతిపై కోస్టారికన్లకు అవగాహనను పెంపొందిస్తోంది. కోస్టారిక 203వ స్వాతంత్ర్య దినోత్సవం, భారత్‌తో దౌత్య సంబంధాల 54వ వార్షికోత్సవం ఉభయ దేశాల మధ్య సంబంధాలు ఎంత సుదృఢంగా ఉన్నాయో స్పష్టం చేస్తున్నాయి. ఈ స్నేహబంధం మరింతగా దృఢమవగలదనే ఆశాభావం ఇరు దేశాల ప్రజలలోను బలంగా ఉన్నది.



• **సోఫియా సలాస్ మోంగె**
కోస్టారిక దౌత్యప్రతినిది, న్యూఢిల్లీ

(సెప్టెంబర్ 15: కోస్టారిక స్వాతంత్ర్య దినోత్సవం, భారత్–కోస్టారిక దౌత్య సంబంధాల 54వ వార్షికోత్సవం)

వినిపించడం లేదా మణిపూర్ రోదన?



▪ **పి. చిదంబరం**

'పళని' పలుకు

మణిపూర్ ఆవేదనను పట్టించుకుంటున్నామా? మునుపటి 'పళని పలుకు' పుటలు తిప్పుతూ నన్ను నేనే నిందించుకున్నాను. ఎందుకు? సంక్షుభిత మణిపూర్ గురించి తరచు రాయనందుకు. జూలై 29, 2023న నేను చివరిసారి మణిపూర్ గురించి రాశాను ('మణిపూర్‌లో జాతుల ముసలం'). 13 నెలల అనంతరం మళ్లీ ఇప్పుడు రాస్తున్నాను. ఇది గర్హనీయం, అంగీక-రిస్తున్నాను. అంతే కాదు క్షమార్హం కాదు, ఒప్పుకుంటున్నాను. సకల భార-తీయులు తమ ఉమ్మడి స్మృతిలో మణిపూర్‌ను అట్టడుగుకు నొక్కివేశారు. ఏమయింది మన ఉచితానుచిజ్ఞత? ఇదీ క్షమార్హం కాదు, ముమ్మాటికీ.

గత ఏడాది జూలైలో మణిపూర్ గురించి రాసినప్పుడు భవిష్యత్తు ఆశా-జనకంగా కనిపించలేదు అన్నీ అమంగ-ళకరంగానే కనిపించాయి. 'మణిపూర్‌లో జాతి సంహారం ఆరంభమయింది' అని అప్పుడు చెప్పాను. ఇంకా ఇలా చెప్పాను: 'ఈ రోజు నేను చదివిన వార్తలు, అందుకున్న నివేదికల ప్రకారం ఇంఫాల్ లోయలో ఒక్క కుకీ జోమీ కూడా లేడు. కుకీజోమీల ప్రాబల్యమున్న ప్రాంతాలలో ఒక్క మెయిటీ కూడా కన్పించడం లేదు'. ఈ పరిస్థితిని మరి కొంచెం ఇలా చెప్పాను: 'ముఖ్యమంత్రి, ఆయన మంత్రులు ఇంటి వద్ద నుంచే తమ అధికారిక విధులు నిర్వర్తిస్తున్నారు. అల్లర్ల ప్రభావిత ప్రాంతాలలోని బాధితులను పరామర్శించేందుకు వెళ్లడానికి వారు సిద్ధంగా లేరు'. ఈ శోచనీయ పరిస్థితిపై ఇంకా ఇలా వ్యాఖ్యానించాను: మణిపూర్ పోలీసులను కుకీలుకానీ, మెయిటీలు కాని ఏ మాత్రం విశ్వసించడంలేదు. దాడులలో గాయపడిన లేదా మరణించిన వారి గురించిన అధికారిక అంకెలను ఏ ఒక్కరూ నమ్మడంలేదు'.

విచారకరమైన విషయమేమిటంటే నేను రాసిన ప్రతి మాట నిజమయింది. మన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారంలో ఉన్న వారిలో ఒకరు గానీ, అంతకంటే ఎక్కువ మంది గానీ మణిపూర్ విషాద ఘటనలకు బాధ్యత వహించి తీరాలి. మరి అధికారంలో ఉన్న ముగ్గురు ప్రముఖులు మణిపూర్‌కు ఊరట కల్పించడానికి ఏమి చేశారో చూద్దాం.

మొదటి వ్యక్తి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. మణిపూర్‌లో మిన్ను విరిగి మీద పడినా ఆ రాష్ట్రాన్ని సందర్శించకూడదని ఆయన సంకల్పించుకున్నారు కాబోలు! 'మణిపూర్ మండనీ, చావనీ నేను మాత్రం మణిపూర్ గడ్డపై అడుగుపెట్టే ప్రసక్తే లేదు' అని తీర్మానించుకున్నట్టుగా ఆయన వైఖరి ఉన్నది. జూన్ 9, 2024న మూడో పర్యాయం ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన మోదీకి ఇటలీ సందర్శించేందుకు (జూన్ 13, 14), రష్యా పర్యటన (జూలై 8, 9)కు, ఆ[illegible]యా వెళ్లేందుకు (జూలై 10), పోలండ్‌లో పర్యటించేందుకు (ఆగస్టు 21, 22), ఉక్రెయిన్‌లో శాంతి చర్చలకు (ఆగస్టు 23, 24), బ్రూనేలో మంతనాలకు (సెప్టెంబర్ 3, 4), సింగపూర్‌లో పర్యటించేందుకు (సెప్టెంబర్ 4, 5) సమయం లభించింది. ఇంకా ఈ ఏడాది మిగిలిన నెలల్లో ఆయన అమెరికా, లావోస్, సమోస్, రష్యా, అజర్ బైజాన్, బ్రెజిల్ మొదలైన దేశాలలో పర్యటించనున్నారు. చెప్పవచ్చిందేమిటంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మణిపూర్‌ను సంద-ర్శించనిది సమయం లభించక కాదు, ఆ దురదృష్టకర, నిస్సహాయ రాష్ట్రానికి వెళ్లకూడదని నిశ్చయించుకున్నందువ-ల్లేనన్నది స్పష్టం.

మణిపూర్‌ను సందర్శించేందుకు మోదీ ససేమిరా అనడం ఆయన మూర్ఖపు పట్టుదలకు నిదర్శనం. గుజరాత్ మారణకాండ, పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తినప్పుడు, మూడు కొత్త సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఉద్య-మించినప్పుడు ఆయన అనుసరించిన వైఖరిలో మొండి-తనం మాత్రమే ఉంది. పార్లమెంటు ఉభయ సభలలో అత్యావశ్యక విషయాలపై తక్షణ చర్చకు నిరాకరిస్తూ వాయిదా తీర్మానాలను వ్యతిరేకించాలని తన మంత్రులకు ఆదేశాలు జారీ చేయడంలోను ఆయన మొండి స్వభావమే స్పష్టంగా కనిపిస్తుంది.

రెండో వ్యక్తి కేంద్ర హోంమంత్రి అమిత్ షా. మణిపూర్‌లో సీనియర్ అధికారుల నుంచి భద్రతా దళాలను మొహరించే వరకు ఆ రాష్ట్ర పరిపాలన సమస్తమూ అమిత్ షా ఆదేశాల ప్రకారమే నడిచింది, నడుస్తోంది. ఆయనే మణిపూర్ ప్రభుత్వం సుమా! అమిత్ షా కావ-లిలోనే హింసాకాండ ప్రజ్వరిల్లింది. మణిపూర్ ప్రజలు పరస్పరం తుపాకులు, బాంబులతో మాత్రమే పోరాడు-కోవడం లేదు. స్వతంత్ర భారతదేశంలో ప్రప్రథమంగా రాకెట్లు, ఆయుధీకరణ అయిన డ్రోన్‌లను ఉపయోగిం-చారు. గతవారం మణిపూర్‌లోని రెండు జిల్లాల్లో కర్ఫ్యూ విధించారు. ఐదు జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలలు మూసివేశారు, ఇంటర్నెట్‌ను నిలిపివేశారు. ఇంఫాల్ నగ-రంలో పోలీసులు వీధులలో విద్యార్థులతో పోరాడు-తున్నారు. మణిపూర్‌లో ఇప్పటికే ఉన్న 26 వేలమంది భద్రతా సిబ్బందికి సహాయంగా మరో రెండు సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ల (2000 మంది స్త్రీ పురుషులు) తరలించారు.

మూడో వ్యక్తి ముఖ్యమంత్రి ఎన్ బీరేన్ సింగ్. ఈయన తనకు తానుగా నిర్మించుకున్న కారాగారంలో ఖైదీగా ఉన్నారు. ఇంఫాల్ లోయలో సైతం ఆయనగానీ, ఆయన మంత్రులుగానీ పర్యటించలేకపోతున్నారు కుకీ జోమీలు ఆయన్ని అసహ్యించుకుంటున్నారు. బీరేన్ సింగ్ తమకు భద్రత సమకూర్చగలరని మెయిటీలు భావించారు. వారికి ఆశాభంగమే మిగిలింది. మణిపూర్‌లో చివరకు మెయిటీలకు సైతం ఆయన చాలా అప్రియమైన వ్యక్తిగా ఉన్నారు. పరిపాలన అనేది లేకుండా పోయింది. మణిపూర్‌ను దహించివేస్తున్న పౌర అశాంతికి బీరేన్ సింగ్ అవివేక, అసమర్థ పాలనే ప్రధాన కారణమనడం సత్యదూరం కాదు అన్ని పక్షాలూ, వర్గాలూ ఆయన్ని ఒక సమస్యగా పరిగణిస్తున్నాయి. చాలా నెలల క్రితమే ఆయన రాజీనామా చేసి ఉండవలసింది. మరి బీరేన్ సింగ్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న వైనం తమ తప్పులను ఒప్పుకునేందుకు రవ్వంత కూడా సిద్ధపడని నరేంద్ర మోదీ, అమిత్ షా అహంకారపూరిత వైఖరిని ప్రతిబింబిస్తోంది. మణిపూర్ ఇప్పుడు యథార్థంగా రెండు రాష్ట్రాలు. చురాచంద్‌పూర్, ఫెర్జవాల్, కాంగ్ పోక్పి జిల్లాలు పూర్తిగా కుకీల నియంత్రణలో ఉన్నాయి. సరిహద్దు పట్టణం మోరేతో సహా టెంగ్‌నౌపాల్ జిల్లాలు కుకీల నియంత్రణలో ఉన్నవి. ఈ జిల్లాలో నాగాలు కూడా గణనీయంగా ఉంటారు. కుకీలు తమ ప్రత్యేక పాలనను నిర్వహిస్తున్నారు. మెయిటీ జాతికి చెందిన ప్రభుత్వోద్యోగులు కుకీల నియంత్రణలో ఉన్న ప్రాంతాలలో లేరు. మెయిటీలు అందరూ ఇంఫాల్ లోయలో మాత్రమే ఉన్నారు. మెయిటీలు మెజారిటీగా ఉన్న రాష్ట్రంలో (మణిపూర్ శాసనసభలోని 60 మంది సభ్యులలో 40 మంది మెయిటీలే) ఉండడానికి ఇష్ట-పడడం లేదు. మణిపూర్ ప్రాదేశిక సమగ్రత, అస్తిత్వాన్ని సంరక్షించుకోవాలని మెయిటీలు ఆకాంక్షిస్తున్నారు. మెయిటీలు, కుకీల మధ్య ఎటువంటి మినహాయింపులు లేని వైరభావం నిండుగా నెలకొని ఉంది.

ప్రభుత్వం, భిన్న జాతుల మధ్యగానీ, మెయిటీలు, కుకీల మధ్య గానీ చర్చలు జరగడంలేదు. అందుకు ఆస్కారం కూడా కనిపించడంలేదు ఇక నాగాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా చారిత్రక ఫిర్యాదులు ఉన్నాయి. మెయిటీలు, కుకీల ఘర్షణల్లో భాగం కావడానికి నాగాలు ఇష్టపడడం లేదు. అపనమ్మకాలు, వంచన, జాతుల ఘర్షణ సాలెగూడులో మణిపూర్ చిక్కుకున్నది. శాంతి భద్రతలను కాపాడి ఒక ప్రభు-త్వాన్ని నిర్వహించడమనేది అంత సులువైన విషయం కాదు. దాదాపుగా అసాధ్యమనే చెప్పాలి. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఉన్న కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, అదే పార్టీ పాలనలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత కారణంగా మణిపూర్‌లో పరిస్థితులు పూర్తిగా దిగజారి-పోయాయి. మన భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యంలో ఒక రాష్ట్రమైన మణిపూర్‌కు ప్రయాణించడ-మంటే చందమామలోని సుదూర, నిగూఢ, అజ్ఞాత ప్రదేశాలకు వెళ్లడమంత ప్రమాదభరితమన్న సత్యాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహుశా తెలుసుకున్నా-రేమో?!

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి,



> అపనమ్మకాలు, వంచన, జాతుల ఘర్షణ సాలెగూడులో మణిపూర్ చిక్కుకున్నది. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత కారణంగా మణిపూర్‌లో పరిస్థితులు పూర్తిగా దిగజారిపోయాయి. మన భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యంలో ఒక రాష్ట్రమైన మణిపూర్‌కు ప్రయాణించడమంటే చందమామలోని సుదూర, నిగూఢ, అజ్ఞాత ప్రదేశాలకు వెళ్లడమంత ప్రమాదభరితమన్న సత్యాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహుశా తెలుసుకున్నారేమో?!

వచ్చే ఒలింపిక్స్‌కు గురిపెడుతున్నాం!

క్రీడల్లో మన తెలంగాణ బిడ్డలు ప్రపంచ దేశాల సరసన ఎందుకు నిలబడద్దు! పతకాలు కొన్ని దేశాలకే పరిమితమా! మనం ఎందుకు వెనుకపడుతున్నాం! ఎందుకు విశ్వవిజేతలుగా నిలవడం లేదు! – అనుకుంటే లక్ష్యాన్ని సాధించే సత్తా తెలంగాణ బిడ్డలకు ఉంది. పట్టుదల, క్రమశిక్షణతో కఠోరంగా శ్రమిస్తే అనుకున్న లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇదే ఆలోచనతో సరికొత్త నిర్ణయం తీసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాలను వెలికితీసి వారి ప్రతిభకు పదునుపెట్టి సరైన శిక్షణను ఇప్పించి అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ క్రీడాకారులుగా తెలంగాణ బిడ్డలను తయారు చేయాలనే ఉక్కు సంకల్పంతో యంగ్ ఇండియా తెలంగాణ స్పోర్ట్స్ యూని-వర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణ-యించారు. సుమారు 200 ఎకరాల్లో ఈ యూనివర్సిటీని హైదరాబాద్‌లోని ముచ్చర్లలో నిర్మిస్తారు.



> **2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి క్రీడాకారులు అత్యధికంగా పతకాలు సాధించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. దక్షిణ కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. సుమారు 200 ఎకరాల్లో తెలంగాణ స్పోర్ట్స్ యూనివర్సిటీని హైదరాబాద్‌లోని ముచ్చర్లలో నిర్మిస్తారు.**

అంతర్జాతీయ వేదికల్లో తెలంగాణ నుంచి మన క్రీడాకారులే అత్యధికంగా పతకాలు సాధించి తెచ్చే స్థాయిలో రాష్ట్రాన్ని క్రీడా రంగంలో గొప్పగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిం-చాలని భావిస్తున్న ఫ్యూచర్ సిటీలోని (ఫోర్త్ సిటీ) స్పోర్ట్స్ హబ్‌లో దాదాపు 12 క్రీడల అకాడమీలను నెలకొల్పాలని ప్రభుత్వం భావిస్తున్నది. వీటిలో అంతర్జాతీయ స్థాయిలో అధునాతన సదుపాయాలు కల్పించనున్నారు. ఈ స్పోర్ట్స్ హబ్‌లో స్పోర్ట్స్ సైన్స్ సెంటర్, స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్ కూడా అందుబాటులో ఉంటాయి. క్రీడాకారు-లకు శిక్షణతో పాటు తగిన పరిశోధన-లకు నిలయంగా వర్సిటీ రూపుదిద్దుకో-నుంది. ప్రతి క్రీడకు ఇందులో ప్రాధాన్యం ఉంటుంది.

రాష్ట్రంలోని అన్ని క్రీడా విభాగాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని క్రీడా పాఠశాలలు, అకాడమీలు, క్రీడా శిక్షణ సంస్థలు అన్నింటిని స్పోర్ట్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురాను-న్నారు. మన దేశ క్రీడాకారులు ఒలింపిక్స్‌లో రాణించేలా షూటింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, ఆర్చరీ, జావెలిన్ త్రో, హాకీ క్రీడల్లో మొదట శిక్షణ ఇవ్వనున్నారు. ఆ ఆరింటి తర్వాత పతకాలు సాధించే అవకాశాలు ఉన్న క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. యూనివర్సిటీలో వసతులు, ఆహారం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అందిస్తారు.

ఇటీవల విదేశీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ మినిస్టర్ శ్రీధర్‌బాబు దక్షిణ కొరియాలో పర్యటించిన సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ పురుడుపోసుకుంది. సియోల్‌లోని కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని ముఖ్యమంత్రి సందర్శించారు. అది ప్రపంచంలోనే పేరుపొందిన స్పోర్ట్స్ యూనివర్సిటీగా ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఇటీవల పారిస్ ఒలంపిక్స్‌లో దక్షిణ కొరియా మొత్తం 32 పతకాలు గెలుచుకోగా వాటిలో 16 పతకాలు ఈ యూనివర్సిటీలో శిక్షణ పొందిన అథ్లెట్లే సాధించారు. ఈ యూనివర్సిటీని సాంకేతిక భాగస్వాములుగా వాడుకొంటూ తెలంగాణలోని భవిష్యత్తు ఒలింపిక్ ఛాంపియన్లకు శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

రాబోయే 2028 ఒలంపిక్స్‌లో అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రం నుంచి క్రీడాకారులు అత్యధికంగా పతకాలు సాధించేలా ముఖ్యమంత్రి రూపకల్పన చేస్తున్నారు. ఇందుకోసం కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. దక్షిణ కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని పూర్తి-స్థాయిలో అధ్యయనం చేయాలని అధి-కారులను ఆదేశించారు. యూనివర్సిటీ విధానం, క్రీడాకారుల ఎంపిక, శిక్షణ ఏ విధంగా ఇస్తున్నారు, అనుసరిస్తున్న ప్రత్యేక ప్రణాళిక ఏంటి... ఇలాంటి అంశాలపై పూర్తిస్థాయి అధ్యయనం జరపాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన వివిధ దేశాల క్రీడాకారు-లపై స్టడీ చేయాలని ఆదేశించారు. ఆయా దేశాలు ప్రోత్సహించిన తీరు. వారికి ఇచ్చిన శిక్షణ తదితర అంశాలపై సమగ్ర నివేదిక అందించాలని సూచించారు.

అంతేగాక, హైదరాబాద్‌లో ఉన్న స్టేడియాలను ఒలింపిక్స్ స్థాయికి ఆధునీకరించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని క్రీడాప్రాంగణాల్లో సౌకర్యాలను మెరుగుపరచనున్నారు. రాష్ట్రంలోని ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో ఒక స్పోర్ట్స్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ స్కూళ్లలో విద్యాబోధన కూడా ఉంటుంది. అయితే ఇందులో క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. విద్యార్థులకు నచ్చిన ఆటలో శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత ప్రతిభ ఆధారంగా వారికి స్పోర్ట్స్ యూని-వర్సిటీలో వసతి కల్పించి మరింత పదును పెడతారు. రాబోయే రోజుల్లో తెలంగాణ క్రీడాకారులు అంతర్జాతీయంగా పతకాలు సాధించి తెలంగాణకు మంచి పేరు రావాలనే ముఖ్యమంత్రి ఆశయం నెరవేరాలని ఆకాంక్షిద్దాం.

▪ **వెలిచాల రాజేందర్‌రావు**
కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్

ఎస్టీలనూ ఏబీసీడీలుగా వర్గీకరించాలి!

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎస్టీ జాబితాలో ఉన్న గిరిజన తెగలను, కులాలను ఏబీసీడీలుగా వర్గీకరించాల్సిన అవసరం ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న 33 ఆదివాసీ తెగలలో రాజ్యాంగం, రిజర్వేషన్ ఫలాలను సంక్షేమ పథకాలు, విద్యా ఉద్యోగ రంగాల్లో కొన్ని కులాలు మాత్రమే అనుభవిస్తూ మిగతా 30 తెగలను అభివృద్ధికి దూరంగా నెడుతున్నాయి. ఎస్టీ జాబితాలో కేవలం విద్యపరంగా రిజర్వేషన్‌లో చేరిన లంబాడి, యానాది, ఎరుకుల కులాలు ఈరోజు ఎక్కువ లబ్ధి పొందుతున్నట్లు మిగత ఆదివాసీ తెగలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఆదివాసీ 30 తెగలు అభివృద్ధికి దూరంగా అడవులలో ఉంటూ జంతువులతో సహజీవనం కొనసాగిస్తున్న సందర్భంలో ఎస్టీ వర్గీకరణ అంశం చాలా కీలకం. గత కొన్నేళ్ళుగా ఎస్టీ జాబితా నుంచి. లంబాడీలను తొలగించాలని ఉద్యమం ఉవ్వెత్తున లేచినప్పటికీ పాలకులు సరిగ్గా స్పందించలేదు. ఆ అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున ఇప్పుడు తేలే అవకాశం లేదు. ఈ పరిణామాల నేపథ్యంలో కొంతమంది ఆదివాసీ మేధావులు ఎస్టీలను ఏబీసీడీ-లుగా వర్గీకరించాలన్న డిమాండ్ ముందుకు తెస్తున్నారు.



నాడు ఆంధ్రా వలసల గురించి కొట్లాడిన తెలంగాణ సమాజం నేడు మహారాష్ట్రలో బీసీలుగా, కర్ణాటకలో ఎస్సీలుగా, రాజస్థాన్‌లో ఓసీలుగా చెలామణీ అవుతూ లక్షలాదిగా తెలంగా-ణలోకి వలసలు వస్తున్న లంబాడీలు ఇక్కడ విద్యా ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాలలో ఆదివాసీల రిజర్వేషన్లు దోచు-కుంటున్నా పట్టించుకోవటం లేదు. ఒకే రాష్ట్రంలో ఉన్న ఆంధ్రావి వలసలు అయితే పక్క రాష్ట్రాల నుంచి వచ్చే లంబాడాలవి వలసలు కావా?

లంబాడీ తెగ ప్రజలను గత కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి మొదలు టీడీపీ, తర్వాత టీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వరకు ఓటు బ్యాంక్ కోసం ఎస్టీలుగా గుర్తిస్తూ మూల ఆదివాసులకు అన్యాయం చేస్తున్నాయి. ఇంకొక ఆకు ఎక్కువ చదివిన కేసీఆర్ లంబాడి తెగప్రజలే నిజమైన ఆదివాసులుగా గుర్తిస్తూ, అడవిలోని మూలవాసులపై మావోయిస్టులన్న ముద్ర వేశారు. అడవులను కాపాడుతున్న ఆదివాసులను హరితహారం పేరుతో, ఓపెన్ కాస్ట్ గనుల పేరుతో, ఖనిజాల వెలికితీత పేరుతో వేధించారు. అడవులను నాశనం చేస్తూ తిరిగి ఆదివాసులే అడవులను నాశనం చేస్తున్నారని ఉల్టా ప్రచారం చేశారు. ఆదివాసీ – -లంబాడీ తెగల మధ్య ఘర్షణకు కూడా కేసీఆర్ ప్రభుత్వమే కారణం.

మైదాన ప్రాంతాలలో నివసిస్తున్న లంబాడీ తెగ ప్రజల్లో కొందరు పేదలు ఉన్నప్పటికీ ఎక్కువ శాతం మంది అడవిలోని మూల ఆదివాసుల కన్నా సామాజికంగానూ, నాగరికంగానూ అభివృద్ధి చెందినవారు. వీరు తమ తెలివితేటలతో 90శాతం ఎస్టీ రిజర్వేషన్లను ఉపయోగించుకుంటున్నారు. ఇది బహిరంగ సత్యం.

పాలకులు, అధికారులు కూడా పలుకుబడికలిగిన వాళ్లకే ఉపయోగపడుతున్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక చైతన్యం లేని ఆదివాసీలకు తీరని అన్యాయం జరుగు-తున్నది. వాళ్లకు చెప్పాల్సిన, అందాల్సిన రిజర్వేషన్లు దక్కడం లేదు. అందుకే మూల ఆదివాసులకు – వలస లంబాడీ తెగ ప్రజలకు మధ్య ఆదిలాబాద్‌లో ఘర్షణ మొదలైంది. వీళ్ల మధ్య ఈ సమస్యలు పరిష్కారం కాకపోతే ఈ ఘర్షణ రాష్ట్రమంతటా కార్చిచ్చులా పాకుతుంది. భౌతికదాడులు చేసుకునే పరిస్థితి కూడా ఏర్పడుతుంది. ఇప్పుడు అదిలాబాద్, వరంగల్, ఖమ్మంలో న్యాయం కోసం పోరాడుతున్న ఆదివాసీ నేతలపై వందల కొద్దీ కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. కాయితా లంబాడీ-లను, వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో కలిపి 12శాతం రిజర్వేషన్ ఇస్తామనడం ఓటు బ్యాంక్ కోసం కేసీఆర్ వేసుకున్న ఎత్తుగడ. ఇది కేసీఆర్, టీఆరఎస్ ప్రభుత్వ మోసం. ఇలాంటి మోసకారితనాన్ని పక్కనబెట్టి ఎస్టీ జాబితాలో కొత్తగా ఎవరినీ చేర్చ-కుండా ఎస్టీలో ఏబీసీడీ వర్గీకరణ చేయాలి.

– **పూకె రామకృష్ణ దొర**

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com



'అసైన్డ్' లెక్క.. ఇక పక్కా..

నిగ్గు తేల్చనున్న రెవెన్యూ శాఖ

- ఎల్ఆర్ఎస్ పరిశీలనలో భాగంగా గుర్తింపునకు కసరత్తు
- మూడుశాఖల భాగస్వామ్యంతో ప్రక్రియ
- ప్రభుత్వ చర్యలతో అక్రమార్కులు, స్థల యజమానుల్లో కలవరం
- ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున భూముల అన్యాక్రాంతం
- విచ్చలవిడిగా వెంచర్లు వేసి ప్లాట్ల అమ్మకాలు

హనుమకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో.. ప్రభుత్వం అసైన్డ్ భూముల గుర్తింపును నిర్వహించాలన్న నిర్ణయానికి వచ్చింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ఎక్కడ అసైన్డ్ భూములను ప్లాట్లు చేశారు? ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో అసైన్డ్ భూములు ఏ మేరకు ఉన్నాయి? అందులో ఎన్ని అన్యాక్రాంతమయ్యాయి? అనే అంశాలపై ఓ స్పష్టత రానుంది. ఇదే సమయంలో అసైన్డ్ భూముల లెక్క ఇక పక్కాగా నమోదు కానుంది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో అసైన్డ్ భూములు ఎన్ని ఉన్నాయి ? అవి ఎవరెవరి చేతిలో ఉన్నాయి ? ఎన్నీ పరాధీనం అయ్యాయి. అనే లెక్కలు లేవు. గత ప్రభుత్వాలు ఈ దిశగా పెద్ద ప్రయత్నాలు చేయలేదు. అసలు అసైన్డ్ భూములపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దగా దృష్టిసారించినట్టు కూడా లేదన్న ఆరోపణలున్నాయి. ధరణి పోర్టల్ అందుబాటులో వచ్చిన తర్వాత కబ్జాదారులు రూ.కోట్లాది విలువైన అసైన్డ్ భూములను అప్పణంగా కాజేసి దర్జాగా అందులో వెంచర్లు చేసి విచ్చల విడిగా అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు చేసుకున్న ప్లాట్ల యజమానుల్లో చాలా మందివి ఇలాంటివే. ఒక సారి అవి రెగ్యులరైజ్ అయితే ఇక శాశ్వతంగా వారి సొంతమైనట్టే.. ఉమ్మడి జిల్లాలో లక్షా 47వేలకు పైగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు మున్సిపాలిటీల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్క వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోనే 90వేల దరఖాస్తులు అందాయి. సుమారు 46వేల ఎకరాల మేరకు అసైన్డ్ భూములున్నట్టు అంచనా. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు ముగ్గురు అధికారుల చొప్పున 12బృందాలను నియమించారు. 2020 ఆగస్టు 26 తేదీలోపు రిజిస్ట్రేషన్ అయి ఎల్ఆర్ఎస్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారికే ఇది వరిస్తుంది. ఆ తేదీ తర్వాత అనధికార లే అవుట్లకు, ప్లాట్లకు అనుమతులు జారీ కావు.

అసైన్డ్ భూములపై రాష్ట్ర సర్కారు దృష్టి..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేప్పుడు అసైన్డ్ భూములపై ప్రధానంగా దృష్టిసారించాలని రేవంత్ సర్కారు కలెక్టర్లను ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన మార్గదర్శకాల్లో ఎల్ఆర్ఎస్ ఆమోదం కోసం క్షేత్రస్థాయిలో జరిపే పరిశీలనలో మున్సిపల్ అధికారులకు తోడు రెవెన్యూ శాఖ, నీటి పారుదల శాఖలకు భాగస్వామ్యం కల్పించింది. గతంలో ఒక్క మున్సిపాలిటీ అధికారులు, లేదంటే వారి కింది స్థాయి సిబ్బంది మ్రాతమే పరిశీలన జరిపేవారు. అయితే ఆ స్థలాలు అసైన్డ్ భూములా? కాదా? అనేది తమకు అందుబాటులో ఉన్న రికార్డు ప్రకారం మాత్రమే ధ్రువీకరించుకునే వారు. మున్సిపాలిటీ వద్ద ఉన్న అరకొర రికార్డుల వల్ల కొన్ని సార్లు అసైన్డ్ స్థలాలు సైతం రెగ్యులరైజ్ అయిన ఉదంతాలున్నాయి. దీనికి తోడు కొందరు మున్సిపల్ అధికారులు, కింది స్థాయి సిబ్బంది క్షేత్ర పరిశీలనలో అవి అసైన్డ్ భూములు అని తేలినా ముడుపులకు ఆశపడి రెగ్యులర్ చేసిన దాఖలాలు కూడా ఉన్నాయి. వీటన్నిటి దృష్టిలో పెట్టుకొని రాష్ట ప్రభుత్వం ఈ సారి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత స్థాయి పరిశీలనలో మున్సిపల్ శాఖతో పాటు రెవెన్యూ, నీటిపారుదల శాఖలను కూడా భాగస్వాములను చేస్తోంది.

ఇక గుర్తింపు తేలిక

గతంలో మున్సిపాలిటీల్లోని పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్లాట్లను పరిశీలించేవారు. కొత్త ఆదేశాల మేరకు ఇప్పుడు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మూడు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. పట్టణ ప్రణాళిక విభాగం సూపర్‌వైజర్‌తో పాటు నీటి పారుదల శాఖ ఏఈ, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ (ఆర్ఐ), ముగ్గురు కలిసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తు వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. ఇది ప్రభుత్వ అసైన్డ్ భూమా? ప్రైవేటు భూమా? ఇతర వివాదాల భూమా? అనేది రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ గుర్తిస్తారు. బఫర్‌జోన్ నిబంధన మేరకు చెరువు, కుంటలు, వాగులు, నాలాల పక్క నుంచి ఎంత దూరంలో ఉంది అనుమతి ఇవ్వవచ్చా లేదా అనేది నీటి పారుదల శాఖ ఏఈ పర్యవేక్షిస్తారు. ఆ స్థలం నివాస ప్రాంతం (రెసిడెన్షియల్ ఏరియా), వాణిజ్య ప్రాంతం, పారిశ్రామిక ప్రాంతం ఇలా ఏ జోన్‌లో వస్తుంది, జత చేసిన పత్రాలు సరైనవో కావో అనేది పట్టణ ప్రణాళిక విభాగం సూపర్‌వైజర్ గుర్తిస్తారు. తద్వారా అసైన్డ్ భూమిని గుర్తించడం తేలిక కానుంది. వీరు ముగ్గురు ఆమోదించాకే ఎల్1 లాగిన్ నుంచి పట్టణ ప్రణాళిక విభాగం అధికారి (ఎల్2 లాగిన్)కు దరఖాస్తును పంపిస్తారు. అక్కడి నుంచి ఎల్ 3 లాగిన్ పర్యవేక్షించే మున్సిపల్ కమిషనర్‌కు వెళుతుంది. రుసుం చెల్లించాక కమిషనర్ ఆమోదంతో ఎల్ఆర్ఎస్ పత్రం జారీ చేస్తారు. పెద్ద లే అవుట్‌ల క్రమబద్ధీకరణ రికార్డులను ఎల్ 4 దశలో భాగంగా కలెక్టర్ల పరిశీలనకు పంపాల్సి ఉంటుంది.

ఎన్‌వోసీల కోసం!

జీవనోపాధి కోసం ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూముల్లో ఎక్కడ పడితే అక్కడ ప్లాట్లు వెలిశాయి. 1956 కంటే ముందు ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూములకు ఎన్‌వోసీ (నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్)లు జారీ అయ్యాయి. దాన్ని అవకాశంగా మలుచుకొని కొందరు ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలు పెట్టారు. అదే అదనుగా కొందరు నకిలీ ఎన్‌వోసీల సృష్టించి అమ్మడానికి వీల్లేని భూములను అన్యాక్రాంతం చేశారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో జత చేసిన ఎన్‌వోసీలు ఏవీ నకిలీవో గుర్తించం కష్టంగా మారింది. ఫలితంగా చాలా దరఖాస్తు లకు మోక్షం లభించడం లేదు. కొత్త మార్గదర్శకాలతో ప్రక్రియలో వేగం పెరుగనున్నదని భావిస్తున్నారు.

అక్రమార్కుల్లో గుబులు..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్ర స్థాయి పరిశీలనలో ప్రధానంగా అసైన్డ్ భూములపై దృష్టి పెట్టనుండడంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు మొదలైంది. ఆ స్థలాల్లో ఇళ్ల ప్లాట్లు కొన్నవారు సైతం కలవర పడుతున్నారు. గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పేదల నుంచి అసైన్డ్ భూములను తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఎడాపెడా వెంచర్లు చేసి విక్రయించారు. ఇందులో ఇళ్లు నిర్మించుకునేందుకు వీలుగా క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నవారు క్షేత్రస్థాయి పరిశీలనలో అవి అసైన్డ్ భూములని తేలితే ఎక్కడ తమను నిలదీస్తారోనన్న భయం రియల్ ఎస్టేట్ వ్యాపారులను వెంటాడుతోంది. ఇప్పటికే చాలా మంది తమ ఇంటి స్థలం ఎలాంటి, వివాదంలో చిక్కుకొని ఉందా? లేదా? అనేది తమదైన మార్గంలో ఆరా తీస్తున్నారు.



బీఆర్ఎస్ శ్రేణుల ముందస్తు అరెస్టులు

- పోలీసుల నిర్బంధంలో వినయభాస్కర్
- కార్యాలయం బయటికి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- ఇరువర్గాల మధ్య వాగ్వాదం
- పలు చోట్ల బీఆర్ఎస్ నాయకుల అరెస్టు



వినయ్‌భాస్కర్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

రాంనగర్, సెప్టెంబరు 13 : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్‌ను హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో పోలీసులు నిర్బంధించారు. పార్టీ ఫిరాయింపులపై నెల కొన్న వివాదంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌషిక్‌రెడ్డి శేర్‌లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఇంటి ముట్టడికి పిలుపిచ్చారు. ఈ పిలుపు మేరకు బీఆర్ఎస్ శ్రేణులు హైదరాబాద్‌కు తరలివెళ్లేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం ఉదయమే జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలను గృహ నిర్బంధాలు, అరెస్టులు చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ తన అనుచరులతో హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయానికి ఉదయం చేరుకున్నారు. కార్యాలయంలో గణపతి పూజ అనంతరం బయటికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. హైదరాబాద్ వెళ్లకుండా ముందస్తు అరెస్టులు చేస్తున్న పోలీసులు పార్టీ కార్యాలయం గేటును మూసివేసి వినయభాస్కర్ బయటికి వెళ్లకుండా అడ్డుకున్నారు. కార్యాలయానికి చేరుకున్న ప్రతీ ఒక్కరి వివరాలు నోట్ చేసుకున్నారు. వినయభాస్కర్ పోలీసులను తోసుకుని వెళ్లే ప్రయత్నంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బయటికి వెళ్లేందుకు పోలీసులు అనుమతించలేదు. మధ్యాహ్నం తర్వాత నేతలను వదిలేశారు. కాగా, 'కుడా' మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డిని అరెస్టు చేసి సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 1వ డివిజన్, 55వ డివిజన్‌ల అధ్యక్షులు శ్రీధర్, ఆటికం రవిందర్‌తో పాటు పలువురు నేతలను కేయూ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ తరలించారు. ఇలా పలు డివిజన్‌లకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులను ముందుస్తు అరెస్టు చేశారు.

సామాజిక స్వచ్ఛతే లక్ష్యంగా..

- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న స్వచ్ఛ పక్వాడ కార్యక్రమం
- కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ
- పక్షం రోజుల పాటు విద్యార్థులకు వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన.. రేపు ముగింపు

వివరాలు 7లో..

అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయండి

మేయర్ గుండు సుధారాణి



అధికారులతో మాట్లాడుతున్న గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 13 : గ్రేటర్ వరంగల్ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు వివిధ విభాగాల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడారు. పలు పథకాల ద్వారా వరంగల్ నగరంలో జరుగుతున్న ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, శానిటేషన్ పనితీరు మెరుగు పడాలని అన్నారు. వింగ్ అధికారులు ఆయా విభాగాల అధికారులు, సిబ్బందిని సమన్వయంతో పనులలో పురోగతి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చింతకుంట్ల రాజేందర్‌రెడ్డి, ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, సెక్రెటరి విజయలక్ష్మీ, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్, ఇంచార్జ్ సీపీ రవీంద్ర రాడేకర్, ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు

- నిమజ్జన ప్రదేశాలను సందర్శిస్తున్న సీపీ
- శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా బందోబస్తు ఏర్పాట్లు



కోట చెరువును పరిశీలిస్తున్న సీపీ, కలెక్టర్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 13 : గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 16న నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకుని కమిషనర్ ఇప్పటికే ట్రై సిటీస్‌లోని పలు చెరువులను సందర్శించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టారు. కలెక్టర్, ఇతర శాఖల అధికారులతో కలిసి ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. రెండు రోజులుగా హనుకొండ, కాజీపేట, వరంగల్ ప్రాంతాల్లోని నిమజ్జన ప్రాంతాలను సందర్శించారు. గురువారం కాజీపేటలోని బంధం చెరువు, హనుమకొండ సిద్దేశ్వర గుండం, హసన్‌పర్తి చెరువులను సందర్శించిన కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం వరంగల్ ప్రాంతంలోని కోట చెరువు, చిన్న వడ్డెపల్లి చెరువు, కట్టమల్లన్న, ఉర్సు, బెస్తం చెరువులను కలెక్టర్ సత్య శారదతో కలిసి పరిశీలించారు.

ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా చర్యలు

వరంగల్ కమిషనరేట్ పరిధిలో అధికారికంగా ప్రతిష్ఠించిన విగ్రహాలు 4647 కాగా, ట్రై సిటీస్‌లోనే 2వేలకు పైగా ఉన్నట్లు అధికారిక సమాచారం. ఈ విగ్రహాల నిమజ్జనం ట్రై సిటీస్ పరిధిలో గుర్తించిన చెరువుల్లో చేయనున్నారు. నిమజ్జన ప్రదేశాల్లో క్రేన్లు, తెప్పలను, మంచి నీటి సౌకర్యం, గజ ఈతగాళ్లు, లైటింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ట్రై సిటీస్‌లో 2వేల మంది పోలీస్ సిబ్బంది నిమజ్జన విధులు నిర్వహించనుండగా వీరిలో ఇద్దరు డీసీపీలతో పాటు 11 మంది ఏసీపీలు విధుల్లో ఉంటారు. ఇప్పటికే కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీస్ అధికారులతో పలుమార్లు సమావేశం నిర్వహించి నిమజ్జన బందోబస్తుపై ప్రణాళిక సిద్ధం చేశారు. కాగా, ఆదివారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ట్రై సిటీస్‌లో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టనున్నారు.

డయాలసిస్.. కష్టాలు

- సరైన సౌకర్యాల్లేక రోగుల ఇబ్బందులు
- విధుల్లో వైద్యుల నిర్లక్ష్యం
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న టెక్నీషియన్లు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 13: కాకతీయ వైద్య కళాశాల సూపర్ స్పెషాలి టీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌లో సరైన సౌకర్యాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిడ్నీ సంబంధ సమస్యలతో వస్తున్న వారి సంఖ్య ఎక్కువవుతున్న నేపథ్యంలో 2022 జూలై 7న ఇక్కడ నెఫ్రాలజీ విభాగాన్ని ప్రారంభించారు. వారానికి రెండుసార్లు ఓపీ సేవలను నిర్వహిస్తుండగా.. నెలలో 500వరకు ఓపీ ఉంటోంది. వారిలో సుమారు 200మంది రోగులు ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు 1,122 మంది సేవలు పొందారు. ఒక ప్రొఫెసర్‌తో పాటు ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెస ర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరు ప్రభు త్వ సేవలకు సకాలంలో హాజరు కాకుండా ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేసేందుకు మొగ్గు చూపుతుండటంతో కొందరు టెక్నీషయన్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, రోగులను ఇక్కడ పనిచేసే వైద్యుల ప్రైవేట్ క్లినిక్‌లకు పంపిస్తూ డబ్బులు దండుకుంటున్నారని, కొందరు రూ.వేలల్లో సంపాదిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇక రక్తశుద్ధికి అవసరమైన పైపులు, క్యాథటర్లు, ఏబీ ఫిస్టులాలు లేవని పేద రోగులకు నమ్మబలికి ప్రైవేట్‌కు పంపి ఫీజు గుంజుతున్నట్లు సమాచారం. ఈ పరికరాలు బయట మార్కెట్‌లో రూ.వేయిలోపు ఉంటే.. వీరుమాత్రం రోగుల వద్ద రూ.5వేల వరకు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్టు విమర్శలున్నాయి. ఇదిలా ఉంటే ఇక్కడికి వచ్చే రోగులకు తగ్గట్టుగా డయాలసిస్ పడకల సంఖ్య లేదని వారానికి రెండు సార్లుమాత్రమే డయాలసిస్ చేసే అవకాశం ఉండటంతో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని రోగులు వాపోతున్నారు.



ఎంజీఎంలోని నెఫ్రాలజీ విభాగం

రోగులను బయటకు పంపితే ఉపేక్షించం



- డాక్టర్ మురళీ, ఎంజీఎం సూపరింటెండెంట్

నెఫ్రాలజీ విభాగంలో సేవలను విస్తృతం చేసేలా చర్యలు తీసుకుంటాం. రోగులను ప్రైవేటుకు ఆసుపత్రులకు పంపినా, వైద్యులు, టెక్నీషియన్లు ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం చేసినా కఠిన చర్యలు తప్పవు. పడకల పెంపు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

కేసుకో రేటు?

కొందరు టెక్నీషియన్లు రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు పంపుతూ.. అక్కడ ఆ రోగి అడ్మిట్ అయితే కేసుకో రేటు చొప్పున కమీషన్ తీసుకుంటున్నారని సమాచారం. ఇలాంటి కొందరు పేద రోగులను పట్టించుకోకుండా ప్రైవేట్‌కు తరలించే అంశంపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. ఆరోగ్యశ్రీలో కేవలం రెండుసార్లే డయాలసిస్ చేసే అవకాశం ఉండటంతో సూపర్ స్పెషాలిటీకి రోగుల తాకిడి పెరిగింది. ఇదే అదునుగా కొందరు టెక్నీషియన్లు డబ్బులు వసూలుకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇలా డయాలసిస్ రోగులకు ఉపయోగపడే పరికరాలను ఎంజీఎం ఆస్పత్రి అధికారులు కొనుగోలు చేయాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. నెఫ్రాలజీ విభాగంలో జరుగుతున్న అవినీతిపై కలెక్టర్ విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్‌ది ఓటు బ్యాంకు రాజకీయం

▸▸ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంకిడి మనోహర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 13 : కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు కోసం రాజకీయం చేస్తుండగా బీజేపీ మాత్రం దేశ ప్రతిష్ఠతను ప్రపంచ పటంలో నిలబెట్టేలా పరితపిస్తుందని బీజేపీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంకిడి మనోహర్ రెడ్డి అన్నారు. బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అధ్యక్షతన శుక్రవారం హంటర్‌రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గంకిడి మనోహర్‌రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడాడు. అధికారం కోసం కుటుంబపార్టీలు ఎడాపెడా హామీలు గుప్పిస్తున్నాయని విమర్శించారు. బీజేపీ సంస్థాగతంగా బలంగా ఉందని నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ శ్రమించి సభ్యత్వ నమోదులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, జిల్లా సభ్యత్వ నమోదు ఇంచార్జీ భరత్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయ్‌చందర్‌రెడ్డి, గుజ్జ సత్యనారాయణరావు, సిరంగి సంతోష్, గురు ప్రసాద్, పులి సరోత్తంరెడ్డి, రాజరెడ్డి, రాంబాబు, కార్పొరేటర్లు బైరి లక్ష్మీ, రావుల కోమల, గుజ్జుల వసంత, అభినవ్‌భాస్కర్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి



కడిపికొండ జడ్పీహెచ్‌ఎస్‌లో శిక్షణలో పాల్గొన్న విద్యార్థులతో డీఎస్‌వో

ప్రభుత్వ పాఠశాలల్లో రొబోటిక్స్ శిక్షణ పూర్తి

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13: జిల్లాలోని 12 పాఠశాలల్లో సోహం అకాడమీ ఆధ్వర్యంలోవిద్యార్థులకు రొబోటిక్స్‌పై శిక్షణ శుక్రవారంతో ముగిసింది. శిక్షణ కార్యక్రమంలో కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శిక్షకులుగా పాల్గొని విద్యార్థులను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దినట్లు డీఎస్‌వో శ్రీనివాస స్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా 6 నుంచి 10 తరగతులకు చెందిన విద్యార్థులకు రొబోటిక్స్ ప్రాథమిక సూత్రాలను నేర్చుకున్నారన్నారు. విద్యార్థుల్లో సైంటిఫిక్ జిజ్ఞాసను పెంపొందించడంలో ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. జిల్లాలో మొత్తం 370 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో జాతీయ హిందీ భాషా దినోత్సవం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13 : జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్ట్స్ కళాశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేయూ హిందీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సంజీవ్ పాల్గొని ప్రసంగించారు. సాంస్కృతికంగా హిందీకి గొప్ప వారసత్వం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి, డాక్టర్ వెంకట్‌నాయక్, అధ్యాపకులు అంజన్ రావు, జోస్న, హరికుమార్, చందర్, పీఆర్వో ఆదిరెడ్డి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ సంజీవ్

ఆల్ ఇండియా బ్యాడ్మింటన్ పోటీలకు శ్రీచేతన్‌శౌర్య

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 13: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కలకత్తా నగరంలో జరిగే ఆల్ ఇండియా సబ్ జూనియర్స్ అండర్ - 13 బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ పోటీలకు వరంగల్ జిల్లా బల్దియా ఇండోర్ స్టేడియం క్రీడాకారుడు శ్యామల శ్రీచేతన్ శౌర్య ఎంపికయ్యాడు. ఈ నెల 14 నుంచి 19 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటాడని బ్యాడ్మింటన్ కోచ్ మాడిశెట్టి శ్రీధర్ రావు తెలిపారు. శ్రీ చేతన్ శౌర్య ఇటీవల దేశవ్యాప్తంగా పలు చోట్ల జరిగిన ర్యాంకింగ్ టోర్నమెంట్‌లలో డబుల్స్‌లో 3వ ర్యాంకు, సింగిల్స్‌లో 4వ ర్యాంకు సాధించి ప్రత్యేక ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారుడిని వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. రమేష్‌రెడ్డి, బల్దియా స్పోర్ట్స్ డైరెక్టర్ శంకర్‌లింగం, కోచ్ శ్రీధర్‌రావులతో పాటు సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

నేడు కేయూ పరిధిలోని కళాశాలలకు పనిదినం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 13: కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌తో పాటు వర్సిటీ పరిధిలోని యూజీ, పీజీ కళాశాలలన్నీ సెప్టెంబరు 14న రెండో శనివారం యథావిధిగా పని చేస్తాయని కేయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబరు 2న భారీ వర్షాల నేపథ్యంలో వర్సిటీతో పాటు వర్సిటీ కళాశాలలకు సెలవు ప్రకటించడంతో కలెక్టర్ ఉత్తర్వుల మేరకు శనివారం పనిదినంగా పాటించాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు గమనించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైన అభినవ నేతాజీ


నేతాజీని అభినందిస్తున్న యోగా గురువు కమలాకర్

శంభునిపేట, సెప్టెంబరు 13: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు వరంగల్‌నగరంలోని రంగశాయిపేటకు చెందిన అడుప అభినవ నేతాజీ ఎంపిక అయ్యారని ఉమ్మడి వరంగల్ జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి కమలాకర్ శుక్రవారం తెలిపారు. ఆగస్టు 25న ఉమ్మడి జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీలలో 16-18 సంవత్సరాల విభాగంలో నేతాజీ ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్‌తోపాటు గోల్డ్‌మెడల్ సాధించాడని తెలిపారు. నేతాజీ ప్రతిభను గుర్తించి హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే 8వ రాష్ట్ర స్థాయి యోగా క్రీడా పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం నేతాజీకి అభినందన సభ ఏర్పాటు చేసి సత్కరించారు. యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ ఆర్యా, మాజీ కార్పొరేటర్, పీఏసీఎస్ చైర్మన్ కేడల పద్మజనార్దన్, సాంబశివారావు, జ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయురాలు రజిత నేతాజీని అభినందించారు.

సామాజిక స్వచ్ఛతే లక్ష్యంగా..

- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న స్వచ్ఛ పక్వాడ కార్యక్రమం
- కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ
- పక్షం రోజుల పాటు విద్యార్థులకు వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13: పాఠశాల దశ నుంచే విద్యార్థులకు సామాజిక అవగాహన కల్పించాలని, సామాజిక కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేయాలని, వ్యక్తిగత పరిశుభ్రతతోనే పరిసరాలు, ప్రజల ఆరోగ్యాలు బాగుంటాయనే విషయాన్ని తెలియజేయాలనే ఉద్దేశంతో భారత జల శక్తి మంత్రిత్వ శాఖ 2016లో స్వచ్ఛ పక్వాడ్ అనే కార్యక్రమాన్ని రూపొందించింది. ఏటా సెప్టెంబరు 1 నుంచి 15 వరకు పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ మేరకు ఈ నెల ఒకటి నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో స్వచ్ఛ పక్వాడ్ కార్యక్రమం ప్రారంభమైంది. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదం చేస్తుంది. విద్యార్థులను సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది.

తొమ్మిదేళ్లుగా..

విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ వారిని సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ 2016లో పాఠశాలల్లో 15 రోజుల పాటు స్వచ్ఛ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. 2016 మొదలుకొని వరుసగా 9 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తూనే ఉంది. సెప్టెంబరు 1 నుంచి 15 వరకు పక్షం రోజుల పాటు నిరంతరంగా స్వచ్ఛ పక్వాడ కార్యక్రమం పాఠశాలల్లో నిర్వహించేందుకు అన్ని జిల్లాల డీఈవోలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు.


పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు



అందరి భాగస్వామ్యంతో..

పాఠశాలల్లో అందరి భాగస్వామ్యంతో స్వచ్ఛపక్వాడ కార్యక్రమం జరుగుతోంది. సమాజాన్ని, విద్యార్థులను భాగస్వాములను చేసి రోజువారి కార్యక్రమాలను ప్రధానోపాధ్యాయులు నిర్వహించనున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పేరెంట్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, పాఠశాల అభివృద్ధి కమిటీలు, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీలు, సమన్వయంతో హెడ్మాస్టర్లు స్వచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

స్వచ్ఛత, పరిశుభ్రతపై అవగాహన

స్వచ్ఛపక్వాడ్ కార్యక్రమం ద్వారా ప్రధానంగా విద్యార్థులకు పరిశుభ్రత, స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తారు. వ్యక్తిగత పరిశుభ్రత పట్ల విద్యార్థులకు ఉపాధ్యాయులు తెలియజెప్పుతారు. ఆరోగ్యకరమైన అలవాట్లను ఎలా అలవర్చుకోవాలో వారికి వివరిస్తారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యకరమైన పాఠశాల ప్రాంగణాలను ఎలా నిలుపుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం తదితర అంశాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తారు.

నీటి పొదుపుపై

స్వచ్ఛ పక్వాడ్ కార్యక్రమంలో మరో ప్రధానాంశం నీటి పొదుపు. వర్షపు నీటిని నిలువ చేయడం, ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించడం, రక్షిత నీటిని వాడుకోవడం తదితర అంశాలపై హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. అదే విధగా మురుగునీరు వల్లకలిగే దుష్ప్రయోజనాలు, కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పిస్తారు.

స్వచ్ఛ పక్వాడ జరుగుతోందిలా..

1న:	పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో స్వచ్ఛతా శపథం
2, 3న:	విద్యార్థులకు శుభ్రతపై అవగాహన కార్యక్రమాలు
4, 5న:	విద్యార్థులు సమాజానికి చేరువయ్యే కార్యక్రమాలు
6న:	పాఠశాలల్లో మొక్కలు నాటడం
7, 8న:	విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీల నిర్వహణ
9, 10న:	విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించడం
11న:	వ్యక్తిగత పరిశుభ్రత దినోత్సవం
12న:	విద్యార్థులను సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం
13, 14న:	పాఠశాలల్లో స్వచ్ఛతా కార్యక్రమాలపై ప్రణాళికల అమలు
15న:	స్వచ్ఛత పక్వాడ ముగింపు, విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
వరంగల్	724	32,384
హనుమకొండ	532	30,819
జనగామ	508	30,875
మహబూబాబాద్	921	60,438
జయశంకర్ భూపాలపల్లి	430	19,652
ములుగు	552	37,287

స్వచ్ఛ పక్వాడ అమలుకు పక్కా ప్రణాళిక

మామిడి జ్ఞానేశ్వర్, వరంగల్ డీఈవో



జిల్లాలోని అన్ని పాఠశాలల్లో స్వచ్ఛ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించేందుకు పక్కా ప్రణాళికను అమలు చేస్తున్నాము. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు కార్యక్రమ వివరాలతో కూడిన ఆదేశాలను జారీ చేశాము. రోజువారి కార్యక్రమాల ఫొటోలు, వీడియోలను సంబంధిత ప్రధానోపాధ్యాయులు పాఠశాల విద్యాశాఖ గూగుల్ లింక్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించాం. జిల్లాలో విద్యాశాఖ సమన్వయంతో పనిచేసి స్వచ్ఛ పక్వాడ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం.

స్వచ్ఛ పక్వాడ అమలుకు అన్ని చర్యలు

ఎ.శ్రీనివాస్, ఏఎంవో, హనుమకొండ



జిల్లాలోని అన్ని పాఠశాలల్లో స్వచ్ఛ పక్వాడ కార్యక్రమం అమలుకు అన్ని చర్యలు చేపట్టాం. డీఈవో ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతీరోజు కార్యక్రమంపై పర్యవేక్షణ కొనసాగుతోంది. పక్షం రోజుల పాటు జిల్లాలో కార్యక్రమాన్ని అందరి సహకారంతో విజయవంతం చేస్తాం.

పాఠశాలల పరిశుభ్రత

స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యతను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తీసుకుంటున్నారు. దీంట్లో భాగంగా పాఠశాల ప్రాంగణాలను పరిశుభ్రంగా మార్చాలి. ఆవరణలో నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పాఠశాలల్లో ఉపయోగం లేని ఫర్నిచర్ తదితర వస్తువులను తొలగించాలి. ఆవరణలో పిచ్చి మొక్కలు లేకుండా తొలగించాలి.

నేటి నుంచి దర్గా రైల్వే గేటు మూసివేత

కాజీపేట, సెప్టెంబరు 13: రైల్వే ట్రాక్ మరమ్మత్తుల దృష్ట్యా ఈనెల 14 నుంచి 18 వరకు దర్గా రైల్వే గేట్ మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ మార్గం మీదుగా ప్రయాణించే వారు ఐదు రోజుల పాటు ఇతర మార్గాల ద్వారా ప్రయాణించాలని తెలిపారు.

పత్తి క్వింటా రూ.7,940

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 13: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం పత్తి ధర పెరిగింది. గత కొద్ది రోజులుగా పెరుగుతూ వస్తుంది. మార్కెట్‌కు 452 బస్తాల పత్తి అమ్మకానికి రాగా గరిష్ఠంగా క్వింటా రూ.7940 ధర పలికింది. గత నెల రోజుల క్రితం వరకు పత్తి ధర క్వింటాకు రూ.7,400, రూ.7,500 వరకే ఉండగా ఇటీవల కొద్ది రోజులుగా రోజు కొద్దికొద్దిగా పెరుగుతూ రూ.7,940 చేరింది. మరోపక్క మార్కెట్లోకి కొత్తపత్తి రాక మొదలైంది. కొత్తపత్తికి క్వింటా రూ.7211 పలికింది. ఇటీవల కురిసిన వర్షాలకు చాలా చోట్ల పత్తి పంటలో పూత, కాత రాలిపోయింది. కనీసం వచ్చిన పత్తి పంటకైనా గిట్టుబాటు ధర(క్వింటా రూ.10వేలు) లభిస్తే అంతేచాలు అన్నట్లు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కొత్త మొక్కజొన్నలకు క్వింటాకు రూ.2,930 పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రజాభవన్‌లో వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన


ప్రజా భవన్‌లో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు అధ్యాపకులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 13: హైదరాబాద్ తెలంగాణ ప్రజా భవన్‌లో శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేసి తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. వర్సిటీలో చాలా ఏళ్లుగా పని చేస్తున్నామని, వయస్సు మీద పడి రిటైర్‌మెంట్‌కు చేరవయ్యామని, మానవతా దృక్పథంతో ఆలోచించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆల్ వర్సిటీస్ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ, కేయూ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకునేందుకు ట్రాక్‌పైకి మహిళ

రెండేళ్ల కూతురితో రాగా కాపాడిన రైల్వే పోలీసులు

గిర్మాజిపేట, సెప్టెంబరు 13 : రెండేళ్ల కూతురుతో సహ రైలు కిందపడి ఆత్మహత్యకు యత్నించిన మహిళను ప్రభుత్వ రైల్వే పోలీసులు కాపాడిన ఘటన శుక్రవారం వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ కథనం ప్రకారం. హనుమకొండలోని డబ్బాలకు చెందిన 27ఏళ్ల పి.మానస తన రెండేళ్ల కూతురిని తీసుకుని రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ప్లాట్‌ఫాంపై కూతురుతో కలిసి మానస తిరుగుతున్న సమయంలో సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ కొద్ది క్షణాల్లో ప్లాట్‌ఫాం ఒకటిపై వస్తుందనే అనౌన్స్‌మెంటు వచ్చింది. ఇది విన్న మానస, కూతురును ఎత్తుకుని రైల్వేస్టేషన్ సమీపంలోని అండర్‌బ్రిడ్జి దాటిన తర్వాత రైలు పట్టాలపై నిలబడింది. అదే లైన్‌పై కాజీపేట నుంచి గోల్కొండ వరంగల్ వైపు రావాల్సి ఉంది.. డ్యూటీలో ఉన్న రైల్వే కీమెన్‌లు గమనించి జీఆర్‌పీకి సమాచారం అందించారు. జీఆర్‌పీ సిబ్బంది కె.విక్రమ్, కె.ప్రశాంతి, సీహెచ్.సుమలత హుటాహుటిన మహిళ దగ్గరకు చేరుకుని పాపతో సహ కాపాడి జీఆర్‌పీకి తరలించారు. అనంతరం మానసకు కౌన్సెలింగ్ చేసి మాట్లాడగా తన భర్త పేరు, నివాసం వివరాలు చెప్పింది. అదే సమయంలో మానస తమ్ముడు క్రాంతికుమార్, భర్త ప్రవీణ్‌లు మానస, పాపలను వెతుక్కుంటూ జీఆర్‌పీకి చేరుకున్నారు. తన భార్య మానసకు కొంతకాలంగా మానసిక ఆరోగ్యం సరిగాలేదని చెప్పగా, వారికి కౌన్సెలింగ్ చేసి సీఐ పంపించారు. తల్లీ బిడ్డలను కాపాడిన సిబ్బంది విక్రమ్, ప్రశాంతి, సుమలతలను సీఐ సురేందర్ అభినందించారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

డోర్నకల్ సెప్టెంబరు 13 : బాలికపై లైంగికదాడికి యత్నించిన ఒకరిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేష్‌నాయక్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో శుక్రవారం బాలిక పాఠశాలకు వెళుతుండగా ఓ వ్యక్తి (35) స్కూల్ వద్ద దింపుతానని ద్విచక్రవాహనాన్ని ఎక్కించుకున్నాడు. ఎవరూలేని చోట మార్గ మధ్యలో ఆ వాహనాన్ని ఆపి, బాలిక (11)పై లైంగిక దాడికి యత్నించాడు. అతడి బారి నుంచి బాలిక తప్పించుకొని, పాఠశాలకు వెళ్లి జరిగిన విషయాన్ని ఉపాధ్యాయులకు చెప్పింది. వెంటనే వారు బాలిక తల్లిదండ్రులకు విషయాన్ని చేరవేశారు. దీం తో తల్లిదండ్రులు స్కూల్‌కు వచ్చి బాలికను తీసుకొని డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఓజోన్ డే సందర్భంగా విద్యార్థులకు పోటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13 : ఓజోన్ డేను పురస్కరించుకొని ఈ నెల 16న రీజనల్ సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, స్పాట్ పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో డి. వాసంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హంటర్‌రోడ్‌లోని రీజనల్ సైన్స్ సెంటర్‌లో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. పూర్తి వివరాలకు డీఎస్‌వో ఎస్. శ్రీనివాసస్వామి (94901 12848)ను సంప్రదించాలని ఆమె కోరారు.

'ఆదిదేవ'లో అన్నీ ప్రత్యేకతలే

43 ఏళ్లుగా గణేష్ ఉత్సవాలు.. ఏటా రూ.2లక్షలకుపైగా పలికే లడ్డూ

కులమతాలకతీతంగా 502 మంది సభ్యులతో సంఘం నిర్వహణ

కేసముద్రం, సెప్టెంబరు 13: సాధారణంగా వినాయక ఉత్సవాలు వచ్చాయంటే చందాలు వసూలు అనేది సర్వసాధారణం. కానీ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం రైల్వేస్టేషన్ ఆవరణలో ఆదిదేవ వెల్ఫేర్ అసోసియేషన్, రైల్వే ఎంప్లాయీస్, శ్రీగణేష్ ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకలు మాత్రం ఇందుకు భిన్నం. 1981 నుంచి అంటే సుమారు 43ఏళ్లుగా చందాల సేకరణ లేకుండా కేసముద్రం రైల్వేస్టేషన్ ఆవరణలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అయితే కుల, మతాలకతీతంగా 2011లో 160 మందితో ఏర్పాటైన ఆదిదేవ వెల్ఫేర్ అసోసియేషన్‌లో గతేడాది 465 మంది సభ్యులు ఉండగా.. ఈఏడాది ఆ సంఖ్య 502కు చేరింది. ఇందులోని ప్రతీ సభ్యుడు నెలకు రూ.200 చొప్పున పొదుపు చేస్తుంటారు. అలా సమకూరిన డబ్బులను అవసరం ఉన్నవారికి రుణాలివ్వడం, వాటిపై వచ్చిన వడ్డీ సొమ్ముతోపాటు స్వచ్ఛందంగా రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ సహకారంతో గణేష్ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం రూ.1.20కోట్ల మూలధనంతో కొనసాగుతున్న ఈ అసోసియేషన్‌లో కేసముద్రం మండలంలో అన్ని వర్గాలు, రంగాలకు చెందిన ప్రముఖులు, నాయకులు సభ్యులుగా ఉన్నారు. ఇదిలాఉంటే సంఘం తరఫున రెండేళ్లకొకసారి సభ్యులంతా తిరుపతికి వెళ్లిరావడం మరో ప్రత్యేకత. అయితే గత 11 ఏళ్లుగా ఈ గణేష్ ఉత్సవాల్లో 10 రోజుల పాటు నిత్యాన్నదానం చేయగా ఈ ఏడాది వర్షాల కారణంగా వాయిదా వేశారు. ఈ ఉత్సవాలకు రూ.10లక్షలవరకు ఖర్చు చేస్తున్న నిర్వాహకులు మండపం వద్ద కోతుల నుంచి రక్షణగా ఓ కొండెంగను ఒంటిస్తంభం ఇంటిపై ఏర్పాటు చేయడం విశేషం.


కేసముద్రం రైల్వేస్టేషన్ వద్ద ఆదిదేవ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన భారీ గణేష్ మండపం, వినాయకుడు

రికార్డు స్థాయిలో లడ్డూ వేలం

ఆదిదేవ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వినాయకుడి వద్ద లడ్డూకు హైదరాబాద్ బాలాపూర్ లడ్డూకు ఉన్నట్టుగా డిమాండ్ ఉంటుంది. ఇక్కడి లడ్డూను దక్కించుకోగలిగితే తమ కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఉత్సవాల చివరి రోజున వేలంపాట ప్రతిష్ఠాత్మకంగా జరుగుతుంది. 2018లో ఇక్కడి లడ్డూ ఉమ్మడి జిల్లాల్లోనే అత్యధికంగా రూ.1.71లక్షలు పలికింది. 2019లో రూ.2.11లక్షలు, 2022లో రూ.2,01,516, గతేడాది రూ.2,21,116, పలికింది.

చందాలు అడగకుండా నిర్వహణ

మంచెన శ్రీనివాస్
ఆదిదేవా వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి



ఏటా ఎవరినీ చందాలు అడగకుండా మా వెల్ఫేర్ అసోసియేషన్ నుంచి ఆర్థిక సహకారం అందిస్తూ ఉత్సవాలను నిర్వహిస్తున్నాం. ఈ సారి ఉత్సవాలకు రూ.9 లక్షలపైగా ఖర్చవుతున్నట్టు అంచనా. రైల్వేశాఖ, కేసముద్రంతో పాటు వివిధ ప్రాంతాలు, విదేశాల్లో ఉన్న భక్తులు ఈ ఉత్సవాలకు సహకరిస్తున్నారు.

రైలు కిందపడి పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య

జనగామ జిల్లా వంగాలపల్లి రైల్వేగేటు సమీపంలో ఘటన

చిలుపూర్, సెప్టెంబరు 13 : రైలు కిందపడి ఓ పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జనగామ జిల్లా చిలుపూర్ మండలంలోని వంగాలపల్లి రైల్వేగేటు సమీపంలో శుక్రవారం జరిగింది. కాజీపేట జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, విద్యార్థి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జఫర్‌గఢ్ మండలంలోని ఉప్పుగల్లు గ్రామానికి చెందిన కొదారి రాజు- రమ దంపతుల పెద్ద కుమారుడు రాజ్‌కుమార్ స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని శివునిపల్లి సెయింట్ థామస్ హైస్కూల్‌లో హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం పాఠశాలకు సంబంధం లేని కొందరు యువకులు రాజ్‌కుమార్ ఉండే హాస్టల్‌లోకి చొరబడి అతడితో పాటు అతడి స్నేహితులతో గొడవ పడ్డారని, ఈ విషయాన్ని సమస్యను పాఠశాల ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో భయాందోళనకు గురైన తమ కుమారుడు పాఠశాల నుంచి బయటకు వెళ్లి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని రాజ్‌కుమార్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆరోపించారు. కాగా, తమ కుమారుడి మృతికి పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరే కారణమని, తమ కుమారుడు శుక్రవారం ఉదయం 5.30గంటలకు బయటకు వెళ్తే, పాఠశాల యాజమాన్యం తమకు 10 గంటలకు సమాచారమిచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమారుడు కనిపించకుండా పోయిన విషయమై తాము పోలీసులకు ఫిర్యాదు చేసేలోపే మరణవార్త వినాల్సి వచ్చిందని కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, రాజ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. అయితే ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ కేసీ జాన్ బన్నీని వివరణ కోరగా, బయటి వ్యక్తులు ఎవరూ తమ పాఠశాల ఆవరణలోకి రాలేదన్నారు. కేవలం అది దుష్ప్రచారం మాత్రమేనన్నారు. సదరు విద్యార్థి రాజశేఖర్ శుక్రవారం ఉదయం 7 గంటలకే స్నానం చేసి బయటకు వెళ్లాడని, స్టేషనరీ వస్తువులు కొనుక్కునేందుకు వెళ్లి ఉంటాడని భావించామని, కానీ తరగతులు ప్రారంభమైనా రాకపోవడంతో అనుమానం వచ్చి తల్లిదండ్రులకు సమాచారమిచ్చామని వివరించారు. రాజశేఖర్ తల్లిదండ్రులు వచ్చాక వాళ్లు, తాము కలిసి స్టేషన్ ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లామని, పోలీసులకు ఫిర్యాదు ఇస్తుండగానే ఆత్మహత్య విషయం తెలిసిందని వివరించారు. విద్యార్థి మృతి తమను కలిచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక రాజశేఖర్ ఆత్మహత్య ఘటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సెయింట్ థామస్ పాఠశాల ఎదుట స్టేషన్‌ఘన్‌పూర్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


రాజ్‌కుమార్ (ఫైల్)

ఏచూరి లేని లోటు పూడ్చలేనిది

సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి చక్రపాణి

నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ

బాలసముద్రం, సెప్టెంబరు 13: మూడు దశాబ్దాలకు పైగా సీపీఎం కేంద్ర పార్టీ నాయకత్వ బృందంలో పలు అంశాలపై పార్టీ రాజకీయ వైఖరులను రూపొందించి ముఖ్య భూమిక పోషించిన సీతారాం ఏచూరి ఆయన తుది శ్వాస విడిచే వరకు ప్రజా పోరాటాల్లో నిమగ్నమయ్యారని హనుమకొండ సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అన్నారు. శుక్రవారం సీతారాం ఏచూరికి సంతాప సూచికగా హనుమకొండ చౌరస్తా నుంచి కొవ్వొత్తుల ర్యాలీ అశోక జంక్షన్ వరకు నిర్వహించారు. ఈసందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ భారత రాజకీయాలలో సీతారాం ఏచూరి లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. నిత్యం ప్రజా సమస్యలపై గళమెత్తే ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీలు గొడుగు వెంకట్, జి.రాములు, డి.తిరుపతి, దీప, జిల్లా నాయకులు టి.ఉప్పలయ్య, వాంకుడోత్ వీరన్న, మంద సంపత్, డి.భానునాయక్, గాదె రమేష్, ఎస్.కిశోర్, జి.ప్రతాప్, కె.కుమారస్వామి, కారు ఉపేందర్, కుక్కముడి రవీందర్, ఎం.రమాదేవి, డి.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్నసీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి చక్రపాణి, నేతలు

- కాజీపేట: కాజీపేట ఫాతిమా జంక్షన్‌లో శుక్రవారం ఏచూరి సీతారాం సంతాప సభ జరిగింది. కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. చుక్కయ్య నాయకులు ఓ.సాంబయ్య, జె.రమేశ్, టి.మల్లేశం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

తహసీల్దార్‌ను దూషించిన దంపతులపై కేసు

ఐనవోలు, సెప్టెంబరు 13: తహసీల్దార్ విధులకు ఆటంకం కలిగించి దూషించిన భార్యభర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. సింగారం గ్రామానికి చెందిన శాగంటి లక్ష్మీరాములు దంపతులకు రాజ్‌కుమార్, శేఖర్ కుమారులున్నారు. ఇద్దరికి రెండు ఎకరాల చొప్పున గతంలో భూమిని పంపిణీ చేశారు. రాజ్‌కుమార్ మృతిచెందడంతో ఆయన కుమారుడు హర్షవర్ధన్ పేరుమీదు రెండు ఎకరాల భూమిని శుక్రవారం తాతానాయనమ్మలు రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ విషయం తెలుసుకున్న శేఖర్ ఆయన భార్య మౌనికలు తమ కుటుంబానికి చెందిన భూమిని తనకు తెలియకుండా ఎలారిజిస్ట్రేషన్ చేస్తారంటూ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వాగ్వాదం చేశారు. నిబంధనల ప్రకారం చేస్తున్నామని తహసీల్దార్ ఎంత నచ్చచెప్పినా వారు వినకుండా తహసీల్దార్‌ను దుర్భాషలాడి దురుసుగా ప్రవర్తించారు. దీంతో తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భార్యభర్తలు కలిసి విధులకు ఆటంకం కలిగించారని వారిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువు వద్ద మృతశిశువు లభ్యం

చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి కంటపడిన వైనం

జనగామ జిల్లా నెల్లుట్లలో అమానవీయ ఘటన


నెల్లుట్ల చెరువు వద్ద లభ్యమైన మృతశిశువు

లింగాలఘణపురం, సెప్టెంబరు 13 : అప్పుడే పుట్టిన మగశిశువుని ప్లాస్టిక్ సంచిలో మూటగట్టి గుర్తుతెలియని వ్యక్తులు చెరువులో పడేశారు. ఈ అమానవీయ ఘటన జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్ల పెద్దచెరువు వద్ద శుక్రవారం జరిగింది. జనగామ పట్టణానికి చెందిన మారపాక కార్తీక్ అనే యువకుడు శుక్రవారం పట్టణ సమీపంలోని నెల్లుట్ల పెద్దచెరువు వద్ద చేపలు పట్టేందుకు గాలం వేశాడు. ఆసమయంలో పక్కనే చెట్ల పొదల మధ్య నల్లని ప్లాస్టిక్ కవర్‌లో మూటగట్టిన మృతశిశువు ఆనవాళ్లు కనిపించాయి. దీంతో వెంటనే భయాందోళనకు గురైన కార్తీక్ తన సోదరుడు నవీన్‌కు తెలపడంతో అతడు వెంటనే లింగాలఘణపురం పోలీసులకు సమాచారమిచ్చాడు. వెంటనే సిబ్బందితో అక్కడికి చేరుకున్న లింగాలఘణపురం ఎస్‌ఐ బండి శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు. ప్లాస్టిక్ కవర్‌ను తెరిచి చూడగా అందులో మగ మృత శిశువును కనిపించింది. అయితే శరీరంపై రక్తపు మరకలు, బొడ్డు తాడును చూస్తే పుట్టిన గంట వ్యవధిలో ఈ మగశిశువును గుర్తుతెలియని వ్యక్తులు చెరువులో పడేసి ఉంటారని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. సంఘటనాస్థలంలో వివరాలు సేకరించిన ఎస్సై శ్రవణ్‌కుమార్ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకున్నారు. శిశువు మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి

మహబూబాబాద్ జిల్లాలో ఘటన


మృతి చెందిన మన్విత్ శకుంతల్

పెద్దవంగర, సెప్టెంబరు 13: ప్రమాదవశాత్తు ఆడుకుంటూ.. నీటి సంపులో పడి ఓ బాలుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం. చిట్యాల గ్రామానికి చెందిన తన్నీరు వేణు-రమ దంపతులకు ఇద్దరు కుమారులు. వారిలో పెద్ద కొడుకు సాయిశకుంతల్ పాఠశాల వెళ్లగా, చిన్నకొడుకు మన్విత్ శకుంతల్ (5) ఇంటి ఆవరణలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి సం పులో పడ్డాడు. ఇది గమనించని తల్లిదండ్రులు బాలుడి కోసం చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అనుమానం వచ్చి వారు నీటి సంపులో వెతుకగా, అప్పటికే మృతి చెందిన మన్విత్‌శకుంతల్ మృతి చెంది కనిపించాడు. బాలుడు తల్లి రమ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం పోలీసులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కన్న కొడుకు కళ్లముందే మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2930	2805
పల్లికాయ (సూక)	5500	4500
పల్లికాయ (పచ్చిది)	4150	3400
కందులు	8659	6750
పెసలు	7422	4552
పత్తి	7940	5500
పసుపు (కాడి)	12379	10000
పసుపు (గోల)	11844	10009
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	18500	14000
వండర్‌హాట్ ఏసీ	15500	13000
యూఎస్341 ఏసీ	15500	11000
దేశీ ఏసీ	24000	20000
సింగిల్‌పట్టి ఏసీ	21800	21800
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం



ఏచూరి మరణం పేద వర్గాలకు తీరని లోటు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 13 : సీపీఐ(ఎం) కేంద్ర ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పేద కార్మిక వర్గాలకు తీరని లోటని అఖిల భారత విశ్వ విద్యాలయాల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కేయూ క్యాంపస్‌లోని బయోటెక్నాలజీ విభాగంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ శాస్త్రి, డాక్టర్ సంగాని మల్లేశ్వర్, మెట్టు రవి, కచ్చకాయల చిరంజీవి, కె.రవి, రంజిత్, చేరాలు తదితరులు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ పుల్లా శ్రీనివాస్

టెండర్‌దారులకే విక్రయాలు

అధిక ధరలకు విక్రయాలపై నోటీసులు జారీ : భద్రకాళి ఆలయ ఈవో

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 13: భద్రకాళి దేవాలయంలో కొబ్బరి ముక్కలు పోగు చేయడం, కొబ్బరికాయలు, పూల విక్రయం, అమ్మవారి చీరల విక్రయాలన్నీ హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ద్వారా వేలం నిర్వహించి లైసెన్స్ కల్పించడం జరుగుతుందని భద్రకాళి దేవస్థానం ఈవో శేష భారతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దిన పత్రికలో వచ్చిన వార్తలను ఈవో వ్యక్తిగత దూషణలుగా పరిగణిస్తూ ఖండించారు. కొబ్బరి నీళ్ల విక్రయాలపై కొబ్బరి ముక్కల టెండర్‌దారుకు నోటీసులు జారీ చేయడం జరిగిందని, దానిపై వివరణ కోరినట్లు ఈవో తెలిపారు. భక్తుల కానుకలను వేలం ద్వారానే అందించడం జరుగుతుందన్నారు. భక్తులు సమర్పించే, అమ్మవారికి వచ్చిన చీర లు, కనుములు వాటిని టెండర్ దారుకు వేలం పాటలో విక్రయించడానికి లైసెన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. చెప్పుల స్టాండ్ వద్ద ఉద్యోగులెవరినీ నియమించలేదని, పాదరక్షలు విడిచేందుకు ప్రత్యేక స్థానం కేటాయించడం జరిగిందన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఏఐకేఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 13 : రైతుల సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత రైతు సమాఖ్య(ఏఐకేఎఫ్) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఏఐకేఎఫ్ జాతీయ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్ ఎదుట రైతుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేశారు. అనంతరం రైతుల సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని డీఆర్‌వో వైవి గణేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసరెడ్డి, ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్షుడు కూసం బుచ్చన్న, జిల్లా కమిటీ సభ్యులు పెద్దిరెడ్డి మహేందర్ రెడ్డి, నీలం రవీందర్, మాస్ సావిత్రి, మంద భద్రయ్య, మొగిలి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

చెరువులకు వెళ్లే రహదారులు బాగుచేయండి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 13 : వరంగల్ నగరం చుట్టుపక్కల గణేశ్ నిమజ్జనానికి 9 చెరువులకు వెళ్లే రహదారులు చాలా చోట్ల గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారయని, శాని టేషన్, ఇంజనీరింగ్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వరంగల్ జిల్లా చెరువులు పరి రక్షణ సమితి అధ్యక్షుడు లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్యా లయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి వినతిపత్రం సమర్పించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి సిలివేరు నర్సయ్య ఉన్నారు.

క్వాడ్రంట్ వాక్ ఇన్ డ్రైవ్‌కు విశేష స్పందన

60 మంది యువతకు ఉపాధి

మడికొండ, సెప్టెంబరు 13: మడికొండ ఐటీ సెజ్‌లోని క్వాడ్రంట్ కంపెనీలో శుక్రవారం నిర్వహించిన వాక్ ఇన్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళాకు 450 మంది విద్యార్థులు హాజరై నమోదు చేసుకున్నారు. వీరి నుంచి సమర్థులైన 60 మందిని ఎంపిక చేసి తమ కంపెనీలో ఉద్యోగ అవకాశం కల్పించినట్లు క్వాడ్రంట్ డైరెక్టర్ కంచరకుంట్ల మురళీధర్‌రెడ్డి తెలిపారు. కంపెనీలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందని తెలిపారు.

బీఆర్ఎస్ శ్రేణుల ముందస్తు అరెస్టు

మడికొండ, సెప్టెంబరు 13: మాజీ మంత్రి హరీష్‌రావు పిలుపు మేరకు మడికొండకు చెందిన 64వ డివిజన్ కార్పొరేటర్, బీఆర్ఎస్ నేత ఆవాల రాధికారెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు తరలి వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులను ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, ఎస్సై రాజబాబు ముందస్తుగా అరెస్టు చేశారు. వీరిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో జానపట్ల సారయ్య, కట్ట వెంక ట్రాంనర్సయ్య, ఈదురు అనిల్, వస్కుల దేవేందర్, ముప్పిడి శివ, రాసమల్ల వెంకటస్వామి, గోపనబోయిన రాజు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మార్మోగుతున్న విఘ్నేశ్వరుడి నామస్మరణ

కుంకుమ పూజలు.. అన్నదానాలు

వడ్డేపల్లి, సెప్టెంబరు 13 : హనుమకొండలోని వివిధ డివిజన్లలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు శుక్రవారం విఘ్నాధిపతికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. హనుమకొండ గోపాల్‌పూర్‌లోని బృందావన కాలనీలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు రచ్చ నాగేశ్వర్‌రావు, దూలం తిరుపతి, లక్ష్మీనర్సయ్య, పూర్ణచందర్‌ల ఆధ్వర్యంలో మహిళా భక్తులు రచ్చ పద్మ, కొడగాని కవిత, నాగసింధు, వాణి, రమ, నిర్మల, అంచూరి కవిత వేద పండితులు అవధానుల సీతారామ శాస్త్రి పర్యవేక్షణలో కుంకుమ పూజలను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని కనకదుర్గా కాలనీలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● హనుమకొండ కలెక్టరేట్ : సుబేదారిలోని హరిహర అపార్ట్‌మెంట్, యజూర్ అపార్ట్‌మెంట్, ద్వారకా సాయి అపార్ట్‌మెంట్, ఎస్‌వీఎస్ హోమ్స్ తోపాటు హనుమకొండలోని పలు అపార్ట్‌మెంట్‌లోల ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాల నిర్వాహకులను అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం శాలువాలు కప్పి సన్మానించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రెంటాల కేశవరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను పెట్టి పూజించి పర్యావరణ పరిరక్షకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అపా ర్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నడుముల విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు పెంతల అశోక్ రెడ్డి, సహాయ కార్యదర్శులు గుంద్ల శ్రీనివాస్, రాజ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిదర అంజనీదేవి పాల్గొన్నారు.

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయ్‌చందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం దగ్గర శుక్రవారం రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సం దర్భంగా విజయ్‌చందర్‌రెడ్డి అన్నదానం చేసి మాటా్లడారు. కార్యక్ర మంలో రెడ్‌క్రాస్ సొసైటీ కోశాధికారి బొవిన్మనేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వీ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

● హనుమకొండ : హనుమకొండ పరిమళ కాలనీ రోడ్డు నెంబరు 7లోని సిగ్నేచర్‌ప్లేస్ అపార్టుమెంట్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కుంకుమ పూజ ఘనంగా జరిగింది. అర్చకుడు రామ లింగ శర్మ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కుం కుమ పూజల్లో అపార్టుమెంట్‌లోని మహిళలంతా భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు, తొలుత అర్చకుడు వరసిద్ధి వినాయకునికి పూజ చేసిన అనంతరం మహిళలతో సామూహిక కుంకుమార్చన చేయించారు. కార్యక్రమంలో 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సుని ల్ కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ తమ్మెర కమలా కర్ రావు, ప్రముఖ గణితావధాని, రిటైర్డ్ మ్యాథ్స్ లెక్చరర్ నర్సింహమూర్తి శాలువ కప్పి సత్కరించారు.

● మడికొండ : మడికొండ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న జయరాజ్ ఎల్లపుడూ సమాజ సేవలో ముందుంటారు. గణపతి నవరాత్రోత్సవాలలో భాగంగా శుక్రవారం మడికొండ ఎంఎన్ నగర్‌కు చెందిన సుమారు 50 మంది నిరుపేదలకు దద్దోజనం, పులిహోర, లడ్డూలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పలువురు జయరాజ్‌ను అభినందించారు.

● వరంగల్ కార్పొరేషన్ : హనుమకొండ నక్కలగుట్ట బల్దియా సర్కిల్ కార్యాలయంలోని సర్వమంగళగిరి వినాయక ఆలయం వద్ద హనుమకొండ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ గుండు సుధారాణి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు, ప్రధాన కార్యదర్శి అదిల్ హమ్మద్, సభ్యులు మహమ్మద్ ఖాజాపాష, కర్రు రమేష్, అమీర్, మాదవశంకర్, సంపత్‌లు పాల్గొన్నారు.



నక్కలగుట్టలో గణపతి మండపం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న మేయర్ గుండు సుధారాణి



మట్టి వినాయక విగ్రహ మండలికి అవార్డు అందజేస్తున్న కేశవరెడ్డి



గోపాల్‌పూర్ బృందావన కాలనీలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



హనుమకొండ శ్రీలక్ష్మీనగర్ కాలనీలో పూజల్లో పాల్గొన్న మహిళలు

ఘనంగా లక్ష గరికపూజ

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 13 : గణపతి నవరాత్రి వేడుకలు శుక్రవారానికి 7వ రోజుకు చేరుకున్నాయి. రుద్రేశ్వరాలయంలో వైభవంగా నిర్వహిస్తున్న ఉత్తిష్ఠ గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం శ్వేతార్క మూలగణపతిగా శోభాయమానంగా అలంకరింపజేసి పూజాదికాలు నిర్వహింపజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వద్దిరాజు వెంకటేశ్వర్ రావు సౌజన్యంతో లక్ష గణపతి నామాలతో లక్ష గరికపూజను నిర్వహించారు. అనంతరం మహానివేదన, వైదిక మంత్రపుష్పం నిర్వహించారు. లోక కల్యాణార్థం యాగశాలలో రుద్రపంచముఖ మూలమంత్రంతో శ్రీసూక్త, బీజాక్షరాలతో సరస్వతి, మహాలక్ష్మీ, దుర్గాల పేరిట అయుష్యహోమం నిర్వహించారు. శ్వేతార్క మూలగణపతి అలంకారంలో ఉన్న స్వామిని హంసవాహనంపై వాహనసేవ నిర్వహించారు. వేముల సత్యమూర్తి దంపతుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు.



గరిక పూజ నిర్వహిస్తున్న గంగు ఉపేంద్రశర్మ

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డేపల్లి, సెప్టెంబరు 13: అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ 60వ డివిజన్‌లోని వడ్డేపల్లిలో రూ. 40 లక్షల అంచనాతో నిర్మించే రోడ్లు, డ్రెయినేజీ అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్‌తో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ వడ్డేపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ఏకైక లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, 58, 59, 60వ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాళ్లపెల్లి సుధాకర్, రవి కిరణ్, ఎనుకొంటి పున్నంచందర్‌తో పాటు కాంగ్రెస్ శ్రేణులు ముస్తాక్ నెహాల్, తాళ్లపెల్లి రవీందర్, తాళ్లపెల్లి మేరి, ఎండి అక్మల్, బుస్స నవీన్‌కుమార్, బీజేపీ నేతలు నాగపురి అశోక్, మట్టెపల్లి రాంరాజ్, రోకుల సతీష్, రైతు సంఘం అధ్యక్షుడు కటకం కిషన్, తోట పవన్ తదితరులు పాల్గొన్నారు.



వడ్డేపల్లిలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్ అభినవ్ భాస్కర్

చెరువులను పరిరక్షించాలి..

వడ్డేపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పరిధిలోని ఐదు చెరువులు, కుంటలు అన్యాక్రాంతమయ్యాయని వాటిని పరిరక్షించాలని సహకార సంఘం అధ్యక్షుడు మట్టెపల్లి నర్సింగం, ఉపాధ్యక్షుడు మట్టెపల్లి రాంకోటేశ్వర్, ప్రధాన కార్యదర్శి మట్టెపల్లి శంకర్ తదితరులు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం వడ్డేపల్లిలో కలిసి ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువులు, కుంటల పరిరక్షణ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.

చిట్టి డబ్బులు చెల్లించకుండా మోసం చేసిన వ్యక్తిపై కేసు

బాలసముద్రం, సెప్టెంబరు 13: చిట్‌ఫండ్ పేరుతో డబ్బులు తీసుకుని బాధితుల కు చెల్లించకుండా మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన హనుమకొండలో జరిగింది. సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన పచ్చిక నిరంజన్‌రెడ్డి అక్షయ ధరణి చిట్‌ఫండ్ పేరుతో 25 నుంచి 50 మంది సభ్యులతో ఒక గ్రూపుగా ఏర్పాటు చేశాడు. సభ్యుల వద్ద నుంచి ఏజెంట్ల ద్వారా నెలనెల చిట్టి డబ్బులు వసూ లు చేసి సభ్యులకు డబ్బులు తిరిగి చెల్లించడం లేదు. 2018లో హనుమకొండకు చెం దిన భక్కి దిగంబర రావు, అతని భార్య మంజుల రూ. 50 లక్షల చిట్టి డబ్బులు చెల్లించారు. చిట్‌ఫండ్ డైరెక్టర్ నిరంజన్‌రెడ్డి వారికి వారికి చెల్సించాల్సిన డబ్బులలో రూ. 20 లక్షలు చెల్లించి మిగిలిన రూ. 30 లక్షలను చిట్‌ఫండ్‌లో డిపాజిట్ చేస్తే 18 శాతం వడ్డీతో ప్రతీ నెల వాయిదాల రూపంలో చెల్లిస్తామని చెప్పి డబ్బులు తిరిగి చెల్లించడం లేదు. నాలుగేళ్లగా బాధితులను ఇవ్వాల్సిన మొత్తంలో 16,70,625 చెల్లించి, మిగిలిన రూ.16,21,875 రూపాయలు ఇవ్వకుండా దిగంబరరావు, మంజులను ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో వారు చిట్‌ఫండ్ డైరెక్టర్ నిరంజన్‌రెడ్డిపై సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సుబేదారి ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేయగా శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



చిట్‌ఫండ్ డైరెక్టర్‌ను రిమాండ్ చేసి వివరాలు తెలిపిన సీఐ

ఉత్తమ పాఠశాలగా సేయింట్ గ్యాబ్రియేల్

అవార్డు ప్రదానం చేసిన న్యూఢిల్లీ ర్యాంకింగ్ సంస్థ

కాజీపేట, సెప్టెంబరు 13 : కాజీపేట ఫాతిమానగర్‌లోని సేయింట్ గ్యాబ్రియేల్ స్కూల్ ఉమ్మడి జిల్లా ఉత్తమ పాఠశాలగా ఎన్నికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోని పొలిశెట్టి తెలిపారు. ఇటీవల సీ ఫోర్ స్కూల్ ర్యాంకింగ్ కమిటీన్యూఢిల్లీ బృందం స్కూల్‌ను సందర్శించి పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఆ నెల 11న ఢిల్లీలో ర్యాంకింగ్ సంస్థ డైరెక్టర్ పలేటి చేతులమీదుగా అవార్డు తీసుకున్నట్లు బ్రదర్ ఆంటోని చెప్పారు.

భీమారం చెరువు ఆక్రమణలపై సర్వే

26 అక్రమ కట్టడాల గుర్తింపు

రాంనగర్, సెప్టెంబరు 13 : హసన్‌పర్తి మండలం భీమారం శ్యామల చెరువు ఆక్రమణలపై ఇరిగేషన్, రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు శుక్రవారం సర్వే చేశారు. చెరువు విస్తీర్ణం 67 ఎకరాల 22 గుంటలు కాగా, 20 ఎకరాలకు పైగా కబ్జా అయినట్లు చెరువు పరిరక్షణ సభ్యులు అధికారులకు ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం సైతం చెరువుల కబ్జాపై సీరియస్‌గా ఉండడంతో పాటు వాటి లెక్క తేల్చాలని ఆదేశించింది. ఈ క్రమంలో అధికారులు భీమారం శ్యామల చెరువును సర్వే చేశారు.

పోలీసుల రక్షణతో సర్వే నిర్వహించిన అధికారులు మొదటి రోజు 26 స్థలాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు తేల్చారు. వాస్తవంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో 80 ఇళ్లకు పైగా నిర్మాణాలు జరిగినట్లు సమాచారం. తొలిరోజు సర్వేలో 26 అక్రమ కట్టడాలను తేల్చిన అధికారులు రెండు రోజుల్లో పూర్తి స్థా యి సర్వే చేసి అక్రమ కట్టడాల లెక్క తేల్చడంతో పాటు హద్దులు నిర్ణయించనున్నారు. చెరువు స్థలం ఆక్రమించుకున్న వారిలో అధికా ర నేతలున్నట్లు తెలిసింది. ఇటీవల జరిగిన కూల్చివేతల్లో అనుచరుడి అక్రమ కట్టడాన్ని కూల్చకుండా అధికార పార్టీ ముఖ్య నేత కాపాడినట్లు ప్రచారం జరుగుతుంది. మార్కింగ్ ఇచ్చిన ఇళ్లు, స్థలాల్లో ఎక్కువగా అధికార పార్టీ నేతల అండదండలతో నిర్మించినవనే ఆరోపణలున్నాయి.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 13 : సబ్‌స్టేషన్‌ల నిర్వహణలో భాగంగా నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు, న్యూశాయంపేట పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, బాలసముద్రం పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 10.30 వరకు మచిలీబజార్ పరిధిలో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, పెద్దమ్మగడ్డ పరిధిలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, వడ్డేపల్లి, టెక్స్‌టైల్ పార్కు, ఆర్ఈసీ, సోమిడి, రాంపూర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 10.30 విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ జి. సాంబరెడ్డి తెలిపారు. అదే విధంగా కాజీపేట బాపూజీనగర్ ఫీడర్ పరిధిలోని బాపూజీనగర్, వెస్ట్‌సిటీ, బాలాజీనగర్, ఇంపీరియల్ కాలనీ, భవానినగర్, శాంతినగర్, కాజీపేట మెయిన్‌రోడ్డు అమీర్ హోటల్ ఏరియా, అంబేద్కర్‌నగర్, బెల్ట్ ఖాదర్ ఏరియలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

రూ.1.51కోట్లతో గణపతికి లక్ష్మీపూజ

వరంగల్ శివనగర్‌లో కరెన్సీనోట్లతో అలంకరణ



ఖిలావరంగల్, సెప్టెంబరు 13: వరంగల్ నగరంలోని శివనగర్‌లో రూ.1.51 కోట్ల కరెన్సీ దండలతో గణపతిని ప్రత్యేకంగా అలంకరించారు. శివనగర్ వాసవిలైన్‌లో శివనగర్ వాసవి ట్రస్టు, వినాయక ట్రస్ట్ భవన్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మట్టిగణపతిని ఏర్పాటు చేసి. నవరాత్రి ఉత్సవాల్లో ఆరోరోజైన శుక్రవారం రూ.500, రూ.200, రూ.100, రూ.50, రూ.20, రూ.10 నోట్లతో అల్లిన దండలతో అలంకరించి లక్ష్మీపూజ చేశా రు. 21సంవత్సరాలుగా ఇక్కడి గణపతికి డబ్బుల దండలతో అలంకరణ, పూజలు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గత సంవత్సరం 1.18 కోట్లతో ధనలక్ష్మి పూజలు చేశామని ఈసారి రూ.1.51కోట్లతో అలంకరణ చేశామని పేర్కొన్నారు. ఈ నగదును సుమారు 150మంది వ్యాపార, ఉద్యోగులు సమకూర్చారు. దండలు అల్లగా మిగిలిన నగదును విగ్ర హం ఎదుట కట్టలుగా పేర్చారు. పూజల అనంతరం ఎవరు తెచ్చిన సొ మ్మును వారు తీసుకెళ్లారని నిర్వాహకులు తెలిపారు.

ఉత్తమ్ కమిటీని ఉపసంహరించుకోవాలి

వడ్డేపల్లి, సెప్టెంబరు 13: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అమలు కోసం తెలంగాణ ప్రభుత్వం నియమించిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కమిటీని వెంటనే ఉపసంహరించుకోవాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీల అభిప్రాయాన్ని సేకరించకుండా వర్గీరణ అమలు పేరుతో కమిటీ వేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. ఏకపక్షంగా ఉన్న మంత్రుల కమిటీతో తెలంగాణలో మాల, మాల ఉపకులాలకు ఏ మాత్రం న్యాయం జరుగదని పేర్కొన్నారు. ఏ ఒక్క మాల మంత్రి లేకుండా కమిటీని ఎలా నియమిస్తారని బండి అశోక్ ప్రశ్నించారు. మంత్రుల కమిటీలోనే మాలలకు అన్యాయం జరిగితే, ఇక ఈ కమిటీ మాల సమాజానికి ఏ విధంగా న్యాయం చేస్తుందని అన్నారు. ఒక రెడ్డి, ఒక మాదిగ, ఒక ఎస్టీ, ఒక బీసీ, ఒక బ్రాహ్మణ సామాజిక వర్గాలకు చెందిన మంత్రులు కమిటీలోఉన్నారని పేర్కొన్నారు. మాల సామాజిక వర్గం నుంచి మంత్రి కమిటీలో ఎందుకు లేరని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర జిల్లా నాయకులు సూరాసి విక్రమ్, శేషాద్రి నాగులు, ముజ్జిగ క్రాంతి కుమార్, జట్టి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎంకు మైక్‌సెట్ వితరణ

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 13 : దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎంజీఎం ఆస్పత్రిలో ఓపీ విభాగంలో రోగులకు తగు సూచనలు ఇచ్చేందుకు రూ. 14వేల విలువైన మైక్ సెట్‌ను గురువారం అందజేశారు. ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి, ఆర్ఎంవో డాక్టర్ కోడం మురళీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బిల్ల మహేందర్, కార్యదర్శి నున్న నర్సమ్మ మాట్లాడుతూ దివ్యాంగుల ఆస్పత్రిలో దివ్యాంగ ఉద్యోగుల పనితీరు ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం ఉద్యోగులు బొప్పి ఉమారాణి, బి.సునీత, కె.స్వర్ణలత, రవీందర్, వాణి రాజేశ్వరి, రేణుక, బత్తిని రాజు, రాజేందర్, చక్రపాణి, షబీర్ తదితరులు పాల్గొన్నారు.



మైక్ సెట్ అందజేస్తున్న బిల్ల మహేందర్

వరంగల్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఎంపీ

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13 : వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయడంతో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. శుక్రవారం నిట్‌లో నిర్వహించిన కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ఇంటరాక్టివ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ డాక్టర్ కావ్య మాట్లాడుతూ... వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధే తమ ధ్యేయమని ఆమె అన్నారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో వరంగల్ అతిపెద్ద రెండవ నగరమని, వరంగల్ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వానికి నిర్దిష్టమైన ప్రణాళికలున్నాయన్నారు. ప్రత్యేక శ్రద్ధతో నగరాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అన్ని వనరులు సమృద్ధిగా ఉన్న వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. స్మార్ట్ సిటీలో భాగంగా వరంగల్ అభివృద్ధి సాధిస్తుందన్నారు. కేంద్రం నుంచి అధిక నిధులు తీసుకువచ్చి వరంగల్ నిట్‌ను టెక్నికల్ రీసెర్చ్ విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, సీఐఐ తెలంగాణ చైర్మన్ సాయి డి. ప్రదీప్, 6డీ వర్క్స్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ తాళ్లూరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ కావ్య

'దోనగుట్ట ఆలయ అభివృద్ధికి కృషి'

న్యూశాయంపేట, సెప్టెంబర్ 13: దోనగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. న్యూశాయంపేటలోని దోనగుట్టపై వెలిసిన త్రివేద్రాద్రి సంతోష లక్ష్మీనరసింహస్వామిని శుక్రవారం ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న దుర్గామాత అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ.. ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తన దృష్టికి తీసుకువస్తే చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గ్రంథి సత్యవతి, స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్లు వేల్పుల మోహన్‌రావు, మాడిశెట్టి శివశంకర్, నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య 9
కుటుంబ కదంబం
శనివారం • 14 సెప్టెంబరు 2024

కొన్ని సార్లు మనకు ఇష్టం లేకపోయినా ఇతరులను క్షమించాల్సి వస్తుంది. దీన్ని టాక్సిక్ ఫర్‌గివ్‌నెస్ అంటారు మానసిక నిపుణులు. ఇలాంటి సమయాల్లో మనం బయటకు ఆనందాన్ని వెలిబుచ్చినా.. మనసులో మాత్రం అసంతృప్తి మిగిలిపోతుంది. దీనివల్ల సమస్యలు పరిష్కారం కావని.. మరింత జటిలమవుతాయని అంటున్నారు మానసిక నిపుణులు.



క్షమించడమూ సరికాదు

ఎలా కనుక్కోవాలి: సరైన ఆలోచన లేకుండా క్షమించేయటం.. కొన్ని సంఘటనలు మనసును కలచివేస్తాయి. ఇబ్బంది పెడతాయి. అలాంటి సంఘటనలకు కారణమయిన వారిని ఆలోచన లేకుండా క్షమించేస్తే పరిస్థితులు మెరుగుపడవు. మనసులో అసంతృప్తి మిగిలిపోతుంది.

తీవ్రతను తగ్గించటం: ఇతరుల తప్పుల తీవ్రతను తగ్గించి.. వారు ఆ తప్పులు చేయటానికి వెనకున్న కారణాలను వెదికి వారిని క్షమించేస్తారు. దీని వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు.

బయటకు చెప్పకపోవటం: కోపం, ఆందోళన, ద్వేషం- వీటిని బయటకు ప్రదర్శించకుండా మనసులో దాచుకోవటం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు.

తప్పు మనదేనని భావించటం: ఇతరుల ప్రవర్తనకు తమదే కారణమని.. తప్పు మనదేనని భావించి.. ఇతరులను క్షమించేయటం వల్ల మానసిక ఒత్తిడి పెరుగుతుంది తప్ప తగ్గదు.

తప్పనిసరి సంబంధాలు: మనను ఇబ్బంది పెడుతున్నవారితో తప్పనిసరి పరిస్థితుల్లో సంబంధాలు కొనసాగించాల్సి వస్తే- దానిని టాక్సిక్ ఫర్‌గివ్‌నెస్ అనవచ్చు.

సంఘర్షణకు దూరంగా: సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించకుండా.. సంఘర్షణలకు దూరంగా ఉండటం సరైన పద్ధతి కాదు.

పరిష్కారమేమిటి?: టాక్సిక్ ఫర్‌గివ్‌నెస్ వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయనే విషయాన్ని గమనించినప్పుడు- వీలైనంత త్వరగా స్పందిస్తే మంచిది. ఈ స్పందన సరైన రీతిలో ఉండాలంటే కొన్ని ఎక్సర్‌సైజ్‌లను మానసిక నిపుణులు సూచిస్తున్నారు.

డైరీలో రాయండి: ఒక డైరీ తీసుకొని దానిలో మనోభావాలన్నింటినీ విపులంగా రాయాలి. దీని వల్ల మనసు తేలికబడుతుంది.

పరిధులు నిర్ణయించుకోండి: సమస్యకు పరిధులు ఏమిటి? వాటిని ఎలా అధిగమించాలి? దానికి ఎలాంటి ప్రణాళిక అవసరం అనే విషయాలను నిర్ణయించుకోవాలి. అప్పుడు సమస్యపై స్పష్టత లభిస్తుంది.

వేచి చూడండి: కొన్ని సమస్యలకు కాలమే పరిష్కారం చూపిస్తుంది. అందువల్ల సమస్య ఏర్పడిన వెంటనే స్పందించకుండా కొద్ది కాలం వేచి చూడటం వల్ల ప్రయోజనం ఉంటుంది.

కాలపరిమితులు: ఇతరులను క్షమించటానికి కూడా కొన్ని కాలపరిమితులు నిర్ణయించుకోండి.

పుష్టిని ఇచ్చే 'పులగం'

కట్టు పొంగలి చాలా మందికి ఇష్టమైన వంటకం. దీన్నే మన వాళ్లు పులగం అని కూడా పిలుస్తారు. ఈ పులగం వెనక చాలా కథే ఉంది.

కట్టు పొంగలి అంటే కారపు పాయసం అని అర్థం. వాస్తవానికి 'పుల' అనే తెలుగు పదానికి బంగారం అని అర్థం. బంగారపు రంగులో ఉంటుంది కాబట్టి ఈ పొంగల్‌ను పులగం అని కూడా పిలుస్తారు. ఇక పులగాన్ని సంస్కృతంలో కృశరా అంటారు. దీని అర్థం కూడా బంగారపు రంగులో ఉండేదనే! శుభకార్యాలు.. దైవ కార్యాలలో దీనిని వండి నైవేద్యంగా పెట్టి ప్రసాదం పంచుతారు. 'అనంగత్రయోదశి వ్రతం' లాంటి సందర్భాల్లో పులగాన్నే నైవేద్యంగా పెడతారు. నందికేశుడి నోములోనూ, నవరాత్రుల్లోనూ పులగం తప్పనిసరిగా ఉంటుంది. మనుస్మృతి... బియ్యం, నువ్వులు, పెసరపప్పు కలిపి పాలు పోసి పులగం వండుతారని



పేర్కొంది. ఇక పులగం తయారీలో కూడా పరిణామ క్రమం ఉంది. దక్షిణాదిలో అల్లం, ఇంగువ, మిరియాలు జీలకర్ర, కరివేపాకు, జీడిపప్పు తాలింపు పెట్టే ఆచారం మొదలైతే.. ఉత్తరాదిలో రకరకాల కూరగాయల ముక్కలు ఉడికించి కలిపి కృశరాన్నాన్ని కిచిడీగా మార్పు చేసుకున్నారు. కృశరా లేదా పులగం గురించి యోగరత్నాకరం, భోజన కుతూహలం, క్షేమకుతూహలం లాంటి పాకశాస్త్ర గ్రంథాలు పులగాన్ని ఎలా చేసుకోవాలో వివరంగా ఇచ్చాయి. క్షేమశర్మ క్షేమకుతూహలంలో పులగం తయారీ గురించి ఇలా పేర్కొన్నాడు.

"తండులైః షష్టి సంఖ్యాకైః కండితైర్నవ ఖండితైః.. అష్టభాగవృతైర్ముద్గై సంయుక్తై ద్వార్ధ శాంశక్తైః"

12 భాగాల బియ్యానికి 8 భాగాల పెసరపప్పు తీసుకోవాలి. బియ్యాన్ని నీళ్లలో కాసేపు నాననిచ్చి .. బాగా కడిగి ఇత్తడి గిన్నెలో గానీ కుండలోగానీ తీసుకుని తగినన్ని నీళ్లు పోసి పొయ్యి మీద పెట్టి అత్తెసరు అన్నం వండాలి.

"స్వార్ద్రానార్ద్రా సుసంధానా సబాహ్లీకా వరాన్వితా! సస్నేహా కామినీవేయం కృశరా శిశిరే హితా!"

పెసరపప్పు, బియ్యం కలిపిన అన్నం ఉడుకుతుండగా, బాగా కండపట్టిన పచ్చి అల్లాన్ని చిన్ని ముక్కలుగా తరిగి కలపాలి. పసుపు, ఇంగువ, సైంధవలవణం, నెయ్యివేసి సన్నసెగన ఉడకనివ్వాలి. పొయ్యి మీంచి దింపబోయే ముందు, మిరియం, జీలకర్రల్ని పైపైన దంచి, కరివేపాకు చేర్చి వేగనిచ్చి నేతితాలింపు పెడితే కమ్మగా ఉంటుంది. ఇలా చేస్తే చలికాలంలో ప్రియురాలులా సుఖాన్నిస్తుందీ పులగం.

"కృశరా దుర్జరా బల్యా గుర్వీ వాతవినాశినీ! బలపుష్టిమలశ్లేష్మపిత్తవిష్టంభకృత్సరా!"

వండిన పెసరముద్దపప్పుని అన్నంలో కలుపుకోవటానికి.. బియ్యమూ పెసరపప్పు కలిపి వండినదానికి తేడా ఏమిటనే ప్రశ్న తప్పక వస్తుంది. పప్పు అన్నంలో పెసరపప్పు గుణాలు మాత్రమే ఉన్నాయి. దాన్ని పులగంగా వండితే అది బంగారం లాంటి ఆహారపదార్థం అవుతుంది. ఇది ఆకలిని తీరుస్తుంది. ఉదయమే తింటే మధ్యాహ్నం దాకా దండిగా ఉంటుంది. ఇది బరువైన ఆహారం. మంచి నెయ్యితో వండుకుంటే తేలికగా అరుగుతుంది. మిరియాలు జీలకర్ర, సైంధవలవణం తేలికగా అరిగించేందుకు సాయపడతాయి. భయంకర వాత వ్యాధులున్నవారికి ఇది మంచి ఔషధంగా ఉపయోగపడుతుంది. చర్మం గరుకుబారి ముడతలు పడి ముసలితనం ముంచుకొచ్చినట్టు కావటాన్ని ఇది అరికడుతుంది. కూరగాయల్లేని వంటకం కాబట్టి ఇందులో ఫైబర్ తక్కువ కాబట్టి విరేచనం కావటానికి ఇది సహకరించకపోయినప్పటికీ, పేగుల్ని మృదువు పరుస్తుంది. జీర్ణశక్తికి కావలసిన స్రావాలు పేగుల్లోకి విడుదల అయ్యేలా చేస్తుంది.

• గంగరాజు అరుణాదేవి

వంటిల్లు



కొన్ని ప్రాంతాల్లో కొన్ని వంటలు ప్రసిద్ధి. ఆ తర్వాతి కాలంలో అవి ప్రపంచమంతా విస్తరించినా... అసలు పేర్లు మాత్రం చెరిగిపోవు. అలాంటి కొన్ని వంటలే ఇవి.



ఎక్కడైనా అదే రుచి

ఒకప్పుడు అవిభాజ్య భారత దేశంలోని పంజాబ్, సింధ్ ప్రాంతాల్లో దీనిని అతిథుల కోసం ఎక్కువగా చేసేవారు. దీనిలో వాడే పదార్థాలు అన్నీ మనకు ఆరోగ్యాన్ని ఇచ్చేవే! దీనిని ఇప్పటికీ చలికాలంలో ఎక్కువగా వండుతూ ఉంటారు.



బీబీ దా పులావ్

కావాల్సిన పదార్థాలు:
చికెన్ ముక్కలు- ఒక కేజీ, బాసుమతి బియ్యం- 500 గ్రాములు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- 300 గ్రాములు, నెయ్యి- ఒక కప్పు, ఏలకులు-5, దాల్చిన చెక్క- ఒక అంగుళం, లవంగాలు-5, బిర్యానీ ఆకులు-5, ఎర్రకారం- రెండు చెంచాలు, పచ్చకారం- రెండు చెంచాలు, పెరుగు- పావు కేజీ, పచ్చిమిర్చి- 10, అల్లం వెల్లుల్లి పేస్ట్- 4 చెంచాలు, క్రీమ్- మూడు చెంచాలు, రోజ్ వాటర్- ఒక చెంచా, నీళ్లు- తగినన్ని.

తయారీ విధానం:
- బాసుమతి బియ్యాన్ని అరగంట నాననివ్వాలి.
- ఈ లోపులో ఒక మూకుడు పెట్టి కొద్దిగా నెయ్యి వేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలను దోరగా వేయించుకోవాలి. తరువాత ఒక ప్లేటులో వేసి, చల్లారనివ్వాలి. ఇందులో సగం ముక్కలను పులావ్‌లో కలపటానికి పక్కన పెట్టుకోవాలి. మిగిలిన వాటిని మిక్సీలో వేసుకొని పేస్టులా చేసుకోవాలి.
- ఉల్లిపాయలను వేయించిన మూకుడులో ఇంకొంత నెయ్యి వేసి ఉల్లిపాయల పేస్ట్, అల్లం వెల్లుల్లి పేస్ట్‌లను వేయించాలి. వాటిలోనే దాల్చిన చెక్క, లవంగాలు, ఏలకులు, బిర్యానీ ఆకులు వేసి వేయించాలి. ఆ తర్వాత దానిలో చికెన్ ముక్కలు వేయాలి. ఈ మిశ్రమంలో ఎర్రకారం, పచ్చకారం, పెరుగు, తగినంత ఉప్పు వేయాలి. పైన మూత పెట్టి ఉడకనివ్వాలి.
- ఈ లోపులో ఒక గిన్నెలో తగినన్ని నీళ్లు పోసి బాసుమతి బియ్యాన్ని ఉడికించాలి. బియ్యం ఉడికిన తర్వాత వార్చి నీళ్లు తీసేయాలి.
- ఇంకొక పెద్ద మూకుడు తీసుకొని దానిలో చికెన్ మిశ్రమాన్ని, మిరపకాయ ముక్కలను వేయాలి. దానిపై ఉడికిన బాసుమతి బియ్యాన్ని ఒక పొరగా కప్పాలి. దానిపై రోజ్‌వాటర్, మిగిలిన నెయ్యి, క్రీమ్‌లు వేసి సన్నని సెగపై ఐదు నిమిషాలు ఉడికించాలి. తరువాత వేయించిన ఉల్లిపాయ ముక్కలు వేయాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:
- బాసుమతి బియ్యంతో వండిన అన్నం పొడిగా ఉండాలి. ముద్దగా ఉండకూడదు.
- క్రీమ్ వేసిన ఐదు నిమిషాలలో పులావ్‌ను స్టౌ మీద నుంచి దింపేయాలి.

సింధి కఢి

సింధి వంటలు చాలా రుచికరంగా ఉంటాయి. అంతే కాకుండా వీటిల్లో వాడే కూరలు, పదార్థాలు మనను ఆరోగ్యంగా కూడా ఉంచుతాయి. అలాంటి ఒక సింధి కూరను ఎలా చేయాలో తెలుసుకుందాం.

కావాల్సిన పదార్థాలు
టమాటోలు - ఆరు, బెండకాయలు- ఆరు, బీన్స్- పది, ములక్కాడలు- రెండు, అల్లం- ఒక అంగుళం, కరివేపాకు- తగినంత, పచ్చి మిరపకాయలు- రెండు, శనగపిండి- ఆరు చెంచాలు, పసుపు- ఒక చెంచా, ఎర్ర కారం- రెండు చెంచాలు, ఇంగువ- తగినంత, ఆవాలు- ఒక చెంచా, జీలకర్ర- ఒక చెంచా, మెంతులు- ఒక చెంచా, నెయ్యి- ఆరు చెంచాలు, నీళ్లు- ఒక కప్పు, ఉప్పు- తగినంత, తరిగిన కొత్తిమీర- తగినంత

తయారీ విధానం
- ముందుగా టమాటోలను మిక్సీలో వేసి ముద్దగా చేసుకోవాలి. కూరలను, పచ్చి మిరపకాయలను పొడవుగా ముక్కలుగా తరగాలి.
- ఒక మూకుడును స్టౌ మీద పెట్టి నెయ్యిని వేడి చేయాలి. దీనిలో ముందు ఆవాలు, ఆ తర్వాత జీలకర్ర, చివరగా మెంతులు, ఇంగువ వేయాలి. దానిలో శనగపిండిని వేసి దోరగా వేయించాలి. ఆ తర్వాత పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు, అల్లం ముక్కలను వేసి వేయించాలి.
- దీనిలో కారం, పసుపు వేయాలి. ఆ తర్వాత టమోటో ముద్దను వేసి సన్నని సెగపై ఉడకనివ్వాలి. ఆ తర్వాత కూర ముక్కలన్నింటినీ వేసి నీళ్లు పోసి కలపాలి. మూకుడుపై మూత పెట్టి పదిహేను నిమిషాలు మగ్గనివ్వాలి.
- స్టౌ మీద నుంచి దింపి, తగినంత ఉప్పు వేసి, తరిగిన కొత్తిమీరను కూరపైన చల్లాలి.



తీసుకోవాల్సిన జాగ్రత్తలు:
- శనగపిండి వేసిన తర్వాత సన్నని సెగపైన వేయించాలి. లేకపోతే శనగపిండి మాడు వాసన వస్తుంది.
- ఇంగువను కొద్దిగా వేసుకోవాలి. లేకపోతే ఘాటు ఎక్కువ అయిపోతుంది.

చంపారన్ మటన్

బిహార్‌లోని చంపారన్ జిల్లాలో పెళ్లిళ్లకు.. పండగలకు.. అందరూ కలిసి వండుకొనే వంటకమిది. ఒకప్పుడు చంపారన్‌కు మాత్రమే పరిమితమయిన ఈ వంటకం- ప్రస్తుతం దేశవ్యాప్తంగా హాట్ ఫేవరెట్‌గా మారింది. భిన్నమైన రుచితో ఉండే ఈ మటన్ కర్రీని కట్టెలు లేదా బొగ్గుల పొయ్యి మీద నెమ్మదిగా వండుతారు. అందరి ఇళ్లలోను కట్టెల పొయ్యిలు ఉండవు కాబట్టి సాధారణ గ్యాస్ స్టౌవ్‌పై తక్కువ మంట మీద దీనిని వండుకోవచ్చు.

కావాల్సిన పదార్థాలు
మటన్- ఒక కేజీ , ఉల్లిపాయ ముక్కలు- 750 గ్రాములు, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఆరు టేబుల్ స్పూన్లు, పసుపు- ఒక టేబుల్ స్పూను, ధనియాల పొడి- ఒక టేబుల్ స్పూను, ఎర్ర కారం- ఒక టేబుల్ స్పూను, పెరుగు- 150 గ్రాములు, ఆవ నూనె- ఒక చిన్న కప్పు, ఉప్పు- తగినంత, తరిగిన కొత్తిమీర- తగినంత, గోధుమ పిండి- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం
- ఒక గిన్నెలో పెరుగు తీసుకొని దానిలో పసుపు, ధనియాల పొడి, ఎర్రకారం కలపాలి. ఈ మిశ్రమంలో మటన్ ముక్కలను వేసి 8 నుంచి 12 గంటలు నానబెట్టాలి.
- మూతి చిన్నదిగా ఉన్న ఒక దళసరి గిన్నెను తీసుకొని దానిలో ఆవ నూనెను వేసి వేడిచేయాలి. ఈ ఆవనూనెలో ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్‌లను వేసి దోరగా వేయించాలి.
- దీనిలో నానబెట్టిన మటన్ ముక్కలను వేయాలి. ఆ తర్వాత గిన్నెపై మూత పెట్టాలి.
- గోధుమపిండిలో నీళ్లు పోసి ముద్దగా చేయాలి. గిన్నెపై మూతను ఈ ముద్దతో సీల్ చేయాలి. ఒక గంట సేపు సన్నని సెగపై ఉడకనివ్వాలి. ఆ తర్వాత గోధుమ పిండి సీల్‌ను తీసేయాలి.
- ఇలా ఉడికిన కూరలో ఉప్పు, కొత్తిమీర వేయాలి. దీనిని రోటీలలో కానీ.. అన్నంలో కానీ కలుపుకొని తినవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:
- మటన్‌ను ఎంత సేపు పెరుగులో నానబెడితే అంత మంచి రుచి వస్తుంది
- మటన్ ముక్కలు వేసిన తర్వాత నీళ్లు పోయకూడదు. మటన్‌లో ఉండే జ్యూస్ కూరను ఉడికేలా చేస్తుంది.

మేకప్

స్కిన్ టోన్‌కు సూటయ్యేలా...

మేకప్ కోసం ఖరీదైన విదేశీ ఉత్పత్తులకు బదులుగా దేశీ ఉత్పత్తులను ఎంచుకుంటే, స్కిన్ టోన్‌కు మ్యాచ్ అయ్యేలా మేకప్ వేసుకోవడంతో పాటు, తక్కువ ఖర్చుతో మెరిసిపోవచ్చు. అదెలాగో చూద్దాం!

మన దేశ వాతావరణం, దానికి స్పందించే చర్మం తత్వం ఆధారంగా మేకప్ ఉత్పత్తులను ఎంచుకోవాలి. మన చర్మంలో మెలనిన్ ఎక్కువగా ఉత్పత్తి అవుతూ ఉంటుంది. కాబట్టి పిగ్మెంటేషన్, కళ్ల కింద నల్లని వలయాలు, చర్మం జీవం కోల్పోవడం లాంటి లక్షణాలు సహజం. కాబట్టి వీటిని చర్మంలో కలిసిపోయేలా చేసే మేకప్ ప్రొడక్ట్స్ ఎంచుకోవాలి.

కన్‌సీల్, కరెక్ట్, రిపీట్

పిగ్మెంటేషన్, డల్‌నెస్ పోగొట్టడం కోసం కలర్ కరెక్టర్, కన్‌సీలర్ ఎంచుకోవాలి. క్రీమ్ రూపంలో ఉండే కలర్ కరెక్టర్ తేలికగా బ్లెండ్ అవుతుంది. లిక్విడ్ కరెక్టర్లు త్వరగా సెట్ అయిపోతాయి కాబట్టి వాటిని దూరం పెట్టడమే మేలు. పిగ్మెంటేషన్ కోసం ఆరెంజ్ కలర్ కరెక్టర్, ముదురు చర్మ రంగు ఉన్నవాళ్లు పీచ్ మొదలు మరింత శాచురేటెడ్ రంగులను ఎంచుకోవాలి.

బ్లష్ ఇలా...

చర్మ రంగుతో మ్యాచ్ అయ్యే బ్లష్‌లనే ఎంచుకోవాలి. తెలుపు, చామనచాయ రంగులో ఉండేవాళ్లు డస్టీ రోజ్ బ్లష్ ఎంచుకోవాలి. ముదురు చర్మపు రంగు కలిగిన వాళ్లు, డార్కిష్ కోరల్ బ్లష్ ఎంచుకోవాలి. క్రీమ్ బ్లష్‌లను నేరుగా వేలితో అప్లై చేసుకోవడమే ఉత్తమం. పౌడర్ బ్లష్‌లను బ్రష్‌తోనే అప్లై చేసుకోవాలి.

న్యూడ్స్ ఇలా...

న్యూడ్ లిప్ కలర్స్‌లో ఒకరికి నప్పినవి ఇంకొకరికి నప్పకపోవచ్చు. కాబట్టి చర్మపు రంగు ఆధారంగా లిప్ కలర్ ఎంచుకోవాలి. పెదవులు ఏ రంగులో ఉన్నాయో, ఆ రంగుకు దగ్గరగా ఉండే లిప్ కలర్‌ను ఎంచుకుంటే సహజసిద్ధంగా ఉంటుంది. భారతీయులు పిగ్మెంటెడ్ పెదవులు కలిగి ఉంటారు. కాబట్టి లిప్ పెన్సిల్‌తో పెదవులకు రంగును నింపేసి, పైన లిప్ కలర్ అప్లై చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల మన పెదవుల అసలు రంగు, లిప్ కలర్‌లో నుంచి బయటకు బహిర్గతం కాకుండా ఉంటుంది. అయితే న్యూడ్ లిప్‌స్టిక్ కలర్ కంటే కాస్త ముదురు రంగు లిప్ పెన్సిల్ వాడుకోవాలి. లేదంటే చర్మపు రంగుతో కలిసిపోయి, సాదాసీదాగా కనిపించే ప్రమాదం ఉంటుంది.



ఫిల్టర్ కాఫీ రుచి మన సొంతం..!

ఆసియాలో మొట్టమొదటి ప్రొఫెషనల్ కాఫీ టేస్టర్ గా మాత్రమే కాదు, దేశ విదేశాలలో కాఫీ టేస్టర్‌గా ఎన్నో అవార్డులనూ గెలుచుకున్నారామె. కాఫీతో దాదాపు 50 ఏళ్ల తన ప్రయాణంలో ఇక కాఫీ వద్దు అనే క్షణం రాలేదంటున్న ఆమె, **సునాలినీ మీనన్**. కాఫీ తనకెంతో ఇచ్చిందనీ చెబుతున్న సునాలినీ తన ప్రయాణం ఒడిదుడుకులతోనే సాగినా విజయవంతంగానే కొనసాగుతుందంటున్నారు. కాఫీ బోర్డ్ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ కాఫీ టేస్టర్‌గా జీవితాన్ని ప్రారంభించి ఇప్పుడు కాఫీ ల్యాబ్ తో రైతులకు, వ్యాపారులకు అవసరమైన సేవలనందిస్తూనే చక్కటి,చిక్కటి కాఫీలు మనకు చేరడంలో సహాయపడుతున్నారు. కాఫీ టేస్టింగ్ అంటే రుచి చూసి, బాగుందా లేదా అని చెప్పడం మాత్రమే కాదని, వాసన, బీన్ రూపు, కాఫీ బీన్స్‌లో ఎసిడిటీ ఇలా ఎన్నో అంశాలను చూడాల్సి ఉంటుందన్న ఆమె నగరంలో జరుగుతున్న మొట్టమొదటి ఇండియన్ కాఫీ ఫెస్టివల్‌లో పాల్గొనడానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతితో చిట్ చాట్ చేశారు. ఆ విశేషాలు...



ఇండియాలోనే మొట్టమొదటి కాఫీ ఫెస్టివల్ ఇది. ఈ ఫెస్ట్ బృందంలో ఒకరైన విద్య నాకు ఎప్పటి నుంచో తెలుసు. ఆమె ఉమెన్స్ కాఫీ అలయన్స్‌లో సభ్యురాలు. ఆమె ఈ ఫెస్ట్ గురించి చెప్పగానే నో అని నేను చెప్పలేకపోయాను. ఎందుకంటే కాఫీ నా వీక్‌నెస్. కాఫీ ఫెస్టివల్ అనగానే ఏదో చిన్నగా ఉంటుందనుకున్నాను. కానీ , ఇక్కడ ఇంత పెద్దగా దీనిని నిర్వహిస్తుండటం చూసి ఆశ్చర్య పోయాను.

హైదరాబాద్‌తో అనుబంధం...

హైదరాబాద్‌తో నా అనుబంధం అని అంటే.. ప్రత్యేకంగా ఈ నగరంతో కాదు కానీ, ఆంధ్రాతో నాకు ప్రత్యేక అనుబంధమే ఉంది. మరీ ముఖ్యంగా అరకుతో ! హైదరాబాద్‌కు 2010-12 కాలంలో తరచుగా వచ్చేదానిని. అప్పట్లో నాంది ఫౌండేషన్‌తో కలిసి తిరిగాను. అరకులో ఎన్నో అద్భుతాలను చూశాను. అక్కడ గిరిజన మహిళలతో అనుబంధం ఎప్పటికీ మరిచిపోలేను. హైదరాబాద్‌కు రావడం అంటే మరలా నా ఇంటికి నేను తిరిగి వచ్చినట్లుగా అనిపిస్తుంది. ఎందుకంటే, నేను పుట్టింది అప్పటి ఆంధ్రప్రదేశ్‌లోనే ! కానీ , చిన్నతనంలోనే వదిలి చెన్నై, ఆ తరువాత బెంగళూరు వెళ్లిపోవడంతో తెలుగు మరిచిపోయాను. ఆ భాష వింటుంటే చిన్నతనపు రోజులు గుర్తుకొచ్చాయి. ఆంధ్రాలో కనిపించిన ఆత్మీయత నన్ను బాగా కదిలించింది.



మంచి కాఫీని గుర్తించడం ఎలా..

అసలు మంచి కాఫీ అంటే ఏమిటి ?ఒక్కొక్కరి అభిరుచి ఒక్కోలా ఉంటుంది. మీ మనసుకు ఏది నచ్చితే అదే మంచి కాఫీ అని నేనంటాను. ఒకరికి స్వీటు తినాలని ఉంటుంది. కానీ వారికి మురుకులు పెడితే నచ్చదు. అలాగే జిలేబీ తినాలనుకునే వారికి గులాబ్ జామ్ పెడితే నచ్చదు. ఎవరి అభిరుచి వారిది. కాఫీ కూడా అంతే! ఒకరికి ఫిల్టర్ కాఫీ నచ్చితే మరొకరికి రోస్టెడ్ కాఫీ నచ్చవచ్చు. మంచి కాఫీ అనేది వారి వ్యక్తిగత ఎంపిక. కొంతమంది స్ట్రాంగ్ కాఫీ కోరుకుంటారు. మరికొంత మంది ఇన్నోవేట్‌గా ఉండాలనుకుంటారు.

తాగు విధానం కూడా...

కాఫీ పట్ల మన అలవాటుకు మనం చిన్నతనం నుంచి ఇంటిలో కాఫీ తాగిన విధానం కూడా ఓ కారణం అవుతుంది. ఫిల్టర్ కాఫీ తాగేవాళ్లు దానినే ఇష్టపడతారు. డబ్బా కాఫీ తాగేవాళ్లు కూడా అలాగే ! మీకు మంచిదనిపించింది మరొకరికి నచ్చకపోవచ్చు. ఇది పూర్తిగా వ్యక్తిగత ఎంపిక.

దక్షిణాది వారు ఫిల్టర్ కాఫీని ఎక్కువగా ఇష్టపడుతుంటారు. ఏమిటి దానిలో స్పెషాలిటీ అని అంటే, ముందుగా చెప్పినట్లు అది వ్యక్తిగత ప్రాధాన్యత ఆధారంగానే ఉంటుంది. మన దేశంలో ఫిల్టర్ కాఫీ ఇష్టపడటానికి దానిని మనవారు కనుగొనడం కూడా ఓ కారణం కావొచ్చు. మీరు ఇటలీ వెళ్తే ఎస్‌ప్రెసో ఇష్టపడతారు. దానితోనే వారు ఎదిగారు. దక్షిణాది వారికి ఫిల్టర్ కాఫీ అంతే ! నాకు స్వతహాగా ఫిల్టర్‌కాఫీనే ఇష్టం. ఈ రోజు నేను తాగింది కూడా అదే! ఎందుకంటే, దక్షిణాది వాసిగా నాకు అదే నచ్చుతుంది. టేస్ట్ ప్రిఫరెన్స్ కావొచ్చు. అలాగని ఎస్‌ప్రెసో కాఫీ బాగోదు. కాపిచినో.. అద్భుతం అని చెప్పలేను.

నా ప్రయాణం గురించి చెప్పాలంటే...

నా 19 ఏళ్ల వయసులో కాఫీ టేస్టర్‌గా కాఫీ బోర్డ్ ఆఫ్ ఇండియాలో ప్రయాణం యాధృచ్ఛికంగా మొదలైంది. అదీ అసిస్టెంట్‌గా! నా 28 ఏళ్ల వయసులో హెడ్ ఆఫ్ క్వాలిటీ గా ఎంపికయ్యాను. దాదాపు 50 ఏళ్లకు పైగా నా కాఫీ ప్రయాణం సాగింది. నా ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. మా బాస్ అప్పట్లో ఒకటే చెప్పారు.. ఓపిగ్గా ఉండు... సబ్జెక్ట్ పట్ల పూర్తి అవగాహన పెంచుకో... అనుకున్న దానికి కట్టుబడి ఉండు.. అని. అదే ఇప్పటికీ పాటిస్తున్నాను. నా ప్రయాణం కష్టతరమైనదే కానీ విజయవంతమైనది. కాఫీ టేస్టర్‌గా నాకు అన్నీ తెలుసని మాత్రం ఇప్పటి వరకూ అనుకోలేదు. ఇప్పటికీ ఇంకా నేర్చుకుంటూనే ఉన్నాను.

• గిరి

నిమ్స్‌లో సర్టిఫికెట్ కోర్సు

హైదరాబాద్-పంజాగుట్టలోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)- నెఫ్రాలజీ విభాగంలో నిర్వహిస్తున్న 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్ ప్రోగ్రామ్'లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఫుల్ టైం ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఎస్సీ(నర్సింగ్/సైకాలజీ/లైఫ్ సైన్సెస్/డయాలసిస్ టెక్నాలజీ)/ఎంబీబీఎస్/ఎండీ-హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 20 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్ల వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

ఎంట్రెన్స్ టెస్ట్: పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో బేసిక్ కాన్సెప్ట్స్, అడ్వాన్స్‌డ్ మిసిలేనియస్ టాపిక్స్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్, లివర్ ట్రాన్స్‌ప్లాంట్, హార్ట్ అండ్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ అంశాల నుంచి ఒక్కోదానిలో పది మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 50. పరీక్ష సమయం గంట. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **వెబ్‌సైట్:** www.nims.edu.in

మౌలానా ఆజాద్ వర్సిటీలో స్పాట్ అడ్మిషన్స్

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ- సెంట్రల్ యూనివర్సిటీ)- పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో సీట్లు ఉన్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా అడ్మిషన్ పోర్టల్‌లో అప్లయ్ చేసుకోవాలి. తరవాత హైదరాబాద్ క్యాంపస్‌లోని సంబంధిత డిపార్ట్‌మెంట్‌లో రిపోర్ట్ చేయాలి. ఇప్పటికే దరఖాస్తు చేసుకొని సీటు పొందలేని అభ్యర్థులు మరల అప్లయ్ చేయనవసరం లేదు.

ప్రోగ్రామ్‌లు-సీట్లు

- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఉర్దూ - 27
- సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ ఇన్ టర్కిష్ - 10
- సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ ఇన్ అరబిక్ - 12
- సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ ఇన్ ఫ్రెంచ్ - 18
- సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ ఇన్ రష్యన్ - 26
- సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ ఇన్ తెలుగు - 15
- డిప్లొమా ఇన్ ఫ్రెంచ్ - 27
- డిప్లొమా ఇన్ అరబిక్ - 16
- డిప్లొమా ఇన్ పాష్తో - 26
- పీజీ డిప్లొమా ఇన్ ప్రొఫెషనల్ అరబిక్ - 18
- పీజీ డిప్లొమా ఇన్ ఫంక్షనల్ హిందీ- 17
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **వెబ్‌సైట్:** www.manuu.edu.in

దిక్సూచి DIKSUCHI

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)కి చెందిన మధురై రీజనల్ సెంటర్- డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్(డీఐఎస్ఎల్ ఐ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. ఇంగ్లీష్, హిందీ, తమిళం మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌నకు న్యూఢిల్లీలోని రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) గుర్తింపు ఉంది. అభ్యర్థులకు నెలకు రూ.2,000ల స్టయిపెండ్ ఇస్తారు. దివ్యాంగులకు, దివ్యాంగుల తల్లిదండ్రులకు ఇన్‌స్టిట్యూషనల్ ఫీజు ఉండదు. దివ్యాంగుల తోబుట్టువులకు 75 శాతం ఫీజు రాయితీ లభిస్తుంది. హాస్టల్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.200; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100; దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in

రామానుజం నేషనల్ మేథ్స్ ఛాలెంజ్



ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ స్కిల్ డెవలప్‌మెంట్(ఏఐసీటీఎస్‌డీ)- 'రామానుజం నేషనల్ మేథ్స్ ఛాలెంజ్(ఆర్ఎన్ఎంసీ) 2025'కు దరఖాస్తులు కోరుతోంది. మేథ్స్‌లో నేటి తరం విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకుగాను 'నేషనల్ మేథ్స్ స్కాలర్-2025' కాన్సెప్ట్‌తో ఈ పోటీని నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొనే విద్యార్థులు మేథమెటిక్స్‌కు సంబంధించి ఆన్‌లైన్ ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా నాలుగోతరగతి నుంచి పన్నెండోతరగతి చదివే విద్యార్థులందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మేథమెటిక్స్‌లో ఆసక్తి ఉన్నవారు జాతీయ స్థాయిలో తమ స్కిల్స్ ప్రదర్శించేందుకు ఇది సదవకాశం.

ఆన్‌లైన్ ఎగ్జామ్ వివరాలు: అభ్యర్థులు ఇంటి వద్దనే ఆన్‌లైన్ ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది. పరీక్ష సమయం 45 నిమిషాలు. ఇందులో 30 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున మొత్తం మార్కులు 60. రుణాత్మక మార్కులు ఉన్నాయి. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ఎగ్జామ్ తేదీ, టైం స్లాట్, ఆన్‌లైన్ ఎగ్జామ్ లింక్ తదితరాలను విద్యార్థుల మొబైల్‌కు ఎస్ఎంఎస్ ద్వారా పంపుతారు.

- నాలుగు నుంచి పన్నెండు వరకు ప్రతి తరగతికీ నిర్దేశించిన ఎగ్జామ్ సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

రివార్డులు: పరీక్షలో ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. వీరిలో ముగ్గురిని విజేతలుగా ప్రకటిస్తారు. మొదటి బహుమతి కింద రూ.75,000; ద్వితీయ బహుమతి కింద రూ.50,000; తృతీయ బహుమతి కింద రూ.25,000; రన్నరప్‌లుగా నిలిచిన 50 మందికి ఒక్కొక్కరికి రూ.2000; అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 100 మందికి ఒక్కొక్కరికి రూ.500ల నగదు ఇస్తారు. విజేతలందరికీ జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న ఏఐసీటీ ఎస్‌డీ సర్టిఫికెట్, నేషనల్ మేథ్ స్కాలర్ ట్రోఫీ అందిస్తారు. సంస్థ అంతర్జాతీయంగా నిర్వహించే వివిధ ప్రాజెక్టులు, టెక్నికల్ ఈవెంట్లు సహా పలు సెమినార్లలో నేరుగా పాల్గొనే అవకాశం కల్పిస్తారు. నేషనల్ మేథమెటిక్స్ సైంటిస్ట్ స్కాలర్‌షిప్ కూడా లభిస్తుంది. రోబోటిక్స్ ఆటొమేషన్ అండ్ కోడింగ్‌లో ట్రెయినింగ్ ఇస్తారు. ప్రథమ బహుమతి విజేతకు ఏడాది, ద్వితీయ బహుమతి పొందినవారికి ఆరు నెలలు, తృతీయ బహుమతి సాధించినవారికి మూడు నెలలు శిక్షణ ఇస్తారు. పోటీలో పాల్గొన్నవారందరికీ సంస్థ పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌లు ఇస్తుంది.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.270
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 30
- **ఆన్‌లైన్ ఎగ్జామ్ తేదీ:** డిసెంబరు 10
- **ఫలితాలు విడుదల:** డిసెంబరు 20
- **ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు:** డిసెంబరు 30
- **విజేతల లిస్ట్ విడుదల:** 2025 జనవరి 15
- **వెబ్‌సైట్:** aictsd.com

నవ్య | చిత్రజ్యోతి

సందడంతా సెట్స్‌పైనే

ఈ నెలలో ఎన్టీఆర్ 'దేవర' మినహా పెద్ద హీరోల చిత్రాలేవి విడుదల లేకపోవడంతో థియేటర్లలో సందడి తగ్గనుంది. అయితే ఆ సందడి కాస్తా ఇప్పుడు సెట్స్‌లో మొదలైంది. హీరోలంతా కొత్త సినిమాల షూటింగ్స్‌తో బిజీగా ఉన్నారు. యువ కథానాయికలు సెట్స్‌లో చెమటోడ్చుతున్నారు. సీనియర్ హీరోలు షూటింగ్స్‌కు సై అంటున్నారు. వీరిలో కొందరు హీరోయిన్లతో డ్యూయెట్లు పాడుతుండగా మరికొందరు విలన్లతో పోరాడుతున్నారు. మొత్తం మీద వరుస చిత్రీకరణలతో తెలుగు కథానాయకులు జోరు మీదున్నారు.



యాక్షన్ మోడ్‌లో వెంకీ

అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం షూటింగ్ శరవేగంగా సాగుతోంది. పది రోజుల క్రితమే పొల్లాచ్చిలో హీరోయిన్ మీనాక్షి చౌదరితో డ్యూయెట్ పాడుకున్నారు వెంకటేశ్. అక్కడి నుంచి హైదరాబాద్ చేరుకున్నారో లేదో వెంటనే యాక్షన్ సీక్వెన్స్ కోసం రంగంలోకి దిగారు. ఈ చిత్రం తాజా షెడ్యూల్ రెండు రోజుల క్రితమే హైదరాబాద్‌లో మొదలైంది. ఇందులో ఆయన పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఈ 15 రోజుల షెడ్యూల్‌లో యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు ఇతర తారాగణంపై కీలక ఘట్టాలను తెరకెక్కించనున్నారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



కూలీ సెట్స్‌లో నాగ్

మల్టీస్టారర్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు నాగార్జున. రజనీకాంత్ కథానాయకుడిగా రూపొందుతున్న 'కూలీ' షూటింగ్ ప్రస్తుతం వైజాగ్‌లో జరుగుతోంది. నాగార్జున్ సెట్స్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఆయనపై యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు కొంత టాకీపార్ట్‌ను ఈ షెడ్యూల్‌లో తెరకెక్కించనున్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రుతీహాసన్ కీలక పాత్ర పోషిస్తున్నారు.



క్లైమాక్స్‌కు మట్కా

కరుణకుమార్ దర్శకత్వంలో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందుతున్న 'మట్కా' చిత్రం షూటింగ్ క్లైమాక్స్‌కు చేరుకుంది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్టూడియోలో పతాక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. ఈ పీరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో మాఫియా నాయకుడి పాత్రలో వరుణ్ తేజ్ సరికొత్త మేకోవర్‌తో అలరించనున్నారు. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు.



రాజాసాబ్ పోరాటం

మారుతి దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న 'రాజా సాబ్' చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ సాగుతోంది. ప్రభాస్‌తో పాటు ప్రధాన తారాగణం అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటోంది. కొంత టాకీ పార్ట్‌ను పూర్తి చేసిన మారుతి తాజాగా పోరాట ఘట్టాలపై దృష్టి పెట్టారు. రామ్-లక్ష్మణ్ నేతృత్వంలో సాగే ఈ భారీ యాక్షన్ సీక్వెన్స్‌లో ప్రభాస్ పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్ ముగిశాక హనూ రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం షూటింగ్‌లో పాల్గొనేందుకు ప్రభాస్ చెన్నై వెళ్లనున్నారు.

కేరళకు దేవరకొండ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. చిత్రీకరణ చివరి దశలో ఉంది. ఈ వారంలో కేరళలో ఓ భారీ షెడ్యూల్‌ను మొదలుపెట్టేందుకు యూనిట్ సన్నాహాలు చేసింది. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో విజయ్ పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. అలాగే 'పుష్ప 2' క్లైమాక్స్ షూట్‌ను ముగించే పనిలో అల్లు అర్జున్ బిజీగా ఉన్నారు.

చందు మొండేటి, నాగచైతన్య కలయికలో రూపొందుతున్న చిత్రం 'తండేల్'. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోందని యూనిట్ తెలిపింది. టాకీపార్ట్‌తో పాటు పాటలను చిత్రీకరిస్తున్నారు. చైతూకు జోడీగా సాయిపల్లవి కనిపించనున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాస్ నిర్మిస్తున్నారు. నిఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'స్వయంభూ' షూటింగ్ కొనసాగుతోంది. శర్వానంద్ హీరోగా రామ్ అబ్బరాజు తెరకెక్కిస్తున్న చిత్రం ప్రస్తుతం సెట్స్‌పై ఉంది. లుధీర్ బైరెడ్డి రూపొందిస్తున్న చిత్రం షూటింగ్‌లో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పాల్గొంటున్నారు. శుక్రవారం నాని 'హిట్ 3' చిత్రీకరణ మొదలుపెట్టారు. సాయిదుర్గ తేజ్ హీరోగా రోహిత్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఇటీవలే రామ్‌లక్ష్మణ్ నేతృత్వంలో అటవీ నేపథ్యంలో సాగే యాక్షన్ పార్ట్‌ను యూనిట్ పూర్తి చేసింది.

విరామం తర్వాత

పవన్ కల్యాణ్ పాలిటిక్స్‌తో బిజీగా మారడంతో షూటింగ్స్‌కు తాత్కాలిక విరామం ఇచ్చారు. 'హరి హర వీరమల్లు, ఉస్తాద్ భగత్‌సింగ్, ఓజీ' చిత్రాలను ఆయన పూర్తి చేయాల్సి ఉంది. అలాగే మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం సెట్స్‌పైకి వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వస్తున్న చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కావాల్సి ఉంది. 'గేమ్ ఛేంజర్' చిత్రం షూటింగ్‌ను ఇటీవలే పూర్తి చేసిన రామ్‌చరణ్ త్వరలోనే కొత్త సినిమా షూటింగ్‌లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. పీరియాడిక్ చిత్రం కావడంతో ప్రస్తుతం ఆయన సరికొత్త మేకోవర్‌తో సిద్ధమవుతున్నారు. 'దేవర' ప్రచార కార్యక్రమాలను పూర్తి చేసిన ఎన్టీఆర్ ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో తెరకెక్కే చిత్రం కోసం రంగంలోకి దిగనున్నారు. అక్టోబర్ నుంచి షూటింగ్ మొదలుపెట్టనున్నట్లు యూనిట్ తెలిపింది. ఎన్టీఆర్ డిసెంబర్‌లో సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు.

హేమ డ్రగ్స్ తీసుకున్నారు

- మెడికల్ రిపోర్టులో రుజువైంది
- రేవ్‌పార్టీ కేసులో కోర్టుకు వెల్లడించిన పోలీసులు



బెంగళూరు నగరంలోని జీఆర్ ఫామ్‌హౌస్‌లో జరిగిన రేవ్ పార్టీలో తెలుగు నటి హేమ.. అలియాస్ కృష్ణవేణి డ్రగ్స్ తీసుకున్నట్టు పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. విజయవాడకు చెందిన ఎల్ వాసు ఈ ఏడాది మే 19న జీఆర్ ఫామ్‌హౌస్‌లో రేవ్ పార్టీ నిర్వహించారు. ఈ పార్టీలో పాల్గొన్న హేమ.. ఎండీఎంఏ సేవించారని, ఆమె మెడికల్ రిపోర్టులు, సంఘటనా స్థలంలో సేకరించిన ఆధారాలు దాన్ని రుజువు చేస్తున్నాయని పోలీసులు చార్జిషీట్‌లో వెల్లడించారు. ఈ రేవ్ పార్టీకి డ్రగ్స్ సమకూర్చిన వారిలో డెంటిస్ట్ రణధీర్ బాబు కీలకంగా వ్యవహరించారని, అబూబకర్ సిద్ధిఖీ పార్టీకి వచ్చిన వారికి కొకైన్, ఎండీఎంఏ సరఫరా చేశారని పోలీసులు తెలిపారు. ఈ కేసులో సీసీబీ పోలీసులు బెంగళూరు గ్రామీణ పరిధిలోని 8వ జిల్లా అదనపు సెషన్స్ కోర్టులో సోమవారం 1,086 పేజీలతో చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణతోపాటు 82 మంది సాక్షులను విచారించినట్లు అందులో పొందుపరిచారు. అర్ధరాత్రి జరిగిన పార్టీలో ఆంధ్ర, కర్ణాటకకు చెందిన ఫ్యాషన్ డిజైనర్లు, కళాశాల విద్యార్థులు, ప్రైవేట్ కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నట్లు వార్తలు వెలువడ్డాయి. 27 మంది మహిళల సహా 79 మంది డ్రగ్స్ సేవించినట్లు ఫోరెన్సిక్ నివేదికలో తేలింది. ఆ వివరాలను పోలీసులు చార్జ్‌షీట్‌లో పొందుపరిచారు. డ్రగ్స్ తీసుకున్న 79 మందితోపాటు రేవ్‌పార్టీ నిర్వాహకులు 9 మంది కలిపి మొత్తం 88 మందిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కాగా, హేమ మాత్రం తాను డ్రగ్స్ తీసుకోలేదని, పోలీసులు తన బ్లడ్ శాంపిల్స్ కూడా సేకరించలేదని మొదటి నుంచీ చెబుతున్నారు. మీడియా కూడా తనను అనవసరంగా ఈ వివాదంలోకి లాగుతోందని ఆరోపించారు. తాను డ్రగ్స్ తీసుకున్నట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనంటూ పలు ఇంటర్వ్యూల్లో ఆమె చెప్పారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

వేట మొదలైంది



హీరో నాని 32వ సినిమా 'హిట్.. ద థర్డ్ కేస్' రెగ్యులర్ షూటింగ్ శుక్రవారం మొదలైంది. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హిట్ ఆఫీసర్ అర్జున్ సర్కార్‌గా నాని నటిస్తున్నారు. ఈ ఫెరోషియస్ కేరెక్టర్ కోసం నాని పూర్తిగా మేకోవర్ అయ్యారు. తొలి రోజు షూటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. వచ్చే ఏడాది వేసవిలో మే ఒకటిన ఈ సినిమాను విడుదల చేస్తామని నిర్మాత ప్రశాంతి తిపిర్నేని చెప్పారు. ఈ సినిమాకు ఛాయాగ్రహణం: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జే మేయర్, ఎడిటింగ్: కార్తీక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైనర్: నాగేంద్ర తంగాల. లైన్ ప్రొడ్యూసర్: అభిలాష్ మాంధపు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్.వెంకటరత్నం.

బావ.. బావమరిది



తమిళ హీరోలు కార్తీ, అరవింద్ స్వామి నటించిన చిత్రం 'సత్యం.. సుందరం'. ఇంతకుముందు '96' చిత్రాన్ని రూపొందించి ప్రశంసలు అందుకొన్న సి.ప్రేమ్‌కుమార్ ఈ సినిమాకు దర్శకుడు. సూర్య, కార్తీ నిర్మించిన ఈ సినిమాను ఈ నెల 28న ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ తెలుగు ప్రేక్షకులకు అందిస్తోంది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో కార్తీ అమాయకత్వంతో కూడిన రస్టిక్ క్యారెక్టర్ చేస్తే, అరవింద్ స్వామి రిజర్వ్‌డ్, అర్బన్ పర్సనాలిటీగా కనిపించారు. 'బావా.. బావా' అంటూ అరవింద్‌స్వామి వెంటపడుతూ ఆట పట్టించే టిపికల్ పాత్రను కార్తీ పోషించారు. వీరిద్దరూ పాల్గొన్న సన్నివేశాలతో రూపొందించిన టీజర్ అలరించింది. ఈ పాత్రలను దర్శకుడు అద్భుతంగా ప్రజెంట్ చేశారు. శ్రీదివ్య, స్వాతి కొండే, దేవదర్శిని ముఖ్య పాత్రలు పోషించారు మహేంద్రన్ జయరాజ్ ఛాయాగ్రహణాన్ని, గోవింద్ వసంత సంగీతాన్ని అందించారు.

ఈసారి మహారాణి?

విజయ్ సేతుపతి కథానాయకుడిగా నటించిన 'మహారాజ' చిత్రం ఘన విజయంతో అటు పరిశ్రమ, ఇటు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు దర్శకుడు నితిలన్ స్వామినాథన్. ఆయన దర్శకత్వం వహించబోయే కొత్త చిత్రంలో నయనతార లీడ్‌రోల్ పోషిస్తున్నట్లు, ఆ చిత్రానికి 'మహారాణి' అనే టైటిల్‌ను అనుకుంటున్నట్లు కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మహిళా ప్రాధాన్య కథాంశంతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నయనతార పాత్ర కొత్తతరహాలో ఉండబోతోందని కోలీవుడ్ సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. 'మహారాజా' చిత్రాన్ని నిర్మించిన ప్యాషన్ స్టూడియోస్ పతాకంపై సుధన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.





చంద్రబోస్‌కు పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం

పిల్లలను వారి అభిరుచులకు అనుగుణంగా ఆయా రంగాల్లో ప్రోత్సహించి ఉన్నత స్థాయికి చేర్చిన గొప్ప వ్యక్తి పొన్నం సత్తయ్య అని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్యగౌడ్ 14వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం సత్తయ్యగౌడ్ పురస్కారాలను ప్రదానం చేశారు. సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డుగ్రహీత చంద్రబోస్, బలగం ఫేమ్ కొమురమ్మ, మొగులయ్యలకు ఈ పురస్కారాలు ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలకు 51వేల రూపాయల నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పురస్కారగ్రహీతలను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి కథ మరోసారి

తెల్లదొరలకు ముచ్చెమటలు పట్టించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు కథను హీరో కృష్ణ అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించిన సంగతి విదితమే. ఈ వీరుని కథ మరోసారి తీయడానికి ఆర్.వి.వి. సత్యనారాయణ పూనుకున్నారు. అల్లూరి జీవిత చరిత్రలో యథార్థ సంఘటనల్ని ప్రజలకు అందించాలనే సంకల్పంతో 'మన్యం ధీరుడు' పేరుతో రూపొందించిన ఈ సినిమాలో అల్లూరి పాత్రను సత్యనారాయణ పోషించారు. నరేశ్ డెక్కల దర్శకత్వంలో ఈ సినిమా రూపుదిద్దుకుంది. అరకు, పాడేరు, హిమాచల్ ప్రదేశ్, కశ్మీర్‌లో షూటింగ్ చేశారు. భారీ ఖర్చుతో ఒక ఊరినే నిర్మించి అక్కడ కీలక సన్నివేశాలను చిత్రీకరించామనీ, బానిస సంకెళ్లు తెంచుకుని బ్రిటీష్ తెల్లదొరల పాలనకు చరమగీతం పాడే సన్నివేశాలు అద్భుతంగా వచ్చాయనీ నిర్మాత సత్యనారాయణ చెప్పారు. ఈ నెల 20న సినిమాను విడుదల చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



కొత్త..

మనసున్న తల్లి కథ



ఓ మధ్యతరగతి తల్లి చుట్టూ తిరిగే కథతో 'తల్లి మనసు' చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య దర్శకత్వంలో ఆయన తనయుడు కిశోర్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు వి. శ్రీనివాస్ (సిప్పి) దర్శకుడు. 'హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఇప్పటివరకూ జరిగిన షూటింగ్‌లో రెండు పాటలతో సహా 80 శాతం చిత్రం పూర్తయింది. ఇంకో పాట, మిగిలిన టాకీ పార్ట్ చిత్రీకరించడంతో ఈ నెలాఖరుకు షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. మా నాన్న చిత్రాల స్థాయికి తగ్గట్టుగా చక్కటి కథ, కథనాలతో సినిమా తీస్తున్నాం. ఇటువంటి కథాబలం ఉన్న మంచి చిత్రాన్ని తీస్తున్నందుకు సోషల్ మీడియా ద్వారా మంచి స్పందన లభిస్తోంది. అభినందనలు అందుతున్నాయి' అని నిర్మాత తెలిపారు. ఓ మధ్యతరగతి తల్లి పడే తపన, సంఘర్షణను ఇందులో ఆవిష్కరిస్తున్నట్లు దర్శకుడు చెప్పారు. సింగిల్ షెడ్యూల్‌లో చిత్ర నిర్మాణం పూర్తి చేస్తున్నట్లు ముత్యాల సుబ్బయ్య తెలిపారు.

వరద బాధితులకు విరాళం

'జెట్టి' సినిమాతో హీరోగా మంచి పేరు తెచ్చుకున్న నటుడు, '100 డ్రీమ్స్' పేరుతో ఎనిమిదేళ్లుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కృష్ణ మానినేని వరద బాధితుల సహాయం కోసం రూ. పది లక్షల విరాళం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలసి అందజేశారు కృష్ణ. '100 డ్రీమ్స్' ఫౌండేషన్ ద్వారా ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను విని, మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని పవన్‌కల్యాణ్ కోరారు



ధైర్యంగా ముందుకు రండి

నటి రోహిణి



కోలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్ అంశంపై ఫిర్యాదు చేసేందుకు వీలుగా నడిగర్ సంఘం ఆధ్వర్యంలో 2019లో ఏర్పాటు చేసిన విశాఖ కమిటీ ముందు బాధితులు బారులు తీరుతున్నట్లు ఆ కమిటీ అధ్యక్షురాలు, సినీ నటి రోహిణి తెలిపారు. ఈ విషయంపై ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. 'సినిమా అవకాశాల పేరుతో లైంగిక వేధింపులు ఎదుర్కొన్న అనేకమంది యువతులు కూడా ఫిర్యాదులు చేస్తున్నారని, వాటిపై సమగ్రంగా విచారణ జరుపుతున్నామని, ఆ విచారణ తర్వాత తదుపరి చర్యలపై ఆలోచన చేసి, ఓ నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇక లైంగిక వేధింపులపై ఫిర్యాదులు చేసిన వారి వివరాలను బహిర్గతం చేయమని, చిత్రపరిశ్రమలో లైంగిక వేధింపులు ఎదుర్కొన్నవారు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని రోహిణి సూచించారు. ఇదిలా ఉండగా, హీరోయిన్ల గురించి యూట్యూబ్ చానెల్‌లో ఇష్టానుసారంగా, అసభ్యకరంగా మాట్లాడిన డాక్టర్ కాంతరాజ్ అనే వైద్యుడిపై నటి రోహిణి నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

స్పోర్ట్స్

వరంగల్ ● శనివారం 14 సెప్టెంబరు 2024

ఇండియా 'ఎ'కి భారీ ఆధిక్యం

దులీప్ ట్రోఫీ

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (56), ప్రథమ్ సింగ్ (59 బ్యాటింగ్) అర్ధ శతకాలతో సత్తా చాటడంతో ఇండియా 'డి'తో దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో ఇండియా 'ఎ' పైచేయి సాధించింది. శుక్రవారం ఆట ఆఖరికి 'ఎ' జట్టు తమ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 115 పరుగులు చేసి, ఓవరాల్‌గా 222 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. అంతకుముందు ఓవర్‌నైట్ 288/8 స్కోరుతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన 'ఎ' మరో రెండు పరుగులు జోడించి మిగిలిన రెండు వికెట్లు కోల్పోయింది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా 'డి' ప్రత్యర్థి బౌలర్ల ధాటికి 183 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ దేవదత్ పడిక్కళ్ (92), హర్షిత్ రాణా (31) రాణించారు. 107 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ చేపట్టిన ఇండియా 'ఎ'కి ఓపెనర్లు శుభారంభం అందించారు.

సంక్షిప్తస్కోర్లు: ఇండియా 'ఎ' తొలి ఇన్నింగ్స్ 290 (షామ్స్ ములానీ 89, తనుష్ 53, హర్షిత్ రాణా 4/51, కావేరప్ప 2/30, అర్ష్‌దీప్ 2/73); **రెండో ఇన్నింగ్స్: 115/1.**

ఇండియా 'డి' మొదటి ఇన్నింగ్స్: 183 (పడిక్కళ్ 92, హర్షిత్ రాణా 31, రికీ భుయ్ 23, ఖలీల్ 3/39, ఆఖీబ్ ఖాన్ 3/41)

రాణించిన జగదీశన్, అభిమన్యు

ఓపెనర్లు జగదీశన్ (67 బ్యాటింగ్), కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (51 బ్యాటింగ్) హాఫ్ సెంచరీలతో చెలరేగడంతో ఇండియా 'సి'కి ఇండియా 'బి' దీటైన జవాబిస్తోంది. ఓపెనర్ల అజేయ ఇన్నింగ్స్‌తో రెండో రోజు ఆఖరికి ఇండియా 'బి' తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 124 పరుగులు చేసింది. అంతకుముందు కిందటిరోజు 357/5తో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా 'సి' 525 పరుగుల భారీ స్కోరుకు ఆలౌటైంది. మానవ్ సుతార్ (82), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (58) అర్ధ శతకాలతో మెరిశారు.



జగదీశన్

సంక్షిప్తస్కోర్లు: ఇండియా 'సి' తొలి ఇన్నింగ్స్: 525 (ఇషాన్ 111, సుతార్ 82, రుతురాజ్ 58, రాహుల్ చాహర్ 4/73, ముకేష్ 4/126).

ఇండియా 'బి' తొలి ఇన్నింగ్స్: 124/0.

మొత్తంగా రద్దయింది!

అఫ్ఘానిస్థాన్, న్యూజిలాండ్ ఏకైక టెస్ట్




గ్రేటర్ నోయిడా: కనీసం ఒక్కటంటే..ఒక్క బంతి కూడా పడకుండానే అఫ్ఘానిస్థాన్-న్యూజిలాండ్ జట్ల మధ్య ఇక్కడ జరగాల్సిన ఏకైక టెస్ట్ మ్యాచ్ రద్దయింది. శుక్రవారం కూడా ఎడతెగని వర్షం పడడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. దాంతో వర్షంతో రద్దయిన ఎనిమిదో టెస్ట్‌గా ఈ మ్యాచ్ చరిత్ర పుటలకెక్కింది. భారత్‌లో ఇలా జరగడం మాత్రం ఇదే తొలిసారి కావడం గమనార్హం. సోమవారం ఈ మ్యాచ్ ప్రారంభం కావాల్సి ఉండగా..అవుట్ ఫీల్డ్ చిత్తడిగా ఉండడంతో మొదటి రెండు రోజుల ఆట సాధ్యం కాలేదు. కనీసం టాస్ వేసేందుకూ వీలుపడలేదు. దాంతో టెస్ట్‌కు ఆతిథ్యమిచ్చేందుకు షహీద్ విజయ్ సింగ్ పాథక్ స్టేడియం సన్నద్ధం కాలేదని తెలిపోయింది. ఇక మిగిలిన మూడు రోజుల ఆట వరుణుడి ప్రతాపం కారణంగా రద్దయింది. 'గ్రేటర్ నోయిడాలో శుక్రవారమూ వర్షం పడింది. దాంతో అఫ్ఘాన్-కివీస్ జట్ల టెస్ట్ ఐదో రోజు ఆటను రద్దు చేస్తూ మ్యాచ్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు' అని అఫ్ఘానిస్థాన్ క్రికెట్ బోర్డు తెలిపింది. 1877లో టెస్ట్ క్రికెట్ ప్రారంభంకాగా..నేటి వరకు ఈ 147 సంవత్సరాల్లో ..2549 టెస్ట్‌ల్లో మొత్తం 8 మ్యాచ్‌లు ఒక్క బంతీ పడకుండానే రద్దు జాబితాలో చేరాయి. చివరిసారి 26 ఏళ్ల కిందట..అంటే 1998లో ఇలాంటి ఘటన చోటుచేసుకుంది. డిసెంబరు 20, 1998లో ఒకే రోజు రెండు టెస్ట్‌లు (భారత్-కివీస్, పాక్-జింబాబ్వే) రద్దయ్యాయి.. పాకిస్థాన్-జింబాబ్వే టెస్ట్ దట్టమైన పొగమంచువల్ల రద్దయింది. ఇక ఆసియాలో..91 సంవత్సరాలలో 731 టెస్ట్ మ్యాచ్‌ల్లో వర్షం వల్ల రద్దయిన తొలి మ్యాచ్ అఫ్ఘాన్-కివీస్‌దే.

రద్దయిన మ్యాచ్‌లు ఇవీ..

సంవత్సరం	వేదిక	ప్రత్యర్థులు
1890	ఓల్డ్‌ట్రాఫర్డ్	ఇంగ్లండ్-ఆస్ట్రేలియా (అప్పట్లో టెస్ట్‌లు 3 రోజులే జరిగేవి)
1938	ఓల్డ్‌ట్రాఫోర్డ్	ఇంగ్లండ్-ఆస్ట్రేలియా (నాలుగు రోజుల టెస్ట్)
1970	మెల్‌బోర్న్	ఆస్ట్రేలియా-ఇంగ్లండ్
1989	డ్యునెడిన్	న్యూజిలాండ్-పాకిస్థాన్
1990	బౌర్డా (గయానా)	వెస్టిండీస్-ఇంగ్లండ్
1998	ఫైసలాబాద్	పాకిస్థాన్-జింబాబ్వే
1998	డ్యునెడిన్	న్యూజిలాండ్-భారత్
2024	గ్రేటర్ నోయిడా	అఫ్ఘానిస్థాన్-న్యూజిలాండ్

రొనాల్డో @ 100 కోట్లు

సోషల్ మీడియాలో సాకర్ స్టార్ రికార్డు



లిస్బన్: క్రిస్టియానో రొనాల్డో.. ఈ ప్రఖ్యాత ఫుట్‌బాలర్ మైదానం లోపలా, బయటా ఏం చేసినా సంచలనమే. ఇటీవలే యూట్యూబ్‌లో అడుగుపెడితే గంటన్నరలోనే మిలియన్.. వారం రోజుల్లోనే 50 మిలియన్ల సబ్‌స్క్రయిర్లను సంపాదించి రికార్డులతో షేక్ చేశాడు. తాజాగా మరెవరికీ సాధ్యం కాదేమోనన్న రీతిలో సోషల్ మీడియాలో ఏకంగా ఒక బిలియన్ ఫాలోవర్లను దక్కించుకుని చరిత్ర సృష్టించాడు. శుక్రవారం ఉదయం అతడీ మైలురాయికి చేరుకున్నాడు. ఇప్పటివరకు ఎవరికీ ఈ రికార్డు లేదు. ఎక్స్ (11 కోట్ల 30 లక్షలు), ఇన్‌స్టాగ్రామ్ (64 కోట్లు), యూట్యూబ్ (6 కోట్ల 5 లక్షలు), ఫేస్‌బుక్ (17 కోట్లు), చైనాకు చెందిన కువాషో (94 లక్షలు), వీబో (75 లక్షలు)లలో అతడికి ఎకౌంట్స్ ఉన్నాయి. 'మనం చరిత్ర సృష్టించాం. ఇది సంఖ్య మాత్రమే కాదు. మీ ప్రేమాభిమానాలకు నిదర్శనం. మదైరా వీధుల నుంచి.. ప్రపంచంలోనే అతిపెద్ద వేదికల వరకు.. నేనింకా మరిన్ని విజయాలు సాధించి చరిత్ర సృష్టించాల్సిన అవసరం ఉంది' అంటూ రొనాల్డో కృతజ్ఞతలు తెలిపాడు. గత నెల 21న రొనాల్డో తన యూట్యూబ్ చానెల్ ఆరంభించడంతో వన్ బిలియన్ రికార్డును చాలా వేగంగా చేరుకోగలిగాడు.

భారత జట్ల హ్యాట్రిక్

చెస్ ఒలింపియాడ్

బుడాపెస్ట్: చెస్ ఒలింపియాడ్‌లో వరుసగా మూడో రౌండ్‌లోనూ విజయాలతో భారత జట్లు హ్యాట్రిక్ నమోదు చేశాయి. శుక్రవారం ఓపెన్ విభాగంలో పురుషుల జట్టు 3.5-0.5తో హంగేరి 'బి'పై గెలుపొందగా, మహిళల జట్టు 3-1తో స్విట్జర్లాండ్‌ను ఓడించింది. పీటర్ ప్రొహాస్కాపై అర్జున్, ఆడమ్ కొజాక్‌పై గుకేష్, టామస్ బనుజ్‌పై ప్రజ్ఞానంద గెలిచారు. గబోర్ పాప్‌తో గేమ్‌ను విదిత్ గుజ్‌రాతీ డ్రాగా ముగించాడు. మహిళల్లో సోఫియాను దివ్య, ఘజల్‌ను వైశాలి ఓడించారు. అయితే కోస్టెనియుక్ చేతిలో హారిక ఓడగా, కీలకమైన గేమ్‌లో మరియాను వంతిక అగర్వాల్ ఓడించడంతో భారత్‌కు విజయం దక్కింది.



రామ్‌కుమార్-శ్రీరామ్ బాలాజీ

భారత్‌కు కఠిన సవాల్

స్వీడన్‌తో పోరు | నేటి నుంచి డేవిస్‌కప్

స్టాక్‌హోమ్: డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్1లో భాగంగా భారత టెన్నిస్ జట్టు నేడు, రేపు స్వీడన్‌తో తలపడనుంది. టాప్ సింగిల్స్ స్టార్ సుమిత్ నగాల్, యుకీ భాంబ్రి జట్టులో లేరు. దీంతో డబుల్స్ స్పెషలిస్ట్ శ్రీరామ్ బాలాజీపై ఆధారపడాల్సి వస్తోంది. శనివారం జరిగే తొలి సింగిల్స్‌లో ఎలియాస్ వైమర్‌తో బాలాజీ ఆడనున్నాడు. ఆ తర్వాత రెండో సింగిల్స్‌లో రామ్‌కుమార్ రామ్‌నాథన్- దిగ్గజ ఆటగాడు బోర్న్‌బోర్గ్ కుమారుడు లియో బోర్గ్‌తో అమీతుమీ తేల్చుకోనున్నాడు. అలాగే ఆదివారం డబుల్స్‌లో బాలాజీ-రామ్‌నాథన్ కలిసి ఆడనున్నారు. తర్వాత రివర్స్ సింగిల్స్ మ్యాచ్‌లు జరుగుతాయి. భారత కాలమాన ప్రకారం తొలిరోజు పోటీలు సా 5.30 గం.కు, రెండో రోజు పోటీలు మ.3.30కి ప్రారంభమవుతాయి.



తీర్థుకు రజతం

● వ్రితి, వర్షిత్‌కు కాంస్యాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ సీనియర్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో తెలుగు స్విమ్మర్లు పతకాల మోత మోగిస్తున్నారు. శుక్రవారం ముగిసిన ఈ పోటీల్లో విజయవాడ స్విమ్మర్ తీర్థు సామదేవ్ రజతం, హైదరాబాద్ స్విమ్మర్లు వ్రితి అగర్వాల్, వర్షిత్ కాంస్యాలు కొల్లగొట్టారు. పురుషుల 400 మీటర్ల మెడ్లేలో తీర్థు 4 నిమిషాల 36.44 సెకన్లలో రేసును పూర్తి చేసి ద్వితీయ స్థానంలో నిలవగా, వర్షిత్ (4 ని, 37.68 సె.) మూడో స్థానం దక్కించుకున్నాడు. మహిళల 200 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో వ్రితి 2 ని. 9.25 సెకన్లలో రేసును ముగించి తృతీయ స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో వ్రితికి ఇది ఐదో పతకం.

ప్రాక్టీస్ మొదలెట్టారు

చెన్నైలో టీమిండియా | 19 నుంచి బంగ్లాతో తొలి టెస్టు

చెన్నై: నెల రోజులకుపైగా విశ్రాంతి తర్వాత టీమిండియా క్రికెటర్లు తిరిగి సాధన ఆరంభించారు. బంగ్లాదేశ్‌తో జరుగబోయే రెండు టెస్టుల సిరీస్ కోసం కోచ్ గౌతమ్ గంభీర్ ఆధ్వర్యంలో జట్టు ఆటగాళ్లంతా శుక్రవారం నెట్స్‌లో చెమటోడ్చారు. ఈనెల 19న చెపాక్‌లో తొలి టెస్టు ఆరంభం కానుంది. కెప్టెన్ రోహిత్ శర్మ, కొన్ని రోజులుగా కుటుంబంతో కలిసి లండన్‌లో సేద దీరిన విరాట్ కోహ్లీ, కొత్త బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్, అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ కూడా పాల్గొన్నారు. విరాట్ 45 నిమిషాలపాటు నెట్స్‌లో గడపగా, బౌలర్ బుమ్రా పూర్తి స్థాయిలో బౌలింగ్ చేశాడు. 'ఆసక్తికర హోమ్ సీజన్ కోసం కౌంట్‌డౌన్ ఆరంభమైంది' అంటూ తొలి రోజు ప్రాక్టీస్ ఫొటోలను బీసీసీఐ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అంతకుముందు రోహిత్ గురువారం రాత్రి చేరుకోగా విరాట్ నేరుగా లండన్ నుంచే చెన్నైకి వచ్చాడు. ఈ సిరీస్‌కు ముందు ఆగస్టులో శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లో భారత్ ఓడిన విషయం తెలిసిందే. ఇక కోచ్ గంభీర్ అతడి సహాయక సిబ్బంది ఆధ్వర్యంలో భారత్‌కిది తొలి టెస్టు కావడం గమనార్హం. అందుకే గౌతీ శిక్షణలో భారత్ ఎలాంటి వ్యూహంతో బరిలోకి దిగనుందనే ఆసక్తి వ్యక్తమవుతోంది. అటు బంగ్లా జట్టు ఇటీవలే పాక్‌ను 2-0తో చిత్తుగా ఓడించిన ఊపులో ఉంది. అలాగే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరే క్రమంలో టీమిండియాకు ఈ సిరీస్ విజయం అత్యంత కీలకం కానుంది. ఆ తర్వాత కివీస్‌తో మూడు, ఆసీస్‌తో ఐదు టెస్టులు ఆడనుంది. 68.52 విజయాల శాతంతో రోహిత్ సేన డబ్ల్యూటీసీ పట్టికలో టాప్‌లో కొనసాగుతోంది.



కోహ్లీ, బుమ్రా

ఆ ఇద్దరి ప్రదర్శన ఆసక్తికరం: మ్యాక్స్‌వెల్

ప్రపంచ క్రికెట్‌లో దిగ్గజాలు విరాట్ కోహ్లీ, స్టీవ్ స్మిత్‌ల ప్రదర్శనను తిలకించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్టు ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ మ్యాక్స్‌వెల్ తెలిపాడు. ఈ ఏడాది చివర్లో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఇద్దరు సూపర్‌స్టార్లు ముఖాముఖిగా తలపడబోవడం ఒక ఎత్తయితే.. ఏ జట్టు ట్రోఫీ గెలుచుకుంటుందనేది వీరి ప్రదర్శనపైనే ఆధారపడి ఉంటుందని మ్యాక్సీ అన్నాడు.

హైదరాబాద్ జట్టుకు రూ.25 లక్షల నజరానా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఏడేళ్ల తర్వాత ఆలిండియా బుచ్చిబాబు క్రికెట్ ట్రోఫీ విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టుకు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు రూ. 25 లక్షల బహుమతి ప్రకటించారు. ఇదే ఉత్సాహాన్ని ఈ సీజన్ మొత్తం కనబర్చి వచ్చే రంజీ ట్రోఫీలోనూ మెరుగైన ప్రదర్శన చేయాలని జగన్ ఆకాంక్షించారు. టీమిండియా మాజీ పేసర్ వెంకటేష్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడుతున్న వాళ్లు ఎలాంటి పరిస్థితుల్లోనైనా, పిచ్‌లపైనైనా రాణించేలా మానసికంగా, శారీరకంగా సన్నద్ధమైతేనే విజయం సాధించగలరని సూచించారు.

బిజినెస్

టాప్-25 మాల్స్ జాబితాలో హైదరాబాద్ శరత్ సిటీ క్యాపిటల్

న్యూఢిల్లీ: రోజూ ఎక్కువ మంది షాపింగ్ చేసే టాప్-25 మాల్స్‌లో ఒక హైదరాబాద్ మాల్‌కు స్థానం లభించింది. కొండాపూర్‌లోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్ ఈ జాబితాలో తొమ్మిదవ స్థానం సంపాదించింది. ఢిల్లీలోని వెగాస్ ఈ జాబితాలో అగ్రస్థానం సొంపాదించింది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్య దేశంలోని ప్రధాన నగరాల్లోని మాల్స్‌లో షాపింగ్‌కు వచ్చిన వ్యక్తుల రాకపోకల ఆధారంగా జియోఐక్యూ అనే సంస్థ ఈ జాబితాను రూపొందించింది. రెండో స్థానం కూడా ఢిల్లీకి చెందిన వీ3ఎస్ ఈస్ట్ సెంటర్ మాల్‌కు దక్కింది. ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతంలోని ఫినిక్స్ మార్కెట్ సిటీకి మూడో స్థానం దక్కింది. ముంబైకే చెందిన ఆర్ సిటీ మాల్ ఆరు, వివియానా మాల్ ఐదు, సీ వుడ్స్ గ్రాండ్ 10, హై స్ట్రీట్ ఫీనిక్స్ 12వ స్థానాల్లో నిలిచాయి.

5 లక్షల వరకు యూపీఐ చెల్లింపులు

ఆదివారం నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ: ఆదివారం నుంచి యూపీఐ చెల్లింపుల పరిమితి పెరగనుంది. రోజువారీ లావాదేవీల ద్వారా చెల్లించే పరిమితి రూ.5 లక్షలకు పెంచాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) నిర్ణయించింది. అయితే ఇది పన్ను చెల్లింపులు, హాస్పిటల్, విద్యా సేవల చెల్లింపులకు మాత్రమే పరిమితమని స్పష్టం చేసింది. మిగతా చెల్లింపుల రోజువారీ పరిమితిని ప్రస్తుత రూ.లక్ష దగ్గరే పరిమితం చేసింది.

మేము సచ్ఛీలురం, నిజాయితీపరులం

» దురుద్దేశాలతోనే మాపై ఆరోపణలు
» సెబీలో చేరేటప్పుడే అన్ని విషయాల వెల్లడి
» తప్పుడు ఆరోపణలపై కోర్టుకు వెళతాం
» మాధవి పురి, ధవల్ బుచ్



న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్, ఆమె భర్త ధవల్ బుచ్ ఎట్టకేలకు నోరు విప్పారు. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ, కాంగ్రెస్ పార్టీ తమపై పదే పదే చేస్తున్న ఆరోపణలను పూర్తిగా కొట్టివేశారు. దురుద్దేశాలతో పనిగట్టుకుని తప్పుడు ఆరోపణలతో తమపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిని కోర్టుకు ఈడ్చేందుకు వెనకాడేది లేదని హెచ్చరించారు. దీనికి సంబంధించి బుచ్ దంపతులు శుక్రవారం ఆరు పేజీల ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనలో వారు తమపై వచ్చిన ప్రతి ఆరోపణకు సమాధానం ఇచ్చారు.

అవి ఇ-సాప్స్ చెల్లింపులు మాత్రమే

సెబీలో చేరిన తర్వాత కూడా తాను గతంలో పనిచేసిన ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి చెల్లింపులు అందుకున్నట్టు హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపైనా మాధవి బుచ్ వివరణ ఇచ్చారు. అవి ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్ (ఇ-సాప్స్), కంట్రిబ్యూటరీ యాన్యుటీలు మాత్రమేనని స్పష్టం చేశారు. ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి తనకు ఈ రెండు చెల్లింపులు వస్తాయనే విషయాన్ని సెబీలో చేరేటప్పుడే వెల్లడించినట్టు తెలిపారు. సెబీ మార్గదర్శకాలు కూడా ఇందుకు అనుమతిస్తాయన్నారు.

ఆ ఫైల్స్ తాకనేలేదు..

అలాగే తాను 2017లో సెబీ డైరెక్టర్‌గా చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు ఐసీఐసీఐ బ్యాంక్ గ్రూప్ కంపెనీల ఫైల్స్ ఏవీ ముట్టుకోలేదని సెబీ చీఫ్ స్పష్టం చేశారు. తాను స్థాపించిన అగోరా అడ్వైజరీ, అగోరా పార్ట్‌నర్స్ సంస్థల నుంచి కూడా 2017 నుంచి తాను ఎలాంటి చెల్లింపులు అందుకోలేదన్నారు. తన భర్త నుంచి సేవలు అందుకున్న మహీంద్రా గ్రూప్ కంపెనీల ఫైల్స్ కూడా తాను ఎన్నడూ ముట్టలేదన్నారు.

పసిడి మళ్లీ రూ.75,000 పైకి

ఒక్కరోజే రూ.1,200 పెరుగుదల

2 నెలల గరిష్ఠానికి చేరిక | వెండి రూ.2,000 జంప్



న్యూఢిల్లీ: విలువైన లోహాల ధరలు మళ్లీ కొండెక్కాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర శుక్రవారం నాడు రూ.1,200 పెరిగి దాదాపు రెండు నెలల గరిష్ఠ స్థాయి రూ.75,550కి చేరుకుంది. అంతర్జాతీయంగా పసిడికి డిమాండ్ పెరగడంతోపాటు దేశీయంగా ఆభరణ వర్తకులు భారీగా కొనుగోళ్లకు పాల్పడటం ఇందుకు కారణమైంది. కిలో వెండి మరో రూ.2,000 పెరిగి రూ.89,000 ధర పలికింది. పారిశ్రామిక అవసరాలతోపాటు నాణేల తయారీదారుల కొనుగోళ్లు పెరగడం ఇందుకు కారణమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. వెండి ధర పెరగడం వరుసగా ఇది నాలుగో రోజు. ఈ 4 రోజుల్లో వెండి ధర రూ.5,200 పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో బులియన్ ధరల ర్యాలీకి వచ్చే వారంలో అమెరికన్ సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న అంచనాలే ప్రధాన కారణం. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 1.15 శాతం పెరుగుదలతో సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి 2,610 డాలర్లకు ఎగబాకింది. వెండి 3.20 శాతం ఎగబాకి 31.05 డాలర్ల వద్ద ట్రేడైంది. సాధారణంగా ఫెడ్ రేట్లు, బులియన్ ధరలది విలోమ సంబంధం. ఫెడ్ రేట్లు పెరుగుతున్నప్పుడు విలువైన లోహాల ధరలు తగ్గుతాయి. ఫెడ్ రేట్ల తగ్గుదల సమయంలో బులియన్ ధరలు ఎగబాకుతాయి. ప్రస్తుత బులియన్ ర్యాలీ మున్ముందూ కొనసాగనుందని బులియన్ విశ్లేషకులంటున్నారు. వచ్చే ఏడాదిలో ఔన్స్ బంగారం 3,000 డాలర్ల స్థాయికి చేరుకోవచ్చన్న అంచనాలున్నాయి.

సూచీలకు స్వల్ప నష్టాలు

ముంబై: క్రితం సెషన్‌లో సరికొత్త గరిష్ఠాలకు ఎగబాకిన ప్రామాణిక ఈక్విటీ సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో స్వల్ప నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 71.77 పాయింట్లు కోల్పోయి 82,890.94 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 32.40 పాయింట్లు క్షీణించి 25,356.50 వద్ద స్థిరపడింది. రికార్డు గరిష్ఠాల వద్ద ఇన్వెస్టర్లు పవర్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్ఎంసీజీ రంగాలకు చెందిన కొన్ని షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడటం ఇందుకు కారణమైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 17 నష్టపోయాయి. అదానీ పోర్ట్స్ షేరు 1.37 శాతం నష్టంతో సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బ్లూచిప్‌లు అమ్మకాల ఒత్తిడికి లోనైనప్పటికీ చిన్న, మధ్య స్థాయి షేర్లలో కొనుగోళ్లు కొనసాగాయి. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.95 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.48 శాతం ఎగిశాయి. రంగాలవారీ సూచీల్లో ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్ఎంసీజీ అర శాతానికి పైగా నష్టపోయాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 4 పైసలు పెరిగి 83.92 వద్ద ముగిసింది.

రికార్డు స్థాయికి ఫారెక్స్ నిల్వలు

విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు వరుసగా రెండో వారం సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయికి పెరిగాయి. ఈనెల 6తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వలు 525 కోట్ల డాలర్ల వృద్ధితో మొత్తం 68,924 కోట్ల డాలర్లకు చేరుకున్నాయని ఆర్‌బీఐ శుక్రవారం వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ నిల్వలు 229 కోట్ల డాలర్ల పెరుగుదలతో 68,398 కోట్ల డాలర్ల వద్దకు చేరాయి.

కో-లొకేషన్ కేసులో ఎన్ఎస్ఈకి ఊరట

న్యూఢిల్లీ: కో-లొకేషన్ కేసుకు సంబంధించి నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ)కు భారీ ఊరట లభించడంతో పాటు పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు వచ్చేందుకు ఈ ఎక్స్ఛేంజీకి మార్గం సుగమమైంది. ఈ కేసులో ఎన్ఎస్ఈతో పాటు ఎక్స్ఛేంజీ మాజీ చీఫ్ చిత్ర రామకృష్ణ సహా ఏడుగురు మాజీ ఉద్యోగులపై వచ్చిన నియంత్రణ నియమావళి ఉల్లంఘన ఆరోపణలను సెబీ కొట్టివేసింది. ఆ ఆరోపణలను రుజువు చేసేందుకు సరైన ఆధారాలు లేని కారణంగా కేసును మూసివేస్తున్నట్టు శుక్రవారం జారీ చేసిన 83 పేజీల ఉత్తర్వులో సెబీ పేర్కొంది. ఎన్ఎస్ఈ మాజీ ఎండీ, సీఈఓ చిత్ర రామకృష్ణ హయాంలో జరిగిన వ్యవహారమిది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,450 ▲	68,250 ▲	95,000 ▲
ముంబై	73,044 ▲	66,908 ▲	86,100 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ

హైదరాబాద్	500	విజయవాడ	530
వరంగల్	502	గోదావరి	525
చిత్తూరు	553	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	115	విజయవాడ	123
వరంగల్	115	గుంటూరు	125
కరీంనగర్	115	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	120
కర్నూలు	115	నెల్లూరు	120
విశాఖపట్నం	106	అనంతపురం	120
గోదావరి	123		

అయినా చేరాల్సిన దూరం ఎంతో ఉంది

ద్రవ్యోల్బణం అదుపుపై ఆర్‌బీఐ గవర్నర్ దాస్



సింగపూర్: భారత్‌లో ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చిందని, అయినప్పటికీ చేరాల్సిన దూరం ఇంకా ఎంతో ఉన్నదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ఆగస్టులో రిటైల్ ద్రవ్యోల్బణం 3.65 శాతంగా నమోదైంది. ప్రభుత్వం ఆర్‌బీఐకి నిర్దేశించిన కట్టడి పరిధి 4 శాతం కన్నా దిగువనే ద్రవ్యోల్బణం ఉండడం వరుసగా ఇది రెండో నెల. 2022 ఏప్రిల్‌లో నమోదైన గరిష్ఠ స్థాయి 7.8 శాతం నుంచి ప్రస్తుత స్థాయికి దిగిరావడం హర్షణీయమే అయినా అప్రమత్తత తప్పదని ఆయన వ్యాఖ్యానించారు.

బ్రెటన్ వుడ్స్ కమిటీ నిర్వహణలోని ఫ్యూచర్ ఆఫ్ ఫైనాన్స్ ఫోరమ్ 2024 కార్యక్రమంలో కీలకోపన్యాసం ఇస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ద్రవ్యోల్బణం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 5.4 శాతం ఉండి వచ్చే ఏడాదికి 4.5 శాతానికి, 2025-26 సంవత్సరానికి 4.1 శాతానికి దిగి వస్తుందన్నది ఆర్‌బీఐ అంచనా. ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో ద్రవ్య విధాన నిర్వహణలో సెంట్రల్ బ్యాంకులు అప్రమత్తంగా ఉండక తప్పదని, అలాగే ప్రభుత్వాలు సరఫరాల పరంగా క్రియాశీలంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ఇటీవల వెలువరించిన విధాన ప్రకటన అనంతరం కీలక వడ్డీ రేట్లు తగ్గవచ్చన్న ఆశలు జోరందుకున్నాయని, అయితే దీర్ఘకాలంగా వడ్డీ రేట్లు గరిష్ఠ స్థాయిల్లో ఉన్న నేపథ్యంలో ఎదురయ్యే రిస్క్‌ను కూడా పరిగణనలోకి తీసుకోక తప్పదని దాస్ అన్నారు.

వారివో హై స్పీడ్ ఈ-స్కూటర్ సీఆర్‌ఎక్స్

ధర రూ.79,999



న్యూఢిల్లీ: విద్యుత్ టూ వీలర్ స్టార్టప్ వారివో మోటార్స్ హై స్పీడ్ స్కూటర్ సీఆర్‌ఎక్స్‌ను మార్కెట్లోకి తెచ్చింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.79,999. ఇప్పటివరకు వారివో గంటకు 25 కిలోమీటర్ల కన్నా తక్కువ వేగంతో నడిచే ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు మాత్రమే మార్కెటింగ్ చేస్తోంది. సీఆర్‌ఎక్స్ గంటకు 55 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించగలుగుతుంది. గరిష్ఠంగా 150 కిలోల బరువు వరకు మోయగలుగుతుంది. ఈ ఏడాది సీఆర్‌ఎక్స్ 8 వేల యూనిట్లు విక్రయించడం లక్ష్యంగా పెట్టుకున్నామని కంపెనీ సీఈఓ షమ్మీ శర్మ తెలిపారు. సీఆర్‌ఎక్స్‌తో తాము హైస్పీడ్ స్కూటర్లలో మిడ్ సెగ్మెంట్‌లో ప్రవేశించినట్టయిందని ఆయన చెప్పారు. రాబోయే మూడేళ్ల కాలంలో ఆదాయాల్లో 90 నుంచి 100 శాతం వృద్ధి సాధించాలన్నది తమ లక్ష్యమని కంపెనీ డైరెక్టర్ రాజీవ్ గోయెల్ తెలిపారు.

1 పెట్ రీసైకిల్ కంపెనీ గణేషా ఎకోస్పియర్ లిమిటెడ్‌తో కలిసి జాయింట్ వెంచర్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కంపెనీ రేస్ ఎకో చెయిన్ ప్రకటించింది. గణేషా రీసైక్లింగ్ చెయిన్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఏర్పాటు చేయనున్న ఈ భాగస్వామ్య సంస్థ దేశవ్యాప్తంగా వాషింగ్ లైన్స్‌ను ఏర్పాటు చేయటంతో పాటు పెట్ బాటిల్స్‌ను తిరిగి ఉపయోగించే విధంగా చర్యలు తీసుకుంటుందని రేస్ ఎకో తెలిపింది.

1 మెటీరియల్ హ్యాండ్లింగ్ ఎక్విప్‌మెంట్ తయారీ సంస్థ జేసీబీ.. మార్కెట్లోకి టెలిస్కోపిక్ బూమ్ ప్లాట్‌ఫామ్‌తో కూడిన టి65 డీ విడుదల చేసింది. అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో పాటు రక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తుందని జేసీబీ ఇండియా వెల్లడించింది. రాజస్థాన్‌లోని జైపూర్ ప్లాంట్‌లో దీన్ని తయారు చేసింది.

1 ఆంధ్రప్రదేశ్.. విజయవాడ, విశాఖపట్నంలోని గృహ యజమానుల కోసం అడ్వాన్స్‌డ్ సిరీస్ 4 హోమ్ లిఫ్ట్‌ను తీసుకువచ్చినట్టు నిబవ్ ప్రకటించింది. లగ్జరీతో పాటు సౌకర్యవంతంగా ఉండే విధంగా వీటిని రూపొందించినట్లు తెలిపింది. ఏఐ ఆధారిత క్యాబిన్ డిస్‌ప్లే, లిడాన్ 2.0 టెక్నాలజీ.. ఈ లిఫ్ట్ ప్రత్యేకతలు.

1 పండగల సీజన్‌ను పురస్కరించుకుని కార్లు, ఎస్‌యూవీ ధరలను తగ్గించినట్లు టాటా మోటార్స్ ప్రకటించింది. ఐసీఈ ఇంజన్‌తో కూడిన వాహన ధరలను రూ.2.5 లక్షల వరకు తగ్గించగా అన్ని ఎస్‌యూవీలు, పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీలతో కూడిన కార్లకు ప్రత్యేక ధరలు ఆఫర్ చేస్తున్నట్టు వెల్లడించింది. వీటితో పాటు ఎక్స్ఛేంజ్ ఆఫర్ కింద రూ.45,000 వరకు కస్టమర్లు లబ్ధి పొందవచ్చని టాటా మోటార్స్ తెలిపింది.

ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక క్లినిక్‌లు!

» రాష్ట్రవ్యాప్తంగా బోధనాస్పత్రుల్లో ఏర్పాటు

» 23 చోట్ల క్లినిక్‌లు.. ఓపీ, ఐపీ సేవలు.. సర్కారు నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేకంగా క్లినిక్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 23 బోధనాస్పత్రుల్లో వీటిని ఏర్పాటు చేయనుంది. ఇందుకు సంబంధించిన కసరత్తు దాదాపు పూర్తయింది. ఆయా జిల్లా కేంద్రాల్లో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ వైద్య కళాశాల అనుబంధ ఆస్పత్రుల్లో ఈ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. శుక్రవారం వైద్యఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు ఈ అంశంపై సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి. తాము అనారోగ్యం పాలైతే ఆస్పత్రులకు వెళ్లలేకపోతున్నామని, ధైర్యం చేసి వెళ్లినా అవమానాలను ఎదుర్కోవాల్సి వస్తోందని ట్రాన్స్‌జెండర్లు ఇటీవల సర్కారు దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే సర్కారు ప్రత్యేక క్లినిక్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక వైద్య సిబ్బందిని నియమించడంతో పాటు వారికి శిక్షణ ఇవ్వనున్నారు. ఓపీ, ఇన్‌పేషెంట్ వైద్య చికిత్సలు 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడనున్నారు. ఈ క్లినిక్‌లకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చేందుకు టెండర్ల ఎంపిక ప్రక్రియ కూడా మొదలైంది. రాష్ట్రంలో 60 వేల మందికి పైగా ట్రాన్స్‌జెండర్లు ఉన్నట్లు సర్కారీ లెక్కలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే ఉస్మానియా ఆస్పత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం క్లినిక్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఉచితంగా ఆపరేషన్లు చేయడానికి అవసరమైన ఏర్పాట్లూ చేశారు.

కేంద్రాలు ఎక్కడంటే..

ఆదిలాబాద్ రిమ్స్, మంచిర్యాల జనరల్ ఆస్పత్రి, నిర్మల్, ఆసిఫాబాద్, కరీంనగర్, రామగుండం, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, సంగారెడ్డి, సిద్దిపేట, నల్లగొండ, సూర్యాపేట, నిజామాబాద్, కామారెడ్డి, వరంగల్ ఎంజీఎం, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రులతో పాటు హనుమకొండ టీబీ ఆస్పత్రిలోనూ ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఆస్పత్రిలో ఒక నోడల్ అధికారి లేదా ఫిజీషియన్, డెర్మటాలజిస్టు, సైకియాట్రిస్టు, స్టాఫ్ నర్స్‌ను నియమించనున్నారు. కాగా, కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సైతం ట్రాన్స్‌జెండర్లకు అందించాల్సిన వైద్యచికిత్సలపై ఈ నెల 10న మార్గదర్శకాలను విడుదల చేసిన విషయం తెలిసిందే.

వారం రోజుల్లో ఎంబీబీఎస్ కౌన్సెలింగ్

» వదంతులు నమ్మి విద్యార్థులు ఆందోళన చెందొద్దు

» వెబ్ ఆప్షన్ల నమోదుకు సిద్ధంగా ఉండండి

» వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. వారం రోజుల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని శనివారం ఓ ప్రకటన చేశారు. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ ఇచ్చిన గడువులోగా కౌన్సెలింగ్ పూర్తి చేసి, సకాలంలో తరగతులను కూడా ప్రారంభిస్తామని భరోసా ఇచ్చారు. వైద్య విద్య ప్రవేశాల అంశంలో అసత్య ప్రచారాలు, వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని విద్యార్థులను కోరారు. తెలంగాణ ప్రాంత విద్యార్థులకే సీట్లు దక్కాలన్నది తమ ఆలోచన అని, ఈ విషయంలో రాజీ పడేదే లేదని స్పష్టం చేశారు. వారం రోజుల్లో కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందని, ఈలోగా వెబ్ ఆప్షన్ల నమోదుకు విద్యార్థులంతా సిద్ధంగా ఉండాలని సూచించారు. శనివారం ఉదయం 11 నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లోని సీట్ల వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే, గతేడాది జరిగిన సీట్ల కేటాయింపు వివరాలను కూడా ర్యాంకుల వారీగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ఆయా వివరాలను పరిశీలించి, తమ ర్యాంకులకు అనుగుణంగా వెబ్ ఆప్షన్ల కోసం జాబితాను సిద్ధం చేసుకోవాలని విద్యార్థులకు మంత్రి సూచించారు.


వంటనూనెలు భగ్గు!

» ముడి, శుద్ధి చేసిన సన్‌ఫ్లవర్, సోయాబీన్ ఆయిల్‌పై దిగుమతి సుంకం భారీగా పెంపు

» నేటి నుంచి అమల్లోకి.. నూనెల ధరలు పెరిగే చాన్స్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: వినియోగదారులూ పారాహుషార్.. త్వరలోనే వంట నూనెల ధరలు భగ్గుమనబోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ముడి, శుద్ధి చేసిన పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనెపై కస్టమ్స్ సుంకాన్ని పెంచడమే ఇందుకు కారణం. ముడి సన్‌ఫ్లవర్‌పై కస్టమ్స్ సుంకాన్ని 20 శాతానికి, శుద్ధి చేసిన సన్‌ఫ్లవర్‌పై కస్టమ్స్ సుంకాన్ని 32.5 శాతానికి పెంచారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ముడి పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ సీడ్ ఆయిల్‌పై బేసిక్ కస్టమ్స్ సుంకం సున్నా నుంచి 20 శాతానికి పెరిగింది. అలాగే శుద్ధి చేసిన పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై బేసిక్ కస్టమ్స్ సుంకం 12.5 నుంచి 32.5 శాతానికి ఎగబాకింది. ఈమేరకు మొత్తం సుంకం ముడి నూనెలపై 5.5 శాతం నుంచి 27.5 శాతానికి, రిఫైన్డ్ ఆయిల్స్‌పై 13.75 శాతం నుంచి 35.75 శాతానికి పెరగనుంది. శనివారం నుంచి సుంకాల్లో మార్పు అమల్లోకి రానుంది. దిగుమతి సుంకం పెరగడం వల్ల దేశీయంగా వంట నూనెల ధరలు పెరగనున్నాయి. ధరల పెరుగుదల వినియోగాన్ని దెబ్బతీసే అవకాశం ఉంటుంది. సుంకాల పెంపు నేపథ్యంలో విదేశాల నుంచి పామ్ ఆయిల్, సోయా, సన్‌ఫ్లవర్ ఆయిల్ కొనుగోళ్లు తగ్గే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. భారత్ తన వెజిటేబుల్ ఆయిల్స్ డిమాండ్‌ను 70 శాతానికి పైగా దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. ఇండోనేషియా, మలేసియా, థాయిలాండ్ నుంచి పామ్ ఆయిల్‌ను మన దేశం కొనుగోలు చేస్తోంది. సోయా ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను అర్జెంటీనా, బ్రెజిల్, రష్యా, ఉక్రెయిన్ నుంచి దిగుమతి చేసుకుంటోంది.



సాగర్ ప్రధాన జలవిద్యుదుత్పత్తి కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి వివరాలు తెలుసుకుంటున్న జెన్‌కో సీఎండీ రోనాల్డ్‌రాస్

పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తి జరగాలి

» రెండో నంబర్ టర్బైన్‌కు మరమ్మతులు చేపట్టాలి

» వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి

» సాగర్ సిబ్బందికి జెన్‌కో సీఎండీ రోనాల్డ్‌రాస్ ఆదేశం

నాగార్జునసాగర్ సెప్టెంబరు 13: నాగార్జునసాగర్ జలాశయంలో నీరు పుష్కలంగా ఉన్నందున.. నిరంతరాయంగా విద్యుదుత్పత్తి చేపట్టాలని జెన్‌కో సీఎండీ రోనాల్డ్‌రాస్ ఆదేశించారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. విద్యుదుత్పత్తి వివరాలు, నీటి వినియోగం గురించి ఆరా తీశారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేంద్రంలో ఎనిమిది టర్బైన్లు ఉండగా, రెండో నంబర్ టర్బైన్‌కు ఏడాదిగా ఎందుకు మరమ్మతులు చేపట్టలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నిపుణుల బృందాన్ని పిలిపించి మరమ్మతులు చేపట్టాలని, త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. విద్యుదుత్పత్తిలో ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తేవాలని సూచించారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట హైడల్ డైరెక్టర్ వెంకటరాజన్, జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్‌నాయక్, ఎస్ఈలు రఘురాం, రామకృష్ణారెడ్డి, డీఈలు ప్రసన్నకుమార్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ వలంటీర్లుగా ట్రాన్స్‌జెండర్లు!

హోంగార్డుల తరహాలో నియామకం.. హైదరాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రణకు ఇదో మార్గం

క్లీన్ సిటీ కోసం ఇండోర్ మోడల్‌ను అనుసరించండి.. సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



సీఎంవో విడుదల చేసిన ట్రాఫిక్ వలంటీర్ల డ్రెస్ నమూనాలు

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ట్రాన్స్‌జెండర్లను వలంటీర్లుగా నియమించే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. హోంగార్డుల తరహాలో ట్రాన్స్‌జెండర్ల నియామకం చేపట్టాలన్నారు. దానివల్ల వారికి ఉపాధి కూడా కల్పించినట్లవుతుందని చెప్పారు. శుక్రవారం ఆయన సచివాలయంలో జీహెచ్ఎంసీ పౌరసేవల కోసం చేపట్టిన పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్‌ను ఇండోర్ తరహాలో క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అక్కడ అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతంలో స్థలాలు సేకరించే సమయంలో అక్కడి నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని చెప్పారు. హైదరాబాద్‌లో సమగ్ర రహదారుల నిర్వహణ కార్యక్రమం (సీఆర్ఎంపీ) కింద ఐదేళ్ల క్రితం 811 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం చేపట్టారని, వాటి నిర్వహణను మాత్రం పట్టించుకోవడం లేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది డిసెంబరుతో కాంట్రాక్టు గడువు ముగిసిపోతుందని, రోడ్ల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏజెన్సీలను ఉపేక్షించవద్దని ఆదేశించారు. పనులు చేయని కాంట్రాక్టర్ల వివరాలతో 15 రోజుల్లోగా తనకు నివేదికను అందించాలని చెప్పారు. అలాగే, చెత్త సేకరణపైనా జీహెచ్ఎంసీ దృష్టి సారించాలని ఆదేశించారు. అవసరమైతే జీఐఎస్, క్యూఆర్ స్కాన్ లాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సూచించారు. జీహెచ్ఎంసీలో నిరంతరం జరిగే పనులకు ఆర్థిక ఇబ్బంది లేకుండా స్పష్టమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని స్పష్టం చేశారు. అద్దెలు, ప్రకటనలు, హోర్డింగ్‌ల ద్వారా వచ్చే ఆదాయంపై సమీక్షించుకోవాలన్నారు. చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరిస్తున్నందున పరిసరాల్లోని రోడ్లను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. పరిసరాల్లో ఉన్న అటవీ, పరిశ్రమల విభాగం భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని సూచించారు. అక్కడున్న పరిశ్రమలను మరో చోటుకు తరలించాలని చెప్పారు. స్టేషన్ ముందు పార్కింగ్, వాణిజ్య కూడలికి వీలుగా అప్రోచ్ రోడ్లు డిజైన్ చేసుకోవాలని తెలిపారు.

ఆపదలో ఉన్నాం.. ఆదుకోండి



వరద నష్టం అంచనాలపై కేంద్ర బృందంతో నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రులు పొంగులేటి, పొన్నం, సీఎస్ శాంతి కుమారి

శాఖల వారీగా నష్టం వివరాలు..

శాఖ	జరిగిన నష్టం (రూ.కోట్లలో) (ప్రాథమిక అంచనాలు)
1 రోడ్ల భవనాల శాఖ, పంచాయతీరాజ్	7,693
2 అర్బన్ డవలప్‌మెంట్	1216.57
3 నీటిపారుదల శాఖ	483
4 తాగునీటి సరఫరా విభాగం	331
5 వ్యవసాయ శాఖ	231.13
6 విద్యుత్తు శాఖ	179
7 కమ్యునిటీ అసెట్స్	70.47
8 పాఠశాల భవనాలు	27.31
9 గృహనిర్మాణం	25.30
10 మత్స్యశాఖ	56
11 పశుసంవర్ధక శాఖ	4.35
12 మృతులు	1.40

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలను ఆదుకునేందుకు ఎలాంటి షరతులు లేకుండా నిధులు విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో వరదల వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర అధికారుల బృందంతో శుక్రవారం సచివాలయంలో రేవంత్ సమావేశమయ్యారు. ఇటీవల కురిసన భారీ వర్షాల వల్ల రాష్ట్రంలో సంభవించిన అపార నష్టాన్ని కేంద్ర బృందాలకు ఆయన వివరించారు. ఇప్పటి వరకు వివిధ శాఖల నుంచి అందిన వివరాల ప్రకారం రూ.10,032 కోట్ల నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఇది మధ్యంతర నివేదిక మాత్రమేనని, పూర్తి వివరాలు రావాల్సి ఉందని చెప్పారు. రాష్ట్రంలో జరిగిన నష్టంతోపాటు ఇక్కడ అమల్లో ఉన్న ఎస్ఎస్ఆర్ రేట్ల వివరాలను కూడా కేంద్రానికి నివేదిస్తామన్నారు. వాటిని పరిశీలించి విపత్తు సాయం అందించాలని సీఎం కోరారు.

బాధితులకు ఇళ్ల కోసం నిధులివ్వాలి

వరదల వల్ల రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని కేంద్ర బృందాలకు రేవంత్ వివరించారు. పంట పొలాల్లో బండరాళ్లు, కంకర, మట్టి మేటలు వేయడంతో రైతులు కోలుకోలేనంత నష్టపోయారని పేర్కొన్నారు. చాలా చోట్ల రహదారులు, రోడ్లు, కల్వర్టులు, చెరువులు కొట్టుకుపోవడంతో నష్టం ప్రాథమిక అంచనాలకు మించిపోయిందని వివరించారు. ఖమ్మం పట్టణంలో మున్నేరు వాగుతో ఉన్న వరద ముప్పును నివారించేందుకు రిటైనింగ్ వాల్ నిర్మించడమే శాశ్వత పరిష్కారం అని స్పష్టం చేశారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి కేంద్రం తగినన్ని నిధులు కేటాయించేలా చూడాలని అధికారులను కోరారు. రిటైనింగ్‌వాల్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తనవంతు వాటాను భరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాకాసి తండా, సత్యనారాయణ తండాతోపాటు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న తండాల ప్రజలను సమీపంలోని సురక్షిత ప్రాంతాల్లో ఇళ్లను కేటాయిస్తామని.. నిర్మాణానికి అవసరమైన సహాయాన్ని కేంద్రం అందించాలని కోరారు.

మేడారం అడవులకూ నష్టం

వరదలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించాక ఆదుకోవడం కన్నా ముందస్తు చర్యలతో నివారణ మార్గాలపై ఎక్కువ దృష్టిసారించాలని కేంద్ర బృందాలకు సీఎం సూచించారు. వర్షపాతం, వడగాలులు, పర్యావరణ విపత్తులపై ముందస్తు సమాచారం, హెచ్చరికలు జారీ చేసేలా ఏర్పాట్లు ఉండాలని, వాటిపై దృష్టి సారించాలని కేంద్ర బృందానికి సూచించారు. భవిష్యత్తులో వరదలు వచ్చినప్పుడు ఆదుకునేందుకు తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉన్న పోలీసు బెటాలియన్ సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఉపయోగించుకోవాలనే ఆలోచనను కేంద్ర బృందంతో సీఎం పంచుకున్నారు. మేడారం అటవీ ప్రాంతంలో వర్షాల కారణంగా 50 ఎకరాల్లో చెట్లు నేలమట్టం అవడంపైనా సమావేశంలో చర్చించారు. దేశంలో ఇప్పటి వరకు వర్షాలకు అడవుల్లో ఇలాంటి ఘటన జరిగినట్లు తమ దృష్టికి రాలేదని కేంద్ర బృందం అభిప్రాయపడింది. దీనిపై కేంద్రం నుంచి నిపుణుల బృందాన్ని పంపి శాస్త్రీయంగా అధ్యయనం చేయించాలని సీఎం కోరారు. కేంద్రం నుంచి వచ్చిన అధికారుల బృందం రెండు బృందాలుగా విడిపోయి ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో పర్యటించింది. ఎన్‌డీఎంఏ సలహాదారు కల్నల్ కేపీ సింగ్ సారథ్యంలోని బృందాల్లో శాంతినాథ్, వివప్ప, మహేశ్ కుమార్, నాయల్‌కాన్సర్, రాకేశ్ మీనా, శశివర్థన్ రెడ్డి ఉన్నారు. సమావేశంలో సీఎంతోపాటు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతికుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, సంయుక్త కార్యదర్శి హరీశ్ ,ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవానికి రండి

» అమిత్ షా, కిషన్‌రెడ్డి, సంజయ్‌కు సీఎం ఆహ్వానం

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహించనున్న 'తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవం' కార్యక్రమానికి హాజరు కావాలంటూ నలుగురు కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. ఈమేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌లకు శుక్రవారం సీఎం లేఖలు పంపించారు. 1948 సెప్టెంబరు 17న తెలంగాణలో ప్రజాస్వామిక పాలన శకం ఆరంభమైన సందర్భాన్ని పురస్కరించుకుని 'తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవాన్ని' నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆ లేఖలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి కోరారు.

'సాచెట్' యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలి

» కేంద్ర బృందం సూచన

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులపై ముందుగానే అప్రమత్తం చేసేందుకు సాచెట్(sachet) యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని కేంద్ర బృందం సూచించింది. శుక్రవారం రాష్ట్రంలో జరిగిన వరద నష్టంపై కేంద్ర బృంద సభ్యులు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో సమావేశమయ్యారు. ఏదైనా విపత్తు సంభవించే సమయంలో ముందుగానే ఈ యాప్ ప్రజలను అప్రమత్తం చేస్తుందని వివరించారు. వరదలు, తుపాన్లు, వడగాల్పులు, కాలుష్యం, వంట గ్యాస్ ప్రమాదాలు, పిడుగులు, రసాయనాల లీకేజీల సమాచారాన్ని చేరవేయడం ద్వారా ఆయా ప్రాంతాల్లో ఉండే ప్రజలను కాపాడే అవకాశం ఉంటుందని వారు తెలిపారు.

భరోసా.. ఇకపై

పంట వేసిన రైతులకే..

(మొదటిపేజీ తరువాయి)

రైతుభరోసా కింద అనర్హులను చేర్చి సుమారు రూ.25 వేల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పటిదాకా 22 లక్షల మందికి, రూ.18 వేల కోట్ల మేరకు రుణమాఫీ కింద రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. గతంలో మాదిరిగానే రుణమాఫీ చేస్తున్నామని, ఎలాంటి నిబంధనలు విధించలేదన్నారు. రెండు లక్షలకు పైగా రుణం ఉన్న వారికి కూడా మాఫీ చేస్తామని తెలిపారు. అయితే రెండు లక్షలకు పైన ఎంత ఉంటే అంత బకాయిని రైతులు తమ ఖాతాల్లో జమ చేసుకుంటే తక్కిన రెండు లక్షల రుణాన్ని మాఫీ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఇంకా మూడు లక్షల మందికి రుణమాఫీ కావాల్సి ఉందని, వారందరితో పాటు తెల్ల రేషన్ కార్డులేని రైతులకు కూడా ఈ నెలాఖరులోపు మాఫీ చేస్తామని స్పష్టం చేశారు. రుణమాఫీపై బీఆర్ఎస్ నాయకుల తప్పుడు మాటలను నమ్మొద్దని రైతులకు సూచించారు. పంటలు సాగుచేసి నష్టపోరాదన్న సంకల్పంతో రైతుల పేర్లపై ప్రతీ ఎకరాకు బీమా ప్రీమియం చెల్లిస్తున్నామని చెప్పారు. శ్రీశైలం నిర్వాసితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బీచుపల్లి వద్ద ఆయిల్ ఫ్యాక్టరీని ఏడాదిలోపు అందుబాటులోకి తెస్తామని, పామాయిల్ తోటలను రైతులు పండించి లాభాలు గడించాలని ఆయన సూచించారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో 8 లక్షల కోట్లు అప్పుచేశారని, ఫలితంగా నేటి ప్రభుత్వం ఏటా రూ.60 వేల కోట్లు వడ్డీ చెల్లించాల్సి వస్తోంద న్నారు. గొప్పలకు పోయిన నాటి ప్రభుత్వం.. రింగురోడ్డు భూములను అమ్మి రైతు భరోసా డబ్బులను చెల్లించిందని విమర్శించారు.

టీచర్లకు హెల్త్ కార్డులపై త్వరలో కమిటీ: మంత్రి దామోదర

జోగిపేట, సెప్టెంబరు 13: 'రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఇందుకోసం త్వరలోనే ఒక కమిటీని నియమించి వారి సూచనలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళతాను' అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు.శుక్రవారం సంగారెడ్డి జిల్లా జోగిపేటలో నియోజకవర్గ ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా తమకు హెల్త్ కార్డులు కావాలని, అవసరమైతే తమ మూల వేతనంలో ఒక శాతం ప్రీమియం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వానికి చెప్పినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. దీనికి మంత్రి స్పందిస్తూ.. ఉపాధ్యాయ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. త్వరలోనే సీఎం నుంచి ప్రకటన వెలువడుతుందన్నారు. అలాగే, రాష్ట్రంలోని ప్రతీ పౌరుడికీ హెల్త్ కార్డు ఇవ్వాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉన్నదని, ఇందుకు సంబంధించి సాధ్యాసాధ్యాలపై ఒక అధికారిక కమిటీ ద్వారా విషయ సేకరణ జరుపుతామని పేర్కొన్నారు.

తెలంగాణకు తోడ్పాటు అందించండి

» ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు సహకరించండి

» నిజామాబాద్‌లో పసుపు యూనిట్ ఏర్పాటు చేయండి

» కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు



వాణిజ్యమండలి భేటీలో కేంద్ర మంత్రి పియూష్ గోయల్, ఇతర రాష్ట్రాల మంత్రులతో శ్రీధర్‌బాబు

హైదరాబాద్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రానున్న పదేళ్లలో ట్రిలియన్ డాలర్ల వార్షిక ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ప్రగతి బావుటాను ఎగురవేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి సంకల్పానికి కేంద్ర ప్రభుత్వం విశాల దృక్పథంతో మద్దతు ఇవ్వాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. శుక్రవారం ముంబైలో జరిగిన జాతీయ వాణిజ్య మండలి సమావేశంలో పాల్గొన్న ఆయన.. రాష్ట్ర ప్రభుత్వ వ్యూహాత్మక ప్రణాళికలు, లక్ష్యాలను వివరించారు. కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో.. వాణిజ్య విధానాలు, వ్యాపార అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులపై చర్చించారు. సమావేశంలో పలు రాష్ట్రాల వాణిజ్య శాఖల మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్రాలకు నిధులు సమకూర్చేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిన టైస్ (ట్రేడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ ఎక్స్‌పోర్ట్ స్కీం), సంప్రదాయ పరిశ్రమల పథకాలకు కేంద్రం నిధులు ఇవ్వకపోవడంతో విఫలమయ్యాయని తెలిపారు. తెలంగాణ అవసరాలను ప్రత్యేక దృష్టితో పరిశీలించి తోడ్పాటు అందించాలని కేంద్రాన్ని కోరారు. నిజామాబాద్ జిల్లాలో పసుపు ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఖమ్మం లేదా మహబూబాబాద్‌లో మిర్చిని త్వరితగతిన ఎండబెట్టే ప్లాంటును ఏర్పాటు చేస్తే నాణ్యత పెరిగి ఎగుమతులకు గిరాకీ పెరుగుతుందని వివరించారు. నిజామాబాద్ లేదా వరంగల్‌లో సుగంధ ద్రవ్యాల ప్రయోగశాలలను ఏర్పాటు చేసి నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరారు. పండ్లు, కూరగాయల నిల్వ సమయం పెంచేందుకు ఇరాడియేషన్ ప్లాంటు ఏర్పాటుకు సరిపడా నిధులు విడుదల చేస్తే ఆహార వ్యర్థాన్ని నివారించవచ్చన్నారు. తొందరగా పాడయ్యే పాలు, గుడ్లు, కూరగాయలు ఎగుమతి చేసేందుకు వీలుగా శీతల రవాణా, కోల్డ్ స్టోరేజి సదుపాయాలను కల్పించాలన్నారు. సోనా మసూరి బియ్యానికి జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగింగ్‌ను సమకూర్చాలని, పారిశ్రామిక వాడల సమీపంలో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కులు, కరీంనగర్ లేదా వరంగల్‌లో గ్రానైట్ ప్రాసెసింగ్ యూనిట్లు, తెలంగాణ ఎగుమతుల్లో ఔషధాలు, వ్యాక్సిన్లు, రసాయనాలు, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్ ముఖ్యమైన భూమికను పోషిస్తున్నాయని, ఈ రంగాలను మరింత బలోపేతం చేసేందుకు కేంద్రం సహకారం అవసరమన్నారు. రాష్ట్రంలో వస్త్రాల ఉత్పత్తి, ప్లాస్టిక్, పాలిమర్స్, వైద్య పరికరాల తయారీకి అనుకూల వాతావరణం ఉందని, కేంద్రం మద్దతిస్తే ఆయా రంగాలు వేగంగా వృద్ధి చెంది ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

పునరుత్పాదక విద్యుత్తుకు ప్రణాళికలను సిద్ధం చేయండి

» గ్రీన్‌ఎనర్జీలో మహిళా సంఘాలు, రైతులకు భాగస్వామ్యం: భట్టి



హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్తు (గ్రీన్ ఎనర్జీ)ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసేందుకు వెంటనే ప్రణాళికలను సిద్ధ చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పెంపుదల, వివిధ వర్గాలకు ఆదాయం సమకూర్చడంపై శుక్రవారం ఆయన అధికారులతో సుదీర్ఘంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొన్ని ప్రత్యేక గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకొని ఆయా గ్రామాల్లో ఉన్న రైతుల వ్యవసాయ పంపుసెట్లకు సంపూర్ణంగా ప్రభుత్వ ఖర్చులతో సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తద్వారా వచ్చే విద్యుత్తును పవర్ గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. దీనిద్వారా రైతులకు పంటలపై ఆదాయమే కాకుండా ప్రతి ఏటా సౌర విద్యుత్ ద్వారానూ ఆదాయం సమకూరుతుందన్నారు. దీంతోపాటు కొన్ని ఎంపిక చేసిన గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద గృహాలకు ప్రభుత్వ ఖర్చులతో సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా సీఎం రేవంత్ స్వగ్రామమైన కొండారెడ్డి పల్లి, మధిర నియోజకవర్గంలోని సిరిపురంతో పాటు.. రాష్ట్రవ్యాప్తంగా మరో 20 గ్రామాలను ఎంపిక చేసుకొని ముందుకుపోవాలని ఆదేశించారు. సౌర విద్యుత్‌తో ఆయా గ్రామస్తులకు ఆదాయాన్ని సమకూర్చడమే ప్రభుత్వం లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని ఎంపిక చేసిన స్వయం సహాయక సంఘాలకు ఐదు నుంచి పది మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పెట్టుకోవడానికి వారిని ప్రోత్సహించాలని ఆదేశించారు. సౌర విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడానికి స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకు నుంచి రుణాలు ఇప్పించాలని సూచించారు. ఈ ప్లాంట్ల నుంచి వచ్చే విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు.

కృష్ణా జలాల వినియోగాన్ని సమీక్షించొద్దు

» బ్రిజేశ్ ట్రైబ్యునల్‌లో ఏపీ రీజాయిండర్ దాఖలు

» సమీక్షించాలన్న తెలంగాణ... నెలాఖరులో విచారణ

హైదరాబాద్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్‌లో పాత ప్రాజెక్టుల కింద నీటి వినియోగానికి రక్షణ ఉందని, ఆ అంశాన్ని సమీక్షించడం సరికాదని బ్రిజేశ్ ట్రైబ్యునల్ ఎదుట ఆంధ్రప్రదేశ్ పేర్కొంది. కాలానుగుణంగా వినియోగాన్ని సమీక్షించాల్సిందేనని తెలంగాణ విజ్ఞప్తి చేసింది. కృష్ణా జలాల పంపిణీపై జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే స్టేట్‌మెంట్ ఆఫ్ కేసు(ఎస్‌వోసీ)లు దాఖలు చేశాయి. వాటిపై రెండు రాష్ట్రాలు కౌంటర్లు, రీజాయిండర్లు సమర్పించాయి. బచావత్ ట్రైబ్యునల్ ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల కృష్ణా జలాలను గంపగుత్తగా కేటాయించిందని, ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణతో రెండు రాష్ట్రాలు ఏర్పడినందున బేసిన్ పారామీటర్‌ను పరిగణనలోకి తీసుకొని నీటి కేటాయింపులు చేయాలని తెలంగాణ కోరింది. కాలానుగుణంగా సమీక్ష చేయాల్సిందేనని విజ్ఞప్తి చేసింది. ఏపీ మాత్రం దీన్ని వ్యతిరేకించింది. ఇప్పటికే ఉన్న వినియోగాన్ని సమీక్షించరాదని నివేదించింది. దీనికి తెలంగాణ బదులిస్తూ కృష్ణా జలాలను బేసిన్ లోపలి ప్రాంతాలకే కేటాయించాలని, తెలంగాణ అవసరాలను కాదని.. ఇతర బేసిన్లకు నీటిని తరలించడం సరికాదని పేర్కొంది. పోలవరం ద్వారా కృష్ణా డెల్టాకు తరలించే 80టీఎంసీలకు బదులుగా.. సాగర్ ఎగువన ఉన్న ప్రాంతాలు 80 టీఎంసీలను వాడుకోవచ్చని, ఆ వాటాలోని 45టీఎంసీలనే పాలమూరు-రంగారెడ్డికి తెలంగాణ కేటాయించుకుందని ఏపీ గుర్తు చేసింది. ఆ నీటిపై ఉమ్మడి ఏపీకి అధికారం ఉందని నివేదించింది. ఆ జలాలపై తమకే పూర్తి అధికారం ఉందని తెలంగాణ బదులిచ్చింది. చర్చించే అంశాలపై ఇప్పటికే స్పష్టత రావడంతో ఈ నెలాఖరులో ట్రైబ్యునల్ విచారణ ప్రారంభం కానుంది.

దాడిచేసిన వారిని వదిలేసి బీఆర్ఎస్ నేతల అరెస్టులా?: కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒక ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేసిన వారిని వదిలేసి.. తమ పార్టీ నేతలను అరెస్టు చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రజాపాలనలో ప్రతిపక్షాలు మీటింగ్ పెట్టుకోవటానికి కూడా అనుమతి లేదా? అని శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలంటే సర్కారుకు ఎందుకింత భయమో చెప్పాలన్నారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ తీరును రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారని, ప్రశ్నించే ప్రజాప్రతినిధులపై దాడులకు తెగబడటం దుర్మార్గమని పేర్కొన్నారు. తెలంగాణలో గతంలో లేనివిధంగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులకు దిగే సంస్కృతిని తీసుకొచ్చారని మండిపడ్డారు. తెలంగాణ ప్రతిష్ఠకు హాని చేసేలా ప్రవర్తిస్తామంటే బీఆర్ఎస్ పార్టీ సహించదని హెచ్చరించారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిచేసిన అరికెపూడి గాంధీ, ఆయన అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నాయకుల ఇళ్లపై దాడులు చేయిస్తూ.. అక్రమ నిర్బంధాలతో సీఎం రేవంత్‌రెడ్డి వికృత రాజకీయాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఆరోపించారు. దాడుల సంస్కృతిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, బీఆర్ఎస్ పాలనలో ఇలాంటి దాడులు జరిగాయా? అని నిలదీశారు. సీఎం రేవంత్ విధ్వంసకర పరిపాలన హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తోందన్నారు.

ఎమ్మెల్యేలా.. లేక వీధి రౌడీలా?:కూనంనేని

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 13: తెలంగాణలో కొంతమంది ఎమ్మెల్యేలను చూస్తుంటే.. అసలు వీరు ఎమ్మెల్యేలా.. లేక వీధి రౌడీలా? అనిపిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా పెద్దబొంకూరు గ్రామంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, అరికెపూడి గాంధీ.. ఇద్దరూ సవాళ్లు, ప్రతి సవాళ్లతో రాజకీయాన్ని రోడ్డుపాలు చేస్తున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ ఎమ్మెల్యేల చేరికలు జరిగాయని, ఈ విధానాన్ని నేర్పిందే ఆ పార్టీ అధినేత అని వ్యాఖ్యానించారు. గెలుపొందిన ఎమ్మెల్యేలు ఇతర పార్టీలో చేరితే వారి సభ్యత్వం పూర్తిగా రద్దు చేయాలని, ఆ విధంగా చట్టాలు తీసుకురావాలన్నారు. మావోయిస్టులను మార్చి 2026 నాటికి తుడిచిపెడుతామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పేర్కొనడం సమంజసం కాదన్నారు. మావోయిస్టులు సైతం దేశ భక్తులేనని పేర్కొన్నారు.

ఈ నాటకాన్ని నడుపుతున్న ఉత్తమ దర్శకుడు ఎవరో?

» కౌశిక్-గాంధీ వివాదంపై బీజేపీ సెటైర్

హైదరాబాద్, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మధ్య కొనసాగుతున్న వివాదంపై బీజేపీ శుక్రవారం స్పందించింది. 'ఈ నాటకాన్ని నడుపుతున్న ఉత్తమ దర్శకుడు ఎవరో ?' అనే క్యాప్షన్‌తో సోషల్ మీడియాలో ఓ ఆసక్తికర ఫొటోను పోస్ట్ చేసింది. ఓ చేతిలో చీర, మరో చేతిలో గాజులు పట్టుకుని ఉన్న కౌశిక్‌రెడ్డిని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని పోలిన వ్యక్తి ఆడిస్తున్నట్టుగా రూపొందించిన ఆ ఫొటో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించొద్దు

» కమిషనర్లకు డీజీపీ ఆదేశం

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల చట్టప్రకారం కఠినంగా వ్యవహరించాలని కమిషనర్లకు డీజీపీ జితేందర్ ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయంగా ఘర్షణ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లతో డీజీపీ శుక్రవారం ఉదయం సమీక్ష నిర్వహించారు. మూడు కమిషనరేట్ల పరిధిలో శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిని ఏ మాత్రం సహించేది లేదన్నారు. ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని విధి నిర్వహణలో పోలీసులకు సహకారం అందించాలని డీజీపీ కోరారు.

మాదిగలను దగా చేసేందుకే ఉత్తమ్ కమిటీ: ఎర్రోళ్ల

హైదరాబాద్, బర్కత్‌పుర, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ కోసం వేసిన కమిటీకి చైర్మన్‌గా ఉత్తమ్‌కుమార్ రెడ్డిని నియమించడం మాదిగలను దగా చేయడమేనని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన దామోదర రాజనరసింహ ఉండగా.. మరో సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని చైర్మన్ చేయడం తగదన్నారు. కాగా, ఎస్సీ వర్గీకరణ అమలుపై ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి డిమాండ్ చేసింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ జి. చెన్నయ్య, కో-కన్వీనర్లు బూర్గుల వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు. మంత్రుల కమిటీలో ఒక్క మాల మంత్రి లేకుండా కమిటీని ఎలా నియమిస్తారని ప్రశ్నించారు.

పంచాయతీ ముసాయిదా ఓటరు జాబితా విడుదల

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం గ్రామపంచాయతీ, వార్డులవారీగా ముసాయిదా ఓటరు జాబితాను రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఎంపీడీవోలు విడుదల చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) విడుదల చేసిన జాబితా ఆధారంగా ఆయా పంచాయతీ, వార్డుల వారీగా ఓటర్లను విభజిస్తూ జాబితాను సిద్ధం చేశారు. అన్ని గ్రామ పంచాయతీలతో ముసాయిదా ఓటరు జాబితాను మండలాల వారీగా ప్రచురించారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, సవరణల కోసం దరఖాస్తుల స్వీకరణకు శనివారం నుంచి 21వ తేదీ వరకు గడువు ఇచ్చారు. పంచాయతీ, వార్డులవారీగా తుది ఓటరు జాబితాను ఈ నెల 28న వెలువరించనున్నారు.

మదర్ డెయిరీ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా..!

» 6 డైరెక్టర్ స్థానాలు హస్తం మద్దతుదారులవే..నేడు చైర్మన్ ఎన్నిక

హయత్‌నగర్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం మదర్ డెయిరీలో ఖాళీ అయిన 6 డైరెక్టర్ల స్థానాల ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులు గెలుపొందారు. బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులపై స్పష్టమైన మెజార్టీతో విజయం సాధించారు. మదర్ డెయిరీలో మొత్తం 297 ఓట్లున్నాయి. నల్లగొండ జిల్లాకు చెందిన 4 డైరెక్టర్ స్థానాల్లో గుడిపాటి మధుసూదన్‌రెడ్డి 229 ఓట్లు, కల్లెపల్లి శ్రీశైలం 222 ఓట్లు, పుప్పాల నరసింహులు 181 ఓట్లు, బత్తుల నరేందర్‌రెడ్డి 177 ఓట్లు సాధించి గెలవగా.. రంగారెడ్డి జిల్లాకు చెందిన 2 స్థానాల్లో అగ్రాల నరసింహారెడ్డి 242 ఓట్లు, మండలి జంగయ్య 237 ఓట్లు పొంది విజయం దక్కించుకున్నారు. గతంలో ఉన్న 9 మంది పాలక వర్గం సభ్యులు, కొత్తగా ఎన్నికైన 6 మంది పాలకవర్గ సభ్యులతో శనివారం మదర్ డెయిరీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నూతన చైర్మన్‌ను ఎన్నుకుంటారని ఎన్నికల అధికారి వెంకటరెడ్డి తెలిపారు. మదర్ డెయిరీ 6 డైరెక్టర్ స్థానాలను దక్కించుకునేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు తీవ్రంగా శ్రమించారు. గత దశాబ్ద కాలంగా మదర్ డెయిరీ చైర్మన్ పదవి బీఆర్ఎస్ ఖాతాలోనే ఉంది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. రెండు పార్టీల నేతలు తమ సానుభూతిపరులను గెలిపించుకోవడానికి వారం రోజులుగా క్యాంపులు నిర్వహించారు. ప్రభుత్వ విప్, కాంగ్రెస్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వ్యూహాత్మకంగా పావులు కదపడంతో 6 స్థానాలు కాంగ్రెస్ మద్దతుదారులే గెలుపొందారు. అదే ఉత్సాహంతో మదర్ డెయిరీ చైర్మన్ పదవిని 'చే'జిక్కుంచుకునేందుకు ఆయన ఎత్తులు వేస్తున్నారు.

పోలీస్ కంప్లయింట్స్ అథారిటీ ఏర్పాటుపై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పోలీస్ కంప్లయింట్స్ అథారిటీల ఏర్పాటుపై వివరణ ఇవ్వాలని చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ వినోద్ కుమార్ ధర్మాసనం ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ అథారిటీలను ఏర్పాటు చేయాలంటూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయడం లేదని పేర్కొంటూ కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలైంది. దీనిపై వివరణ ఇవ్వాలని చీఫ్ సెక్రటరీ, హోం శాఖ సెక్రటరీ, డీజీపీలకు ధర్మాసనం నోటీసులు ఇచ్చింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

ఆయన చేర్చుకోలేదట



2014 నవంబరులో కాంగ్రెస్ ఎమ్మెల్యే కాలె యాదయ్యను పార్టీలో చేర్చుకుంటున్న నాటి సీఎం కేసీఆర్



కేసీఆర్ ఎవరికీ కండువా కప్పలేదు

» కప్పినట్టు చూపితే రాజీనామా చేస్తా: కౌశిక్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): "గత పదేళ్లలో ఒక్క ఎమ్మెల్యేకూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యక్తిగతంగా పార్టీ కండువా కప్పలేదు. అలా కప్పినట్టుగా చూపితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా" ..బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇటీవల మీడియాతో అన్న మాటలివి. కానీ, 2014 నవంబరు 16న.. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే కాలె యాదయ్యను నాటి సీఎం కేసీఆర్ స్వయంగా కండువా కప్పి బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. అన్ని పార్టీలవారూ బంగారు తెలంగాణ కోసం తమతో చేతులు కలపాలని కేసీఆర్ మీడియా ముందు అన్నారు! "మరి.. ఇది పార్టీలో చేర్చుకోవడం కాదా? కేసీఆర్ ఎవరికీ కండువా కప్పలేదని ఎలా అంటారు?" అని సోషల్‌మీడియాలో విమర్శిస్తున్నారు.

వాళ్లల్లో వాళ్లే కొట్టుకుంటున్నారు

బీఆర్ఎస్ నేతలు నిర్మాణాత్మక ప్రతిపక్షపాత్ర పోషించట్లే: మల్లు రవి



హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయాక నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించట్లేదని, వారిలో వారే కొట్టుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. పోలీసులపైనే దాడులు చేస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి చర్యల ద్వారా హైదరాబాద్‌కు ఐటీ కంపెనీలు, పెట్టుబడులు రాకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ఇలా వ్యవస్థలపై దాడులు చేయలేదన్నారు.

ఈయన చేరలేదట

అది కాంగ్రెస్ కండువా కాదు

సీఎం కప్పింది ఆలయ శాలువా: అరికెపూడి



హైదరాబాద్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాకు కప్పింది కాంగ్రెస్ కండువా కాదు. ఆలయానికి సంబంధించిన శాలువా" ..శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఇటీవల చేసిన వ్యాఖ్యలివి! కానీ.. సీఎం రేవంత్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్టు జూలై 13న తెలంగాణ కాంగ్రెస్ 'ఎక్స్' ఖాతాలో ట్వీట్ చేసింది! గాంధీతోపాటు కార్పొరేటర్లు నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డి, నార్నె నివాస్ తదితరులూ సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు అందులో స్పష్టంగా పేర్కొంది! అరికెపూడి గాంధీకి రేవంత్ కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఫొటోనూ పోస్ట్ చేసింది. గాంధీ వ్యాఖ్యల నేపథ్యంలో ఆ ట్వీట్‌ను నెటిజన్లు గుర్తుచేస్తున్నారు.



గాంధీకి రేవంత్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్టు తెలంగాణ కాంగ్రెస్ ట్వీట్

ఆగని రగడ

(మొదటిపేజీ తరువాయి)

నెలకొంది. కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్‌రావు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు సహా ముఖ్య నాయకులందరినీ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల నేతలను కూడా అక్కడే హౌస్ అరెస్టు చేశారు. పలువురు నేతలు గృహనిర్బంధం నుంచి బయటికి వచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. మరోవైపు ఎమ్మెల్యే గాంధీ ఇంటివద్ద భారీగా బలగాలను మోహరించి భద్రత కల్పించారు. అయినా.. రెండో రోజు కూడా కౌశిక్‌రెడ్డి, గాంధీ మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు కొనసాగాయి. తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానంటున్న గాంధీ ఇంటికి వెళ్లి ఆయనకు పార్టీ కండువా కప్పుతానని, ఆయన ఇంటిపై పార్టీ జెండాను ఎగురవేస్తానని కౌశిక్‌రెడ్డి ప్రకటించడంతో గురువారం ఇరువురి మధ్య రగడ మొదలైన విషయం తెలిసిందే. కౌశిక్‌రెడ్డి తన ఇంటికి రాకపోతే తానే ఆయన ఇంటికి వెళతానంటూ గాంధీ తన అనుచరులు, కార్యకర్తలతో కలిసి కొండాపూర్‌లోని కౌశిక్ ఇంటికి వెళ్లడంతో జరిగిన ఘర్షణ ఉద్రిక్తతకు కారణమైంది.

కౌశిక్‌రెడ్డి, శంభీపూర్ రాజు హౌస్ అరెస్ట్..

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి గాంధీకి ఇంటికి వెళ్తామని, అక్కడ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తామని కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. దుండిగల్ మునిసిపాలిటీ శంభీపూర్‌లోని రాజు ఇంటి వద్ద మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం ఉదయం నుంచే భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ విధించి ఆయన ఇంటివద్దకు బీఆర్ఎస్ నాయకులు రాకుండా కట్టడి చేశారు. అయినప్పటికీ ఉదయం 10.30 గంటలకు కౌశిక్‌రెడ్డి.. శంభీపూర్‌రాజు ఇంట్లో ప్రత్యక్షమయ్యారు. వాస్తవానికి కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసం వద్ద కూడా పోలీసులు భారీగా మోహరించి ఆయన బయటికి రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే.. కౌశిక్‌రెడ్డి గురువారం అర్ధరాత్రే పోలీసుల కళ్లుగప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయినట్లు, తెల్లవారుజామునే శంభీపూర్ రాజు ఇంటికి వచ్చి అక్కడే నిద్రించినట్లు తెలిసింది. కాగా, శుక్రవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో శంభీపూర్ రాజు, కౌశిక్‌రెడ్డితోపాటు కొంతమంది నాయకులు, కార్యకర్తలు గాంధీ ఇంటికి బయలు దేరేందుకు ప్రయత్నించగా.. పోలీసులు గేటు లోపలనే ఇరువురిని అదుపులోకి తీసుకుని హౌస్ అరెస్ట్ చేశారు.

ఎమ్మెల్యేలు, నేతల అరెస్టులు..

గ్రేటర్ హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులను కూడా పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, మాగంటి గోపీనాథ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, బండారి లక్ష్మారెడ్డిలను వారి నివాసాల్లో గృహనిర్బంధం చేశారు. వారితోపాటు ఇతర ముఖ్యనేతలను బీఆర్ఎస్ కార్పొరేటర్లను కూడా ఎక్కడికక్కడ హౌస్



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న కౌశిక్‌రెడ్డి



తన నివాసంలో మీడియాతో మాట్లాడుతున్న అరికెపూడి గాంధీ

అరెస్టు చేశారు. పరిగిలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డిని, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. కాగా, అరికెపూడి గాంధీపై చర్యలు తీసుకోవాలంటూ సిరిసిల్లలో చేనేత చౌక్ వద్ద బీఆర్ఎస్వీ నాయకులు ధర్నా నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని గోదావరి బ్రిడ్జిపై రాస్తారోకో చేశారు. ఓదెల మండలంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్‌ను పార్టీ కార్యాలయంలో నిర్బంధించారు.

పోలీస్ భద్రత నడుమ ఆస్పత్రికి హరీశ్‌రావు

కోకాపేట్‌లోని తన నివాసంలో హౌస్ అరెస్టయిన బీఆర్ఎస్ కీలక నేత హరీశ్‌రావు శుక్రవారం ఆస్పత్రికి కూడా పోలీసుల భద్రత నడుమ వెళ్లాల్సివచ్చింది. గురువారం సైబరాబాద్ కమిషనరేట్ నుంచి ఇతర బీఆర్ఎస్ నాయకులతోపాటు హరీశ్‌రావును అరెస్టు చేసి తరలించే క్రమంలో ఆయన భుజానికి గాయమైనట్లు తెలిసింది. దీనికి తాను చికిత్స తీసుకోవాలని హరీశ్‌రావు పోలీసులకు చెప్పడంతో వారే ఆయనను వెంటబెట్టుకొని గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. వారి భద్రత నడమనే హరీశ్‌రావుకు చికిత్స అందించారు. అంతకుముందు హరీశ్‌రావును కలిసేందుకు ఆయన నివాసానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోతు కవితను పోలీసులు అడ్డుకున్నారు. వారిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కౌశిక్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి: దానం

కౌశిక్‌రెడ్డి చేసిన ఆంధ్ర, తెలంగాణ వ్యాఖ్యలను తాము చాలా సీరియస్‌గా తీసుకుంటామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. కౌశిక్‌రెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం అరికెపూడి గాంధీకి మద్దతుగా నాగేందర్ ఆయన ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డిని కంట్రోల్ చేయాల్సిన బాధ్యత బీఆర్ఎస్ సీనియర్ నాయకుడైన హరీశ్‌రావుకు ఉందన్నారు. ఆయనకు చేతకాకుంటే ఎలా కంట్రోల్ చేయాలో తమకు తెలుసునన్నారు. మరోవైపు జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కూడా గాంధీకి మద్దతుగా ఆయన ఇంటికి వచ్చారు. మీడియాలో పబ్లిసిటీ కోసమే కౌశిక్‌రెడ్డి డ్రామాలు చేస్తున్నాడని ఆయన అన్నారు. ప్లాన్ ప్రకారమే బీఆర్ఎస్ ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తోందని, నగరాభివృద్ధిని అడ్డుకోవడమే బీఆర్ఎస్ లక్ష్యంగా కనిపిస్తోందని ఆరోపించారు.

ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఇంటి వద్ద మూడంచెల భద్రత..

ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఇంటి వద్ద కూడా ఉదయం నుంచే పోలీసులు భారీ భద్రత కల్పించారు. బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో 200 మంది పోలీసులతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. గాంధీ ఇంటికి వెళ్లే అన్ని రహదారులను మూసి వేశారు. కేవలం ఆ కాలనీలో నివాసముండే వారిని మాత్రమే అనుమతించారు. మధ్యాహ్నం సమయంలో వివేకానందనగర్ డివిజన్‌కు చెందిన కొంతమంది బీఆర్ఎస్ నాయకులు గాంధీ ఇంటిని ముట్టడించేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అప్రమత్తమై వారిని అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు గాంధీ ఇంటి ముట్టడికి బీఆర్ఎస్ నాయకులు వచ్చిన విషయం తెలుసుకున్న ఆయన అభిమానులు ఒక్కసారిగా వారి వద్దకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు అడ్డుకుని వారిని శాంతింపజేశారు. ఇదిలా ఉండగా.. కౌశిక్‌రెడ్డితో కలిసి తన ఇంటికి వస్తానన్న బీఆర్ఎస్ నాయకుల కోసమంటూ గాంధీ తన నివాసంలో ఉదయం పూట కుర్చీలు వేసి వారికి టిఫిన్లు ఏర్పాటు చేశారు.



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ మహిళా నాయకులు

హైదరాబాద్‌కు పెట్టుబడులు రాకుండా కుట్ర..

» అందుకే బీఆర్ఎస్ నేతలు భయానక వాతావరణం సృష్టిస్తున్నారు

» కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను హరీశ్, కేటీఆర్ ఎందుకు ఖండించట్లేదు..?

» కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆగ్రహం..

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు పెట్టుబడులు రాకుండా భయానక వాతావరణాన్ని సృష్టించేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మండిపడ్డారు. ఆంధ్రా సెటిలర్లపై కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను కేటీఆర్, హరీశ్‌రావులు ఎందుకు ఖండించ లేదంటూ నిలదీశారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యల వెనుక కుట్ర ఉందని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డీజీపీని కోరారు. శుక్రవారం సీఎల్పీ మీడియా హాల్లో పార్టీ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మేఘారెడ్డి, నాగరాజు, చిక్కుడు వంశీకృష్ణ, మేడిపల్లి సత్యంలతో కలిసి రేపూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడారు. 'మహిళలను కించపరుస్తూ మొదట మాట్లాడింది.. గాంధీ ఇంటికి వస్తానని రెచ్చగొట్టిందీ కౌశిక్‌రెడ్డే.. కేటీఆర్, హరీశ్‌ల దుర్మార్గ ఆలోచనల్లో భాగంగానే కౌశిక్ మాట్లాడారు. పీఏసీ పదవిని ఆనవాయితీ ప్రకారం ప్రతిపక్ష పార్టీకే ఇచ్చాం. డీజీపీని రాజకీయాల్లోకి లాగడం అనైతికం. ఆయనకు బీఆర్ఎస్ నేతలు క్షమాపణలు చెప్పాలి' అని డిమాండ్ చేశారు. మహిళల ఆత్మగౌరవం దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసిన కౌశిక్‌రెడ్డిని వెంటనే బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కౌశిక్‌రెడ్డిని ముందు పెట్టి హరీశ్ రాజకీయం చేస్తుంటే.. అమెరికాలో ఉండి ట్వీట్లు పెడుతూ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని కేటీఆర్ దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగరాజు మాట్లాడుతూ.. హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డి తాటాకు చప్పుళ్లకు పోలీసులు భయపడబోరని, చట్టపరంగా వ్యవహరిస్తారన్నారు.

కౌశిక్‌రెడ్డిపై అనర్హత వేటు వేయండి..

మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై అనర్హత వేటు వేయాలని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కాంగ్రెస్ మహిళా నేతలు కోరారు. ఈ మేరకు మంత్రుల క్వార్టర్స్‌లోని స్పీకర్ నివాసంలో ప్రసాద్ కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

సీఎం డైరెక్షన్‌లో నన్ను హత్య చేసే కుట్ర: కౌశిక్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన హైడ్రా వెనుక ఏపీ సీఎం చంద్రబాబు ఉన్నారని హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ట్రాప్‌లో పడిన సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడ నుంచి పెట్టుబడులను అమరావతికి తీసుకపోతున్నారని ఆరోపించారు. హైడ్రా పేరుతో హైదరాబాద్ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని, హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాలంటే భయపడే పరిస్థితి తీసుకొచ్చారని అన్నారు. ఆంధ్రా సెటిలర్స్ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని, ఆంధ్రావాళ్లు అని తాను అనలేదని తెలిపారు. ఎక్కడైనా ఆంధ్రా అనే పదం వాడి ఉంటే.. అది తనకు, గాంధీకి వ్యక్తిగతమేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో తనను హత్య చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. వారిలా దాడులు చేయడం తమకు పెద్ద విషయమేమీ కాదని, అయితే వాళ్లు చేసిన తప్పులు మనం చేయవద్దని కేసీఆర్ అనడంతో సంయమనం పాటిస్తున్నామని చెప్పారు. దానం నాగేందర్‌కు నిజంగా పౌరుషం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఖైరతాబాద్‌లో ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు.



ఎమ్మెల్యే గాంధీ నివాసం వద్ద కౌశిక్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న గాంధీ మద్దతుదారుల అరెస్టు

నా ఇంటిపై జెండా ఎగరేసేందుకు కౌశిక్ ఎవడు?: గాంధీ

కౌశిక్‌రెడ్డిపై తాను నోరు జారింది వాస్తవమేనని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. అయితే కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ప్రతిగానే తాను అలా పరుష పదజాలంతో మాట్లాడాల్సి వచ్చిందన్నారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు తనను బాధించాయన్నారు. తన ఇంటిపై జెండా ఎగరేసేందుకు కౌశిక్‌రెడ్డి ఎవరని ప్రశ్నించారు. మహిళా గవర్నర్‌ను అవమానించిన చరిత్ర అతనిదని అన్నారు. చీర, గాజుల గురించి మాట్లాడి తల్లి, చెల్లి, భార్యను అవమానించాడని, ప్రాంతీయ విబేధాలు తీసుకొచ్చాడని మండిపడ్డారు. అతడి మాటలతో ఆంధ్రవాళ్ల మనోభావాలు దెబ్బతిన్నాయని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఏపీలో బీఆర్ఎస్ పార్టీ పెట్టినప్పుడు మీకు ప్రాంతాలు గుర్తుకు రాలేదా? అని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రం ఏమైనా కౌశిక్‌రెడ్డి అయ్య జాగీరా? అని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డి వ్యవహారశైలి కారణంగా బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు మచ్చ వస్తుందని, అతని లాంటి వారితోనే బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయిందని ఆరోపించారు. "బ్రోకర్, కోవర్టును ఊరు మీద కు వదిలారు. అమెరికా నుంచి ఫోన్‌లో హెచ్చరికలు రావడంతోనే ఈ రోజు తగ్గి మాట్లాడాడు. నా భాష గురించి మాట్లాడుతున్న హరీశ్‌రావు గతంలో ప్రభుత్వ అధికారులైన ఐఏఎస్, ఐపీఎస్‌లపై మాట్లాడిన మాటలను గుర్తు చేసుకోవాలి" అని అన్నారు. తాను ఏ పార్టీలో ఉన్నాననే దానిపై స్పీకర్ క్లారిటీ ఇచ్చారని తెలిపారు.

దాడి చేయించింది సీఎం, డీజీపీ కాదా?


» మేం ఫిర్యాదు చేసేందుకు వెళ్తే అరెస్టులా?

» హత్యాయత్నం చేసిన వారికి బందోబస్తా?

» రేవంత్‌దృష్టి పైసలపైనే.. పాలనపై లేదు

» మీడియాతో మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్/నార్సింగ్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): "ఎమ్మెల్యే గాంధీకి బందోబస్తు ఇచ్చి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేయించింది రేవంత్‌రెడ్డి, డీజీపీ కాదా? హత్యాయత్నం చేసిన గాంధీని, ఆయన అనుచరులను మాత్రం బందోబస్తు మధ్య ఇంటికి పంపుతారా? మేం ఫిర్యాదు చేసేందుకు వెళ్తే అరెస్టు చేస్తారా? రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయా?" అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. కోకాపేటలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం



రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లోనే గురువారం కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి జరిగిందని ఆరోపించారు. తెలంగాణ ఖ్యాతిని పాడు చేయొద్దని, పోలీసుల గౌరవాన్ని తగ్గించొద్దని.. తాము సంయమనం పాటించామన్నారు. కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు చేయడానికి వెళ్తే అరెస్టు చేసి.. మహబూబ్‌నగర్ అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లారని దుయ్యబట్టారు. తమకు కనీసం నీళ్లు ఇవ్వకుండా తిప్పిన పోలీసులు.. దాడులు చేసిన వాళ్లను కూర్చోబెట్టి బిర్యానీలు తినిపించారని విమర్శించారు. పోలీసులను అడ్డం పెట్టుకొని తమ ఎమ్మెల్యేపై దాడి చేసినప్పుడు రేవంత్‌కు, డీజీపీకి లా అండ్ ఆర్డర్ గుర్తు రాలేదా? అని నిలదీశారు. సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి రెచ్చగొట్టేలా మాట్లాడితే.. ఆ పార్టీ కార్యకర్తలు కూడా అలాగే చేస్తారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన నడుస్తోందని ధ్వజమెత్తారు. తెలంగాణలో అరాచక పాలన గురించి రాహుల్‌గాంధీ మాట్లాడాలని డిమాండ్ చేశారు. దేశం బయట స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల గురించి మాట్లాడడం కాదని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలపై మాట్లాడాలని సూచించారు. పీఏసీ చైర్మన్ పదవికి ఎన్నిక జరిగిందని రేవంత్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి హైకోర్టు మొట్టికాయలు వేయడంతో రేవంత్ కొత్త డ్రామాకు తెరలేపారని ఆరోపించారు. తొమ్మిది నెలలుగా పాలనపై కాకుండా.. పైసలపైనే దృష్టి పెట్టారని విమర్శించారు. కరీంనగర్ నుంచి వచ్చి హైదరాబాద్‌లో పెత్తనం ఏంటని కౌశిక్‌రెడ్డిని గాంధీ నిలదీయడంతోనే సెటిలర్ అంటూ కౌశిక్ మాట్లాడాల్సి వచ్చిందన్నారు. ఆంధ్రా నాయకుల మీద రేవంత్ కపట ప్రేమను ఒలకబోస్తున్నారని పేర్కొంటూ గతంలో చినజీయర్‌ను, యాదాద్రి ప్లాన్ ఇచ్చిన ఆనంద్ సాయిని ఆంధ్రోళ్లు అని సంబోధించిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ తాము ఇలాంటి నిర్బంధాలు చూడలేదన్నారు. ఉన్నతమైన స్థానంలో ఉన్న డీజీపీ.. ప్రతిపక్షాల గొంతు నొక్కేలా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. గుడ్డిగా రేవంత్ ఆదేశాలను అమలు చేయడం మాని.. విచక్షణతో పని చేయాలని, చట్ట ప్రకారం నడుచుకోవాలని పోలీసులను కోరారు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ శ్రేణులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురువారం నాటి తోక్కిసలాటలో భుజం నొప్పి మొదలైందని, ఎమ్మారై స్కాన్ తీసి 15 రోజుల పాటు ఫిజియోథెరపీ చేయించుకోవాలని వైద్యులు సూచించారని హరీశ్ తెలిపారు.

నిమ్స్‌లో పిల్లలకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు ఆర్థిక ఇబ్బందుల వల్ల చికిత్స చేయించలేకపోతున్న వారికి ముఖ్యమైన సమాచారం. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో పిల్లలకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహించనున్నారు. డాక్టర్ రమణ దన్నపనేని ఆధ్వర్యంలోని యూకే వైద్య బృందం తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఈ వైద్య సేవలను అందించనుంది. ప్రతీ ఏటా వారం రోజులపాటు నిమ్స్‌లో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్న డాక్టర్ రమణ దన్నపనేని బృందం ఈ ఏడాది కూడా నిర్వహిస్తుంది. గుండెకు రంధ్రం, ఇతర గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులు ఎవరైనా సరే ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చునని నిమ్స్ సంచాలకులు ప్రొఫెసర్ నగరి బీరప్ప శుక్రవారం పేర్కొన్నారు. యూకే బృందంతోపాటు నిమ్స్ నుంచి కార్డియోథొరాసిక్ విభాగాధిపతి ప్రొఫెసర్ అమరేశ్వరరావు, సీనియర్ వైద్యులు గోపాల్, ఇతర సిబ్బంది సమన్వయంతో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఉచిత వైద్య సేవలను ఉపయోగించుకోవాలి అనుకునే వారు పంజాగుట్ట నిమ్స్‌లోని కార్డియో థొరాసిక్ వైద్యులను సంప్రదించాలని సూచించారు.

గుండెపోటుతో ఐదవ తరగతి విద్యార్థి మృతి


అఖిల్ (ఫైల్)

కోహీర్, సెప్టెంబరు 13: పట్టుమని పదేళ్లు కూడా నిండని బాలుడు గుండెపోటుతో మరణించిన ఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం మనియార్‌పల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన బల్లెపు శ్రీనివాస్‌కు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడైన అఖిల్(10) అక్కడి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు. అతను గురువారం అస్వస్థతకు గురికాగా, మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యులకు చూపించి ఇంటికి తీసుకువచ్చారు. అయితే, శుక్రవారం ఉదయం పాలు తాగిన బాలుడు... కాసేపటికే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు వెంటనే కోహీర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గుండెపోటు వల్లే అఖిల్ చనిపోయినట్లు గ్రామస్థులు చెప్పారు.

జీఎస్టీ కేసులో మాజీ సీఎస్ సోమేశ్‌కు నోటీసులు!

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలోని వస్తు సేవల పన్ను(జీఎస్టీ)లో వందల కోట్ల కుంభకోణం కేసు సీఐడీ దర్యాప్తులో మరో ముందడుగు పడింది. జీఎస్టీలో రూ. 1400 కోట్ల కుంభకోణంపై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ (185/2024) ఇదివరకే సీఐడీకి బదిలీ అయింది. కేసు దర్యాప్తుపై దృష్టి సారించిన సీఐడీ వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం అధికారుల్ని విచారించేందుకు సిద్ధమైంది. కుంభకోణం జరిగినట్లు జీఎస్టీ అంతర్గత విచారణ, సీసీఎస్ ప్రాథమిక విచారణలోనే నిగ్గు తేలిన నేపథ్యంలో అసలు నిందితుల్ని గుర్తించే పనిలో సీఐడీ నిమగ్నమైంది. కేసు దర్యాప్తులో భాగంగా మరికొందరికి నోటీసులు జారీ చేసి విచారించేందుకు సీఐడీ అధికారులు రంగం సిద్ధం చేశారు. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ రవి కానూరి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఐడీ కేసు విచారణలో ముందుకెళ్తోంది. వస్తువులు సరఫరా చేయకపోయినా చేసినట్లు బోగస్ ఇన్వాయిస్‌లను సృష్టించి పెద్ద ఎత్తున ఐటీసీని క్లెయిమ్ చేసినట్లు వాణిజ్య పన్నుల శాఖ గుర్తించింది. మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్‌తో సహా వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ కాశీవిశ్వేశ్వర రావు, డిప్యూటీ కమిషనర్ శివరామ్ ప్రసాద్ తదితరులకు నోటీసులు జారీ చేసి విచారించనున్నారు.

ప్రజాభవన్ వద్ద కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నా

- లోబీపీతో స్పృహ తప్పిన అధ్యాపకురాలు
- ప్రభుత్వ హామీతో ధర్నా తాత్కాలికంగా విరమణ

బేగంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యల్ని పరిష్కరించాలని అన్ని విశ్వవిద్యాలయాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు శుక్రవారం ప్రజాభవన్ వద్ద బైఠాయించారు. ప్రజావాణిలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు కదిలేది లేదంటూ కాంట్రాక్టు అధ్యాపకులు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రజాభవన్ వద్దే ఆందోళనకు దిగారు. దీంతో వారి ప్రతినిధులను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి చర్చల కోసం సచివాలయానికి తీసుకువెళ్లారు. ఉదయం నుంచి ధర్నాలో పాల్గొన్న డా. రజని అనే కాంట్రాక్టు అధ్యాపకురాలు లోబీపీతో స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే అక్కడి సిబ్బంది, సహచర అధ్యాపకులు ఆమెను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు చెప్పినట్లు ప్రజావాణి అధికారులు తెలిపారు. కాగా తమ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారని, ఈ నేపథ్యంలో ధర్నాను తాత్కాలికంగా విరమించినట్లు కాంట్రాక్టు అధ్యాపకుల కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ డా.సాధురాజేష్ తెలిపారు


సీఎంకు రూ.5 కోట్ల చెక్కును అందజేస్తున్న డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.నారాయణరెడ్డి. చిత్రంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సీఎంఆర్ఎఫ్‌కు డాక్టర్ రెడ్డీస్ 5కోట్ల విరాళం

- ఏఎంఆర్ ఇండియా, వెస్ట్రన్ నిర్మాణ సంస్థ కోటి చొప్పున
- నందమూరి బాలకృష్ణ రూ.50 లక్షలు
- సీఎంకు చెక్కు అందజేసిన ఆయన కుమార్తె తేజస్విని
- వోక్సెన్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు ప్రవీణ్ రూ.50లక్షలు

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)కి విరాళాల వెల్లువ కొనసాగుతోంది. పలువురు ప్రముఖులు, పలు కంపెనీలు సీఎంఆర్ఎఫ్‌కు తమ వంతు సాయంగా విరాళాలు అందజేస్తున్నాయి. శుక్రవారం పలువురు సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంతోపాటు సచివాలయంలో కలిసి చెక్కులు అందజేశారు. సినీ నటుడు, ఆంధ్రప్రదేశ్ హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలంగాణ వరద బాధితులకు ఇటీవల తనవంతు సాయంగా రూ.50లక్షలు ప్రకటించారు. ఈమేరకు రూ.50లక్షల చెక్కును శుక్రవారం బాలకృష్ణ కుమార్తె తేజస్విని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అందజేశారు. అలాగే డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.నారాయణరెడ్డి రూ.5 కోట్ల విరాళం సీఎంకు అందించారు. ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ రూ.కోటి, వోక్సెన్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు ప్రవీణ్ రూ.50లక్షలు, వెస్ట్రన్ నిర్మాణ సంస్థ తరఫున సుదర్శన్‌రెడ్డి, సంజయ్‌రెడ్డిలు రూ.కోటి విరాళం సీఎంకు అందజేశారు. మొత్తంగా శుక్రవారం రూ.8 కోట్లు సీఎంఆర్ఎఫ్‌కు విరాళంగా వచ్చాయి.


సీఎం రేవంత్‌కు రూ. 50లక్షల చెక్కును అందజేస్తున్న బాలకృష్ణ కుమార్తె తేజస్విని

తెలుగు రాష్ట్రాలకు రెండు వందేభారత్ రైళ్లు

నాగ్‌పూర్-సికింద్రాబాద్, విశాఖ-దుర్గ్ మధ్య సేవలు.. సోమవారం ప్రారంభించనున్న ప్రధాని



కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలకు మరో రెండు కొత్త వందే భారత్ రైళ్లు అందుబాటులోకి రానున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇప్పటికే సికింద్రాబాద్ నుంచి 4 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని, ఇప్పుడు మరో రైలు అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఈ రైలు సికింద్రాబాద్-నాగ్‌పూర్ మధ్య నడుస్తుందని.. నాగ్‌పూర్ నుంచి ఉదయం 5 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరి రాత్రి 8.20 గంటలకు నాగ్‌పూర్ చేరుకుంటుందని చెప్పారు. కాజీపేట, రామగుండం, బల్హార్షా, చంద్రాపూర్, సేవాగ్రామ్ స్టేషన్లలో ఈ ఎక్స్‌ప్రెస్ ఆగుతుందని వివరించారు. విశాఖపట్నం-దుర్గ్ (ఛత్తీస్‌గఢ్) మధ్య మరో వందే భారత్ రైలు సేవలు అందిస్తుందని కిషన్‌రెడ్డి తెలిపారు. రాయ్‌పూర్, మహాసముంద్, ఖరియార్ రోడ్, కాంతబంజి, తిత్లాగఢ్, కేసింగా, రాయగడ, విజయనగరం మీదుగా విశాఖపట్నం చేరుకుంటుందని తెలిపారు. ఈ రెండు రైళ్లను ఈ నెల 16న అహ్మదాబాద్ నుంచి ప్రధాని మోదీ ప్రారంభిస్తారని చెప్పారు. ఆ రోజు ప్రధాని దేశవ్యాప్తంగా 10 వందే భారత్ రైళ్లను ప్రారంభిస్తారని వివరించారు. వందే భారత్ రైళ్లపై సామాన్యులు మక్కువ చూపుతున్నారని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు వంద శాతం కంటే ఎక్కువ ఆక్యుపెన్సీ ఉందని పేర్కొన్నారు. నాగ్‌పూర్ నుంచి మొదలయ్యే వందే భారత్ రైలుకు సికింద్రాబాద్‌లో స్వాగతం పలకాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆహ్వానం పంపించారని వెల్లడించారు. తెలుగు రాష్ట్రాలకు వందే భారత్ రైళ్లను కేటాయించిన ప్రధాని మోదీకి కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఇప్పటివరకు నడుస్తున్న వందేభారత్ రైళ్లు 8నుంచి 16 బోగీలతో ఉండగా.. సికింద్రాబాద్ - నాగ్‌పూర్ వందేభారత్ 20 బోగీలతో నడవనుంది.

విమోచన ఉత్సవానికి అతిథిగా కిషన్‌రెడ్డి

ఈ నెల 17న పరేడ్ గ్రౌండ్ వేదికగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న తెలంగాణ విమోచన దినోత్సవానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆ రోజున కిషన్‌రెడ్డి.. జాతీయ జెండాను ఆవిష్కరించి సైనిక వందనం స్వీకరిస్తారు. గడచిన రెండు సార్లు కేంద్రం నిర్వహించిన ఈ వేడుకలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

త్వరలో హైడ్రా వెబ్‌సైట్!

సంస్థ విధులు, చెరువుల వివరాలు అందులోనే.. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాల సమాచారం కూడా

- భవిష్యత్తులో ప్రభుత్వ భూముల వివరాలుండేలా ప్రణాళిక
- ఫిర్యాదు చేయడమే కాదు.. వాటి స్థితిని తెలుసుకునే చాన్స్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): "ఫలానా ప్రాంతంలో ప్లాటు/ఫ్లాటు కొనుగోలు చేయాలనుకుంటున్నాం. ఆ భవనం/స్థలం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందా? ఫ్లాటు కొనుగోలు కోసం అడ్వాన్స్ ఇచ్చాం.. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, పార్కు స్థలంలో ఆ నిర్మాణం ఉందా? కొనుగోలు చేయాలా? వద్దా?"... ఇలా అనేక అనుమానాలతో హైడ్రా, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కార్యాలయాల చుట్టూ కొనుగోలుదారులు చక్కర్లు కొడుతున్నారు. అయితే.. ఇలాంటి ఇబ్బందులు త్వరలోనే చెక్ పడనుంది. భవనాలు/లే అవుట్లు.. ఎఫ్‌టీఎల్ లేదా బఫర్ జోన్‌లో ఉన్నాయా? లేదా? అన్న సమాచారాన్ని ఒక్క క్లిక్‌తో తెలుసుకునేలా సాంకేతికత అందుబాటులోకి రానుంది. ఇందుకోసం ఓ వెబ్‌సైట్‌ను తీసుకురావాలని హైడ్రా కసరత్తు చేస్తోంది. హైడ్రా స్వరూపం ఎలా ఉండాలి? విధులు.. తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి స్థాయిలోనూ చర్చించినట్టు తెలిసింది. వెబ్‌సైట్ రూపకల్పన బాధ్యతను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ)కు అప్పగించిన సంస్థ.. ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిపింది. కూల్చివేతల నేపథ్యంలో నెలకొన్న గందరగోళానికి చెక్ పెట్టేలా, సమగ్ర సమాచారం తెలుసుకునేలా వెబ్‌సైట్ ఉండాలని హైడ్రా భావిస్తోంది. సంస్థ ఏర్పాటు ఉద్దేశాన్ని స్పష్టంగా వివరించడంతోపాటు చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలపై ప్రజలు



ఫిర్యాదు చేసే అవకాశం కల్పించనుంది. ఫిర్యాదు స్థితిని ప్రజలే నేరుగా తెలుసుకునే అవకాశం కల్పించడంతోపాటు హైడ్రాలో అధికారిక వ్యవస్థ ఎలా ఉంటుందన్న వివరాలన్నీ పొందుపర్చాలని భావిస్తోంది. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని నిర్మాణాలు, లే అవుట్ల వివరాలు, కూల్చివేసిన భవనాల సమాచారమూ వెబ్‌సైట్‌లో ఉంచనుంది.

గూగుల్ ఎర్త్‌లో చెరువుల వివరాలు

తుది నోటిఫికేషన్ ప్రకటించిన చెరువుల మ్యాప్‌లు హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నా.. సాధారణ పౌరులకు ఏమాత్రం అర్థం కాని పరిస్థితి ఉంది. వెబ్‌సైట్‌లో కనిపించే మ్యాప్, సర్వే నంబర్ల ఆధారంగా క్షేత్రస్థాయిలో భౌగోళిక స్వరూపం అంచనా వేయడం దాదాపు అసాధ్యం. ఈ నేపథ్యంలో ఆయా చెరువుల కో ఆర్డినేట్స్‌ను గూగుల్ ఎర్త్‌లో అప్‌లోడ్ చేయాలని హైడ్రా భావిస్తోంది. హెచ్ఎండీఏ, ఇతర విభాగాల సహకారంతో ఈ ప్రక్రియ చేపట్టనున్నట్టు కమిషనర్ రంగనాథ్ తెలిపారు. దీంతో కొనుగోలు చేయాలనుకుంటున్న ప్లాటు లేదా ఫ్లాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉందా? లేదా? అన్నది గూగుల్ మ్యాప్స్‌లోనే చూసుకునే అవకాశం ఉంటుంది.కాగా, భవిష్యత్తులో ఔటర్ వరకు ఉన్న ప్రభుత్వ భూముల వివరాలూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఆయా సర్వే నంబర్లలో భూములు, ప్లాట్లు కొనుగోలు చేయకుండా ప్రజలను అప్రమత్తం చేయనున్నారు. కూల్చివేతల నేపథ్యంలో ప్లాట్లు/ఫ్లాట్ల కొనుగోలు చేసేందుకు ప్రజలు జంకుతున్న విషయం తెలిసిందే. ఈ వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చిన అనంతరం స్పష్టత వస్తుందని, ఎప్పటిలానే క్రయ, విక్రయాలు జరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

హైడ్రా ఖాతాలో 50కోట్లు జమ

హైడ్రాకు ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేసింది. శుక్రవారమే ఈ నిధులు సంస్థ ఖాతాలో జమ అయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఏర్పాటైన హైడ్రాకు 2024-25 బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించారు. ఇందులో మొదటి త్రైమాసికానికి సంబంధించి రూ.50 కోట్లు విడుదలయ్యాయి. సంస్థలోని అధికారులు, ఉద్యోగుల వేతనాలు, నిర్వహణ వ్యయం, కూల్చివేతల ఖర్చులకు ఈ నిధులను వినియోగించనున్నారు. ఆస్తుల పరిరక్షణ, విపత్తుల నిర్వహణ కోసం 3500 మంది సిబ్బంది అవసరమని ప్రాథమికంగా అంచనా వేశారు. త్వరలోనే పోలీస్ శాఖతోపాటు ఇరిగేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాల నుంచి అధికారులు హైడ్రాకు రానున్నారు. వీరందరి వేతనాలు, వాహన సదుపాయాల ఖర్చును హైడ్రా భరించనుంది.

జెత్వానీ కేసులో ఇద్దరిపై వేటు

- నాటి బెజవాడ పశ్చిమ ఏసీపీ, సీఐ సస్పెన్షన్
- ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ డీజీపీ
- విద్యాసాగర్, పీఎస్ఆర్, కాంతిరాణా
- గున్నీపై కాదంబరి మరోసారి ఫిర్యాదు

విజయవాడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో ఇద్దరు పోలీసు అధికారులపై వేటు వేశారు. నాడు కేసును దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణ, విజయవాడ పశ్చిమ జోన్ ఏసీపీ కె.హనుమంతరావును సస్పెండ్ చేస్తూ ఏపీ డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఆదేశాలు జారీ చేశారు. వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ చేసిన ఫిర్యాదుపై అప్పటి ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. ఆయన ఈ కేసుకు దర్యాప్తు అధికారిగా వ్యవహరించారు. ప్రస్తుతం గవర్నరుపేట ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. నెల రోజులుగా కాదంబరి జెత్వానీ వ్యవహారం సాగుతున్న సంగతి తెలిసిందే. శుక్రవారం రాత్రి కాదంబరి జెత్వానీ ఇబ్రహీంపట్నం పోలీసులకు మరోసారి ఫిర్యాదు చేశారు. తనపై అక్రమంగా కేసు నమోదు చేయించిన వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్, సహకరించిన ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్‌గున్నీపై ఫిర్యాదు చేశారు. ఇప్పటికే వారిపై కేసు నమోదు చేయాలని ఆమె కుటుంబం పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబుకు ఫిర్యాదు చేసింది. కొద్ది రోజుల క్రితం కాదంబరి మహిళా సంఘాలతో కలిసి సీపీని కలిశారు. తాజాగా తన న్యాయవాదులతో కాదంబరి, ఆమె తండ్రి నరేంద్రకుమార్, తల్లి ఆశా జెత్వానీ ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయనిపుణులతో చర్చించి కేసు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. కాదంబరి ఫిర్యాదు చేస్తుండగానే ఈ కేసుకు సంబంధించి అప్పటి పశ్చిమ జోన్ ఏసీపీ హనుమంతరావు, ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను సస్పెండ్ చేశారు. కాదంబరి వ్యవహారంలో మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఒక ఎస్ఐ పాత్ర ఉన్నట్టు అధికారులు నిర్ధారించినట్టు సమాచారం. త్వరలో వారి పైనా చర్యలు తీసుకునే సూచనలు కనిపిస్తున్నాయి.

సెల్‌ఫోన్ కోసం తల్లిని కొట్టి చంపిన కొడుకు

- రూ. 20 వేల కోసం హత్య..
- ఆపై సాధారణ మరణంగా చిత్రీకరణ
- అంత్యక్రియలు పూర్తి..
- బంధువుల ఫిర్యాదుతో మృతదేహాన్ని వెలికితీయించిన పోలీసులు

నారాయణఖేడ్, సెప్టెంబరు 13: సెల్‌ఫోన్ కొనేందుకు రూ. 20 వేలు ఇవ్వలేదని తల్లిని కొట్టి చంపేశాడో కొడుకు. ఆపై బంధువుల వద్ద ఆమెది సహజ మరణంగా చిత్రీకరించాడు. అనుమానం వచ్చిన బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు బాగోతం బయటపడింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బంటు రాజమ్మ(48), సాయిలు దంపతులకు నర్సింహులు, శ్రీనివాస్‌లు ఇద్దరు కుమారులు. బంటు సాయిలు 20 ఏళ్ల క్రితమే చనిపోయాడు. చిన్న కుమారుడు శ్రీనివాస్ మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడని స్థానికులు తెలిపారు. సెల్‌ఫోన్ ఫోన్ కొనుగోలుకు రూ.20 వేలు ఇవ్వాలని తల్లిని కోరగా, ఆమె తన దగ్గర అంత డబ్బు లేదని చెప్పింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి తాగిన మైకంలో తల్లితో గొడవ పడిన శ్రీనివాస్ ఆమెను కొట్టి, హత్య చేసి సాధారణ మరణంగా చిత్రీకరించాడు. గురువారం బంధువుల సమక్షంలో అంత్యక్రియలు చేశారు. అయితే, ఆ సమయంలో రాజమ్మ శరీరంపై గాయాలు కనిపించడంతో బంధువులు అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం ఖననం చేసిన రాజమ్మ మృతదేహాన్ని పోలీసులు వెలికితీయించి పోస్టుమార్టం చేశారు.

మద్యానికి బానిసై వేధిస్తున్నాడని కొడుకుని చంపిన తండ్రి

- సూర్యాపేట జిల్లాలో ఘటన

సూర్యాపేటరూరల్, సెప్టెంబరు 13: మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్థులను వేధిస్తున్న కుమారుడిని కన్నతండ్రే హతమార్చాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్)లో జరిగింది. మండలంలోని బాపూజీతండాకు చెందిన బాణోతు పంతులుకు ఓ కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు కిరణ్ ఇటీవల మద్యానికి బానిసై మద్యం మత్తులో కుటుంబసభ్యులు, గ్రామస్థులతో తరుచూ గొడవ పడుతున్నాడు. ఇంటి నుంచి వెళ్లిపోవాలని తండ్రిని పలుమార్లు కర్రతో కొడుతూ హింసిస్తున్నాడు. ఈక్రమంలో... ఈ నెల 11వ తేదీ రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో తండ్రి కొడుకుల మధ్య వాగ్వాదం జరిగింది. కిరణ్ తన తండ్రిని కొట్టడం మొదలుపెట్టాడు. కొడుకు ప్రవర్తనకు విసుగెత్తిపోయిన పంతులు అక్కడే ఉన్న గొడ్డలితో కిరణ్ తలపై వేటు వేశాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కిరణ్ భార్య సౌందర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి నిందితుడిని గురువారం అరెస్టు చేశారు.

భూములు ఖాళీగా ఉన్నా ఇక కబ్జా కావు

హైడ్రా భయంతో ఎవరూ ఆ ధైర్యం చేయలేరు.. హైకోర్టు వ్యాఖ్య

- వైసీపీ నేత కాటసాని భార్యకు దక్కని ఊరట
- ప్రహరీ పునర్నిర్మాణానికి అనుమతి నిరాకరణ

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హైడ్రా ఏర్పాటు, ప్రస్తుతం జరుగుతున్న కూల్చివేతల నేపథ్యంలో ఎఫ్‌టీఎల్‌లో ఎలాంటి భద్రత లేకుండా ఖాళీగా ఉన్న భూములను కబ్జా చేయడానికి ఎవరు ధైర్యం చేయబోరని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఎఫ్‌టీఎల్‌లో ఉందన్న కారణంతో హైడ్రా కూల్చివేసిన ప్రహరీని పునర్నిర్మించేందుకు అనుమతి ఇవ్వాలన్న వినతిని తిరస్కరిస్తూ ఈ వ్యాఖ్య చేసింది. పటాన్‌చెరు సమీపంలోని అమీన్‌పూర్ సర్వే నంబర్లు 324, 329లో ఉన్న 9ఎకరాల వ్యవసాయ భూముల్లో ఉన్న ప్రహరీ, షెడ్లను హైడ్రా కూల్చివేయడంపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి భార్య ఉమామహేశ్వరమ్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ భూములు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని పేర్కొంటూ హైడ్రా కూల్చివేతలు చేపట్టిందని తెలిపారు. తమవి పట్టా భూములని నిరూపించేలా గతంలో



హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు, నీటిపారుదల శాఖ అధికారుల రిపోర్టును సమర్పించారు. పట్టా భూముల్లో సాగు చేసుకుంటున్న పండ్ల తోటల్లో ఉన్న కట్టడాలను కూల్చివేయడం అక్రమమని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న జస్టిస్ టి. వినోద్ కుమార్ ధర్మాసనం.. ప్రహరీ పునర్నిర్మాణానికి అనుమతి ఇవ్వాలన్న విజ్ఞప్తిని తిరస్కరించింది. హైడ్రా ఏర్పాటు నేపథ్యంలో ఎఫ్‌టీఎల్ భూములను ఖాళీ చేసి అందరూ పారిపోతున్నారని, భూములను కబ్జా చేయడానికి ఎవరు ధైర్యం చేయడం లేదని వ్యాఖ్యానించింది. అమీన్‌పూర్ చెరువు దేశంలోనే మొదటి జీవ వైవిధ్య (బయోడైవర్సిటీ) సరస్సు అని పేర్కొంది. 1970లో రూపొందించిన అమీన్‌పూర్ లేక్ మెమైర్ (ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ విస్తీర్ణం, హద్దుల వివరాలతో కూడిన రికార్డు) సమర్పించాలని నీటిపారుదల, మున్సిపల్ శాఖలు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 3కు వాయిదా వేసింది.

హుస్సేన్‌సాగర్ చుట్టూ వలయాకార స్కైవే

ట్యాంక్‌బండ్ చుట్టూ స్కై వాక్

- నాగార్జునసాగర్ బ్యాక్‌వాటర్‌లో బోటు షికారు
- ఎకో-టూరిజం కేంద్రంగా చాకలిగట్టు
- ఆకట్టుకునేలా పర్యాటక విధానం
- 'ఆంధ్రజ్యోతి'తో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): హుస్సేన్‌సాగర్ జలాశయం చుట్టుపక్కల ప్రాంతాలను మరింత ఆకర్షణీయంగా మార్చేలా వలయాకార స్కైవే నిర్మిస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. స్కై వాక్ ద్వారా ట్యాంక్‌బండ్ చుట్టూ ఉన్న పర్యాటక ప్రదేశాలను చూసే వీలు కల్పిస్తామన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా తెలంగాణ వ్యాప్తంగా విస్తరించిన చరిత్రాత్మక, ఆధ్యాత్మిక, అటవీ ప్రాంతాల్లో వసతి సౌకర్యాలను మెరుగుపరిచేలా నూతన పర్యాటక విధానానికి రూపకల్పన చేస్తున్నట్టు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో జూపల్లి చెప్పారు. ఎకో-టూరిజం, హెల్త్ టూరిజం తదితర రంగాలకు పర్యాటక ప్రాధాన్యతను విస్తరించేందుకు స్థానిక కళలకు, ఉత్పత్తులకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. పర్యాటక రంగాన్ని ప్రైవేట్ పరం చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే పర్యాటక రంగ నిపుణులతో చర్చించడంతో పాటు పలు శాఖల ఉన్నతాధికారులతో సమావేశమై పర్యాటక రంగం అభివృద్ధి కోసం తీసుకోవలిసిన అంశాలపై సమీక్షలు నిర్వహించినట్టు తెలిపారు.

ఖజానాకు ఆదాయవనరుగా పర్యాటక శాఖ

ప్రభుత్వ నిధులతో పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయడమే కాకుండా పర్యాటక శాఖ రాష్ట్ర ఖజానాకు ప్రధాన ఆదాయ వనరుగా గుర్తింపు పొందడానికి కృషి చేస్తున్నట్టు మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. పర్యాటకులకు అవసరమైన రుచికరమైన భోజనం, ఆహ్లాదంగా గడిపేందుకు అవసరమైన వసతి సౌకర్యాలు, ఆయా ప్రాంతాలకు చేరుకునేందుకు సరైన రవాణా సౌకర్యాలను మెరుగుపర్చడానికి ఆయా శాఖలు, సంస్థల సహకారం తీసుకోవాలని ప్రతిపాదించినట్టు తెలిపారు. పర్యాటక శాఖ, సంస్థ ఆస్తులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా విస్తృత స్థాయిలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు, ఆదే స్థాయిలో ఆదాయాన్ని పెంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి

అంతర్జాతీయ స్థాయిలో బౌద్ధ పర్యాటకులను ఆకట్టుకునేందుకు నాగార్జునసాగర్‌లో బుద్ధవనంను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. బుద్ధవనంలో మ్యూజియం అభివృద్ధికి రూ.25 కోట్లు కేటాయిస్తామన్నారు. పర్యాటకులను ఆకట్టుకునేందుకు నాగార్జునసాగర్ బ్యాక్‌వాటర్‌లో బోటు షికారుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. అలాగే కృష్ణా నది నీటి ప్రవాహం మధ్య 400 ఎకరాల విస్తీర్ణంలోని ద్వీపం చాకలిగట్టు ప్రాంతాన్ని ఎకో-టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. అమ్రాబాద్, కవ్వాల్ రిజర్వ్ ఫారెస్టు ప్రాంతాల్లో పర్యాటకుల విడిది కేంద్రాలుగా, రాత్రి వేళల్లో అక్కడే బసచేసే విధంగా కాటేజీలను నిర్మించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని వివరించారు.

హైడ్రా తీరు ఆందోళనకరం

- జీహెచ్ఎంసీ అధికారాలు ఎలా బదలాయిస్తారు?: హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హైడ్రాను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 99పై స్టే ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. అదే సమయంలో ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించింది. హైడ్రా ఏర్పాటు విషయంలో ఆ చట్టబద్ధత లోపించినట్లు కనబడుతోందని వ్యాఖ్యానించింది. ఎలాంటి చట్టం లేకుండా కేవలం జీవో ద్వారా ఏర్పడిన హైడ్రా పని విధానం ఆందోళనకరంగా ఉందని అభిప్రాయపడింది. చట్టం ప్రకారం జీహెచ్ఎంసీకి ఉన్న అధికారాలను హైడ్రాకు ఏవిధంగా బదలాయిస్తారని ప్రశ్నించింది. హైడ్రా ఏర్పాటు, దాని విధులు, చట్టబద్ధతపై పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం అలియాపూర్ గ్రామంలోని సర్వే నెంబర్ 119/21, 22 ఉన్న తమ నిర్మాణాలను కూలగొట్టడంపై డి.లక్ష్మి అనే మహిళ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైడ్రా ఏర్పాటు చేస్తూ జారీ చేసిన జీవో 99 చట్ట విరుద్ధంగా ఉందని, దాన్ని కొట్టివేయాలని కోరారు. కేవలం నోడల్ ఏజెన్సీగా మాత్రమే ఉన్న హైడ్రా.. విశేషమైన అధికారాలు బదలాయించడం చెల్లదని తెలిపారు. ఎలాంటి నోటీసు లేకుండా పట్టా భూముల్లో ఉన్న నిర్మాణాలను కూల్చడం అన్యాయమని తెలిపారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం.. హైడ్రా పనితీరును తప్పు పట్టింది. హైడ్రాకు ఉన్న చట్టబద్ధత, ఏర్పాటు, విధులు తదితర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశించింది. పిటిషనర్ కోరిన విధంగా హైడ్రా జీవోపై ప్రస్తుత దశలో స్టే ఇవ్వలేమని పేర్కొంది. గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు పిటిషనర్ ఆస్తి విషయంలో టైటిల్, ఆధారాలు, అన్ని బిల్లులను పరిశీలించి చట్ట ప్రకారం నోటీసు ఇచ్చి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈనెల 19 కి వాయిదా వేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.